రోజంతా తన ప్రతాపం చూపించిన సూర్యభగవానుడు మెల్లమెల్లగా పడమటి కొండలమాటున మాయమయి పోతున్నాడు. సంధ్యాకాంత అరుణ రాగ రంజిత మయిన మోముతో నిశికి స్వాగతం పలుకుతున్నట్టుగా పడమటి ఆకాశం ఎర్రరంగుని పులుముకుంది. వీధులు, షాపులు, బస్సులు, జనంతో కిటకిటలాడిపోతున్నాయి.

1978 చక్రపాణి మొదటి అవార్డు పొందిన నవల

తలుపు తెరిచిన శబ్దానికి టకటక మోగుతున్న టైపుమిషను మోత ఆగింది. నారాయణ వెనక్కి తిరిగి చూశాడు. గిరిజ ఓ చేతిలో హాండ్‌బ్యాగ్, మరో చేతిలో కూరల సంచీ తీసుకుని లోపలికి అడుగుపెట్టింది. నారాయణ పలకరింపుగా నవ్వి, తిరిగి ముందున్న టైపుమిషనుమీద చకచకా టైపు చెయ్యటం మొదలుపెట్టాడు.

గిరిజ కూరలబుట్ట లోపలుంచి పెరటిలోకి వెళ్ళింది. అలసిపోయి, వేడిగా వున్న మొహంమీద చల్లటి నీరు దోసిళ్ళతో చల్లుకోగానే ప్రాణం హాయి అనిపించింది. టవల్‌తో మొహం తుడుచుకుంటూ నారాయణ దగ్గరగా వచ్చింది.

"కాఫీ తాగారా? ఇవాళ స్కూల్లో మీటింగు వుండటంవల్ల ఆలస్యమయింది." దీక్షగా టైపు చేస్తున్న నారాయణని చూస్తూ అడిగింది. నారాయణ తలఎత్తి చూసి, దగ్గరగావున్న గిరిజ చేతిని తనచేతుల్లోకి తీసుకున్నాడు. మొహంవంక పరీక్షగా చూస్తూ "బాగా అలసిపోయినట్టుగా ఉన్నావు. మొహం చూడు ఎలా వాడిపోయిందో" అన్నాడు మెల్లగా.

గిరిజ మెల్లిగా నవ్వింది. "ఊహు. రోజూ వుండే ఆలసటే. కాఫీ తాగారాలేదా?"

"తాగాను. సుషమ కలిపి ఇచ్చింది."

"పిళ్ళిద్దరూ ఎక్కడికి వెళ్ళారు? ఇంకా ఆటల్నుంచి రాలేదా ?" బొట్టు పెట్టుకొంటూ అడిగింది.

గిరిజ, కాఫీ గ్లాసులో పోసుకుని, స్టౌమీద అన్నానికి ఎసరు పెట్టివచ్చి, నారాయణ దగ్గరగా కుర్చీ లాక్కుని కూర్చుంచి. నోటిదగ్గర పెట్టుకోబోతూ చటుక్కున ఏదో గుర్తువచ్చినట్టుగా కాఫీ గ్లాసుని కిటికీమీద వుంచి ప్లాస్టిక్‌బుట్టలో వున్న అరటి పళ్ళలోంచి రెండు పళ్ళని తుంచి తీసుకువచ్చి నారాయణకిస్తూ, "తినండి ఇవాళ బజారులో అరటిపళ్ళు చవగ్గా ఇస్తుంటే తీసుకున్నాను" అంది.

నారాయణ తనొకటి తీసుకుని, 'నువ్వు తిను' అంటూ గిరిజకి వొకటి అందించాడు. గిరిజ కాఫీ తాగుతూ, చకచకా టైపుమిషనుమీద కదులుతూన్న నారాయణ వేళ్ళని చూస్తూ కూర్చుంది.

ఏదో గుర్తువచ్చినట్టుగా నారాయణ వేళ్ళు సడన్‌గా ఆగిపోయినాయి. "రాఘవయ్య పూర్తయిన కాగితాలు పట్టికెళ్ళాడు. ఇదిగో...ఇది లోపలపెట్టు" అంటూ జేబులోంచి ఐదురూపాయలనోటు తీసి గిరిజచేతికి అందించాడు.

గిరిజ నోటు తీసుకుంది. ఇద్దరిచూపులూ ఓ క్షణం కలుసుకుని మళ్ళీ విడిపోయినాయి. నారాయణ ముందున్న కాగితాలని దగ్గిరకి లాక్కుని టైపు చెయ్యడం మొదలుపెట్టాడు.

తలుపులు తోసుకుని సుడిగాలిలా తొమ్మిదేళ్ళ సురేష్ లోపలికి దూసుకొచ్చాడు. ఎదుట తల్లిని చూడగానే ఒక్కసారిగా వచ్చి కావిలేసుకున్నాడు గిరిజని ఆప్యాయంగా కొడుకుని దగ్గరికి తీసుకుంది. మొహంమీద పడుతున్న జుట్టుని పైకితోస్తూ 'ఆటలయినాయిరా? అక్కేది?' అంది.

"అక్క సీతావాళ్ళింట్లో తొక్కుడుబిళ్ళ ఆడుతోందమ్మా" అంటూ తల్లి చెవి దగ్గర నోరుపెట్టి మెల్లగా "అమ్మా! నేనొకటిఅడుగుతానుఇస్తావామరి?" అన్నాడు.

"ఏవిట్రా అంత రహస్యం?"

"నేను వినకూడనిదేమిట్రా నీ రహస్యం?" నారాయణ ఇద్దరినీ చూస్తూ నవ్వాడు. సురేష్ తల్లి మెడని అలా కావిలించుకునే "అమ్మా నాకో రూపాయి కావాలి. ఇవ్వవూ" అన్నాడు.

"రూపాయా? ఎందుకు?"

"ష్ అరవకు, నాన్నగారు వింటారు." రహస్యంగా అన్నాడు. గిరిజ నవ్వింది. "నీ రహస్యం నాన్నగారు వింటూనే వున్నారులే. ఇంతకీ రూపాయి ఎందుకో చెప్పు?"

"మరేమ్మా మా స్కూల్లో రంగడున్నాడే, వాళ్ళ నాన్న టిక్కెట్లు అమ్ముతునా డే" అన్నాడు.

ఏం టిక్కెట్లురా? స్కూల్లో ఏదయినా మేజిక్ షో వుందా?"

"కాదమ్మా. ఒకరూపాయి ఇవ్వమ్మా."

"ఇస్తాగానీ ఎందుకో చెప్పు."గిరిజ వాడి చేతుల్ని విడిపించుకుని లేవబోతూ ంది.

"మరి లాటరీ టిక్కెట్టుకోసం అమ్మా. ఒక్క రూపాయిపెట్టి టిక్కెట్టుకొంటే లక్షరూపాయిలొస్తాయటమ్మా. రంగడు చెప్పాడు." కళ్ళు పెద్దవిచేసి, కుతూహలంగా వున్న కొడుకుని చూసి లేవబోతున్న గిరిజ శరీరంలో శక్తినంతా ఎవరో గప్పున లాగినట్టుగా అలాగే కూలబడింది. టైపుమెషినమీద నారాయణ వేళ్ళు చటుక్కున ఆగిపోయినాయి. ఇద్దరిచూపులు ఒక్కక్షణం కలుసుకుని విడిపోయినాయి. మెల్లగా కంపిస్తున్న గిరిజ పెదవులుచూసి నారాయణ తలవంచుకొన్నాడు.

ఎప్పుడు వచ్చిందో ఏమో సుషమ, వీళ్ళ సంభాషణ అంతా వింటున్నట్టుగా, "అమ్మా! ఇవాళ మా హెడ్‌మాస్టారు రంగడిని బాగా కేకలేశారమ్మా స్కూల్లో లాటరీ టిక్కెట్లు లాటివి అమ్మకూడదని. ఇంకోసారి తెస్తే వాడిని పది బెత్తం దెబ్బలు కొడతా అన్నారు. వీడికి రూపాయి ఇవ్వమాకమ్మా" అంటూ లోపలికి వెళ్ళిపోయింది.

తల్లీ తండ్రీ ఒక్కసారి నిశ్శబ్దంగా అయిపోయేసరికి సురేష్ ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తూ తనన్న మాటల్లో తప్పేంవుందో తెలియక బిక్కమొహం వేసుకొని నిలబడిపోయాడు.

నారాయణ చెయ్యిచాచి సురేష్ని దగ్గరగా పిలిచాడు. వాడు వొచ్చి తండ్రి దగ్గరగా నిలబడ్డాడు.

"సురేష్! లాటరీ అంటే ఏమిట్రా" అంటూ ప్రశ్నించాడు.

తండ్రి ప్రశ్నతో సురేష్‌లో మళ్ళీ వుత్సాహం వచ్చింది. గిరిజ మెల్లగా కదిలి కిటికీలోంచి బయటికి చూస్తూ నిలబడింది.

సంధ్య చీకట్లు మునురుకుంటున్నాయి. వీధుల్లో ఒక్కటొక్కటిగా లైట్లు వెలుగుతున్నాయి.

"మరి నాన్నగారూ! మనం ఒక్కరూపాయి పెట్టి టిక్కెట్టు కొంటే మనకి లక్షరూపాయి లొస్తాయిటండీ. రంగడు చెప్పాడు మద్రాసులో బీచిలో బఠాణీలు అమ్ముకునేవాడికి అలాగే వచ్చాయిటండీ అ పసిమొహంలో మెదులుతున్న ఆశని, ఆ కళ్ళల్లోని కుతూహలాన్ని చూడలేనట్టుగా నారాయణ సురేష్‌ని చేత్తో దగ్గరికి లాక్కున్నాడు.

"మరి టిక్కెట్టు కొన్న ప్రతివాడికీ లక్షరూపాయిలొస్తాయా ఏంరా?" తండ్రి ప్రశ్న వాడి చిన్నబుర్రకి తికమకగా కనబడింది. వెంటనే ఏం జవాబు చెప్పాలో తట్టలేదు. రంగడు చెప్పిన సంగతి చటుక్కున గుర్తుకొచ్చింది

"పోతే ఒక్కరూపాయే గదండీనాన్నగారూ! వస్తే లక్షరూపాయిలొస్తాయి." లక్ష అన్న పదాన్ని వాడు పలికిన తీరుకి నారాయణ వాడివైపు ఓక్షణం తదేకంగా చూసి కళ్లుమూసుకున్నాడు.

'భగవాన్! ఇది వారసత్వమా? కాకూడదు. కాకూడదు!' అతని మనసు రోదిస్తోంది. ప్రార్థిస్తోంది మూగగా. చీకటిలోకి చూస్తున్న గిరిజ కళ్ళు నీటితో నిండి, మసకబారిన దృష్టికి ప్రపంచమే కదిలిపోతున్నట్టుగావుంది. కిటికీ చువ్వల్ని చేత్తో గట్టిగా పట్టుకుని వాటిమీద తలానించి కళ్ళుమూసుకుంది.

"సురేష్! ఒకసారి రూపాయిపెట్టి కొంటావు. లక్ష రూపాయలు రావనుకో. మళ్ళీ కొంటావనుకో, అప్పుడయినా వస్తుందా ?"

సురేష్ మౌనంగా నిలబడిపోయాడు.

"అప్పుడూ రాదనుకో. మరోసారి కొంటావు. ఇంకోసారి, ఆ తర్వాత మళ్ళీ మళ్ళీ అలా ఎంతకాలం కొంటూ ఉంటావురా ?"

"లక్ష రూపాయలు వచ్చేవరకు." ఇంత చిన్న విషయం అంత పెద్దమనిషికి తట్టలేదా అన్నట్టుగా వుంది వాడి గొంతు.

"అసలు ఎప్పటికయినా నీకు లక్ష రూపాయలు వస్తాయని గ్యారంటీ ఏమయినా వుందిట్రా ?"

సురేష్‌కు జవాబు తట్టలేదు.

నీకు లక్షరూపాయలు రాకపోగా ప్రతిసారి నువు రూపాయి చొప్పున ఎంత నష్టపోతున్నావో తెలుసా నీకు ? రూపాయి సంపాదించాలంటే ఎంత కష్టపడాలో, ఆ రూపాయికి ఎంత విలువ వుందో నీకు తెలుసురా సురేష్ ? రూపాయుంటే ఓ పూట కూరకి వస్తుంది. జబ్బుగా వుంటే మందు కొనుక్కోవచ్చు. నడవలేకపోతే రిక్షాలో వెళ్ళొచ్చు. ఓ గ్లాసు పాలు తాగచ్చు. ఓ నోట్సు పుస్తకం కొనుక్కోవచ్చు. మరింకెన్నో పనులు చెయ్యొచ్చు. అవునా ?"

ఒక్క రూపాయికోసం తండ్రి తలపగిలేటన్ని లెక్కలు ఎందుకు చెపుతున్నాడో వాడికి అర్థం కాలేదు

"ఈ లాటరీలనేవి చాలా చెడ్డవిరా సురేష్. నువు ఒక్క రూపాయితో లక్ష రూపాయలు సంపాదించాలనుకుంటున్నావన్నమాట. అవునా ? అంటే కష్టపడకుండా, తేలిగ్గా, డబ్బు సంపాదించాలని చూస్తున్నావన్నమాట. అంటే మనిషిలో అత్యాశ, సోమరిపోతుతనం బలిసిపోతుంది. నువు ఒకసారి వీటికి అలవాటుపడ్డావంటే అది మత్తులాగా పనిచేస్తుందిరా. ప్రతిమనిషీ కష్టపడి పనిచెయ్యాలి. డబ్బు సంపాదించాలి అప్పుడు నీకు కష్టం విలువ, డబ్బు విలువ అర్థం అవుతాయి అవునా ?"

నేరకపోయి అడిగాన్రా బాబూ అన్న భావం వాడి కళ్ళల్లో కనిపిస్తూనే వుంది

అయినా, రంగడి మాట గుర్తుకొచ్చి –

"లక్ వుంటే లాటరీ వస్తుందిటండీ" అన్నాడు సురేష్.

నారాయణ గుండెల్ని చీల్చుకుంటూ వచ్చిన నిట్టూర్పు గిరిజకి తాకినట్టుగా ఇటు తిరిగి చూసింది.

నారాయణ ఒక్క క్షణం ఎదురుగాఉన్న బైపురైటరుమీద దృష్టిని నిలిపి ఆప్యాయంగా దాన్ని చేత్తో తడిమాడు. టేబుల్‌మీద గిరిజ తనకి ఇచ్చిన అరటిపండు కనిపించింది. సురేష్‌ను దగ్గరగా కూర్చోపెట్టుకుని ఆ పండు వొలిచి తినిపించాడు. నారాయణ చేతులు పనిచేస్తూనేవున్నా మనసు ఆలోచిస్తూనే వుంది.

"సురేష్! నీ కో కథ చెప్పనా ?" అన్నాడు మెల్లగా. కథ పేరు వినగానే వాడి కళ్ళలో ఉత్సాహం కనబడింది. చెప్పమన్నట్టుగా తండ్రికి మరికాస్త దగ్గరగా జరిగాడు.

"అనగనగా ఓ వూళ్ళో ఓ అబ్బాయి ఉండేవాడు. వాడికి అమ్మ, నాన్న, అన్నయ్యలు, అక్కయ్య అంతా ఉన్నారు. వాళ్ళ నాన్న ఎంతో కష్టపడి డబ్బు సంపాదించి అందర్నీ చదివించాడు. వాడి అన్నలంతా చదువుకుని, ఉద్యోగాలు చూసుకుని తలో వూరు వెళ్ళిపోయారు. ఆ అబ్బాయి హైస్కూల్లో చదువుకుంటూ ఉండేవాడు. వాడికి ఇద్దరు ముఖ్యమయిన స్నేహితులు ఉండేవాళ్ళు..."

కథ వింటున్న గిరిజకి, చెపుతున్న నారాయణకి కళ్ళముందు ఎన్నో దృశ్యాలు గిరగిరా తిరిగిపోతున్నాయి.

"అమ్మా అన్నం మాడిపోతుంటే దింపేశానమ్మా" అన్న సుషమ మాటలు కూడా వినిపించలేదు.

2

నారాయణ, చలపతి, శంకరం హైస్కూల్లో ఒకటే క్లాసులో వున్నారు. ముగ్గురికీ మంచి స్నేహం

ఓ రోజు ముగ్గురు మిత్రులూ పెద్దబజారు వీధిలోంచి నడిచి వస్తున్నారు. కిళ్ళీకొట్టు ముందుకు వచ్చేసరికి 'న్నా న్నా, నారాయణా' అన్న కేక వినిపించి ముగ్గురూ తిరిగి చూశారు. కొట్టుముందు నిలబడి నత్తి సత్యన్నారాయణ పిలుస్తున్నాడు.

ముగ్గురూ దగ్గరగా వచ్చారు. చలపతికి కొంటెతనం ఎక్కువ. 'ఏ ఏ ఎందుకండీ స, స స్తెంగా రూ ?' అన్నాడు సత్యన్నారాయణని అనుకరిస్తూ.

సత్యనారాయణ తనను హేళన చేసేవాళ్ళను చూసి కోపం తెచ్చుకోవటం మానేశాడు వెంకన్నచౌదరి ఏకైక పుత్రుడు సత్యనారాయణ. హైస్కూలు చదువు దాటకుండానే చదువుకి స్వస్తి చెప్పేశాడు సత్యం. తండ్రి వెంటనే కొడుక్కి పెళ్ళిచేసేసి, తాళ్ళకొట్టు బాధ్యత కాస్తా అప్పచెప్పేశాడు. నారాయణ వాళ్ళ వీధి మొదటిలోవున్న పెంకుటిల్లే సత్యన్నారాయణది.

"ఏ ఏ ఎందుకండీ పి పి పిల్చారు ?" అన్నాడు చలపతి. శంకరం మందలింపుగా చూశాడు చలపతివైపు.

"నా నా న్నా నారాయణా ఈ కూ కూ,కూరల మా, సంచీ మా మా యింటి ద ద దగ్గర ఇచ్చేస్తావా ? పి పి పిచ్చయ్య ఎ ఎక్కడికో పో పో పోయాడు" అంటూ సత్యన్నారాయణ కూరలు వున్న కాకి సంచీని నారాయణ చేతి కిచ్చాడు.

"అలాగే ఇస్తాలెండి" అంటూ నారాయణ సంచీని అందుకున్నాడు సత్యనారాయణ కొట్టుమీద తీరుబడి వున్నప్పుడల్లా తోవనపోయే పరిచయంవున్న వాళ్ళందరినీ పిలిచి ఖబుర్లాడుతూ వుంటాడు. నారాయణకి ఆ కొట్లో వున్న రకరకాల మోకులు, కబంరి తాళ్ళు, నైలాను తాళ్ళు, వలలు మేదరి వస్తువులు అన్నీ చూస్తూ, తడుముకుంటూ మాట్లాడే సత్యన్నారాయణ మాటలు వినడం సరదా. సత్యన్నారాయణ దగ్గర ఎప్పుడూ ఏదో ఓ చిరుతిండి స్టాకులో ఉంటుంది. మరమరాలో, బఠానీలో, సెనగలో, జామకాయలో – ఇలా ఏదో ఒకటి తింటూ, నారాయణ చేతిలో కూడా కాసిని పోసి ఖబుర్లు చెప్తూ వుంటాడు.

"సత్తెంగారూ, మీరు మాటిమాటికి మద్రాసు వెళ్ళానంటా రేవిటండీ ? ఏముంది అక్కడ ?" అని అడిగాడోసారి నారాయణ.

సత్యనారాయణ ముసి ముసి నవ్వులు నవ్వి "వు వు వుందిలే ఓ ఓ ఓ రహస్యం, నీ నీ నీకు ఇప్పుడే తె తె తెలవదులే" అన్నాడు. సత్యనారాయణ లేనప్పుడు కొట్టుని పిచ్చయ్య చూస్తూ ఉండేవాడు. పెద్దలకి పిన్నలకి అందరికీ 'సత్తెం కొట్టు' అనటమే అలవాటు.

నారాయణ, చలపతి, శంకరం కలిసి సత్యన్నారాయణ ఇంటికి వెళ్ళి కూరల సంచీని అప్పచెప్పారు. తండ్రి కాళ్ళకి ఏదో కదలలేని ఇబ్బల్లే వుంది. ఎప్పుడు చూసినా పడక్కుర్చీలో పడుకుని చుట్టలు కాలుస్తూవుంటాడు. తల్లి కూరల సంచీ అందుకుంది. "నీ కిచ్చాడా నాయనా. కూరగాయల సంగతి మర్చిపోయాడేమో ననుకుంటున్నా. మతిమరుపాడు" అంటూ తలో సున్నివుండ ఇచ్చింది.

ఓసారి నారాయణ తల్లి నీళ్ళతోడే చేదకి తాడు తెమ్మని పంపింది. నారాయణ సత్తెం కొట్లో తాడు కొని తిరిగి వస్తుంటే, పొగాకు కాడలున్న ఓ పొట్లాన్ని నారాయణ చేతికిచ్చి, "మా మా నాయిన కిచ్చి పో, నా నా, న్నారాయణా" అన్నాడు సత్యన్నారాయణ.

నారాయణ పొగాకు ఇవ్వటానికి సత్యం ఇంటికి వెళ్ళాడు. సత్యన్నారాయణ తల్లి వరండాలో కూర్చుని బియ్యం ఏరుతోంది. కళ్ళమ్మట ధారగా నీళ్ళు కారుతున్నాయి. మధ్య మధ్య ముక్కు చీదేస్తూ ముసలాయనతో ఏదో ఘర్షణ పడుతోంది.

"నువ్విట్టాగే మెదలకుండా కూర్చో. సమస్తం ఆడిచేతికి అప్పచెప్పావు.



సచ్చినోడేమో గుర్రాలమీద అంతా తగలేసి చిప్ప చేతికిస్తాడు. అప్పుడు నువ్వు, నేను ఆ చిప్ప పట్టుకుని వీధులన్నీ తిరుగుతూ అడుక్కు-తిందాం" అంటూ ఏడుస్తోంది.

"వుండే వుండు ఏదవమాక ! ఆడ్ని ఇంటికి రానీ సెప్తా. పందెం గుర్రంలాగా ఆడ్ని పరిగెట్టిస్తానో లేదో చూద్దూగాని. అమ్మా, అమ్మా ఇంత దొంగెదవయిపోతాడా ? పంట డబ్బు కాస్తా పెట్టి పందేలాడొస్తాడా ఈడ్ని నరికెయ్య" అంటూ కదలలేని ముసలాయన మాటల్లోనే శౌర్యాన్నంతా ప్రదర్శిస్తున్నాడు. నారాయణకి ఇక అక్కడ నిలబడి వాళ్ళ మాటలు వినటం బాగుండదనిపించింది. లోపలికి వెళ్ళి ముసలాయనకి పొగాకు కట్ట అందించి, "సత్తెంగారు ఇమ్మన్నారండీ" అన్నాడు నారాయణ

ముసలాయన కొడుకుమీది కోపాన్నంతా కొడుకు పంపిన పొగాకు మీద చూపెట్టాడు. నారాయణ అందించిన పొగాకు కట్టని విసిరి పుచ్చుకుని గోడకేసి కొట్టాడు. "ఎదవన్నెరెదవ. ఏలకి ఏలు పందేల్లో తగలేసి అణా కాని పొగాకు కొని పంపిస్తాడా ?" అంటూ మాటల్ని గంతు లేయించాడాయన.

"బాగుంది నీ కోపం పొగాకుమీద చూయిస్తావేమిటి ? చేతనయితే ఆడి మీద చూపించు. సర్లే బాబూ నువు పోయిరా. అమ్మావాళ్ళంతా బావున్నారా ?" అంటూ ముసలాయన్ని గదిమి, నారాయణని కుశలప్రశ్న లేసిందావిడ.

"బాగానే ఉన్నారండీ" అంటూ నారాయణ ఇంటికి వచ్చేశాడు. చేదతాడు

తల్లి కిస్టూ సత్యన్నారాయణ యింట్లో తను విన్నది చూసింది అంతా తల్లికి చెప్పాడు.

"ఆ. పాపం ఒక్కడే కొడుకు గదా అని గారాబంగా పెంచారు ఆ సత్తిగాణ్ణి. వాడో భ్రష్టుడులాగా తయారయ్యాడు. ఆ తండ్రేమో కదల్లేడు. వీడు ఆడింది ఆట పాడింది పాటాను. వున్నదంతా తీసుకుపోయి గుర్రప్పందేల్లో తగలేస్తాడు. అందుకే ఘడియ ఘడియకి మద్రాసు పోతూ ఉంటాడు. పైగా పెళ్ళాం వంక. ఎందుకురా ఎప్పుడూ పట్నం పోతావు అంటే "మా ఆవిడ ఉంది గదండీ" అంటాడు వెధవ. వాడికి చిన్నతనంలోనే మేనమామ కూతుర్ని అంటగట్టి పెళ్ళిచేశారు. ఆ పిల్లకేమో మూర్ఛరోగం వుందని వీళ్ళంటారు, లేదని వాళ్ళంటారు. సత్తిగాడి మావకేమో మద్రాసులో వ్యాపారం. వీడేమో పెళ్ళాన్ని ఇక్కడికి తీసుకురాడు. దాని వంకపెట్టి మాటిమాటికి అక్కడికి పరుగెత్తుతాడు ఆ మావగార్ని అట్లాగే డబ్బంటూ పీడించుకు తింటాట్ట. అడిగిన డబ్బివ్వకపోతే కూతుర్ని ఎక్కడ చూడడోనని ఆయన భయం. అదీ, ఇదీ అంతా కలిపి ఆ గుర్రప్పందేల్లో చేతులు దులుపుకు వస్తూ వుంటాడు. మళ్ళీ వాడూ వాడి తాళ్ళకొట్టూ యధాప్రకార సిద్ధిరస్తు."

స్నానంచేసి లోపలికి వస్తున్న సుందరయ్యగారు భార్య వల్లిస్తున్నదంతా విని ఒక కేకవేశాడు. "ఎందుకీ పొరుగింటి పురాణాలన్నీ. ఏవిట్రా చెవులు దోరపెట్టుకుని వింటున్నావు ?" అంటూ.

నారాయణ పిల్లిలాగా లోపలికి వెళ్ళిపోయాడు. నత్తిగా మాట్లాడే సత్యన్నారాయణ వెనకాల ఇంత గాథ వుందని ఇవ్వాళే తెలిసింది. సత్యన్నారాయణ అందరి కోపానికి, ఛీత్కారాలకి గురవటానికి కారణమయిన ఆ గుర్రపు పందేలంటే ఏవిటో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది నారాయణకి. ఆ సాయంత్రం శంకరాన్ని అడిగాడు వాటిని గురించి.

శంకరం కాసేపు ఆలోచించి "ఆ గుర్రాలన్నిటికి రన్నింగు రేసు పెడతారనుకుంటారా ? ఏది ఫస్టు వస్తే దానికి ప్రైజు ఇస్తారేమో" అంటూ తన ఊహాగానాన్ని బయటపెట్టాడు.

నారాయణకి ఆ సమాధానం తృప్తి కలిగించలేదు. గుర్రాలకి ప్రైజు లిస్తే అందులో సత్యన్నారాయణని తిట్టవల్సిన అవసరం ఏమిటో అర్థంకాలేదు. చలపతిని అడిగాడు. చలపతికీ మొదట్లో అర్థంకాలేదు. కానీ చలపతికి రకరకాల స్నేహితులున్నారు. రకరకాల అభిరుచులున్న బంధుబలగం జాస్తి.

మర్నాటికల్లా నారాయణకి కావలసిన సమాచారం అంతా సమకూర్చుకొచ్చాడు. చలపతి జాకీలు, గుర్రాలు, వాటి పేర్లు, బెట్సు, జాక్‌పాట్లు అంటూ వరసగా చెపుతుంటే నారాయణ, శంకరం కళ్ళు చెవులు అప్పచెప్పి విన్నారు.

"బావ్‌రే. అయితే చూట్టానికి చాలా బాగుంటుందన్నమాట" అన్నాడు నారాయణ కుతూహలంగా.

"మరేట. మా బావ చెప్పాడు లక్షాధికారులు అక్కడికి వెళ్ళి భిక్షాధికారులు అయిపోతార్ట క్షణాల్లో" అంటూ చలపతి వాళ్ళ బావ దగ్గర నేర్చుకున్న దంతా చిలకపలుకుల్లా అప్పచెప్పేశాడు.

శంకరం గుర్తుచేసేవరకూ ఇద్దరికీ మరునాడు జరగబోయే లెక్కల పరీక్ష సంగతే గుర్తులేకపోయింది.

3

ఎస్ ఎస్.ఎల్.సి. పరీక్ష లయిపోయినాయి. స్కూలుకి శలవులిచ్చేశారు.

"ఏరా. ఎలా రాశావు పరీక్షలు ? గట్టుదాటేటట్టుగా వుందా లేదా ?" సుందరయ్యగారు ఆఫీసుకు బయల్దేరబోతూ అడిగాడు కొడుకుని.

"బాగానే రాశాను." నారాయణ గొణిగినట్టుగా చెప్పాడు. ఆయన ఆదరాబాదరాగా భోజనం ముగించి ఆఫీసుకి బయలుదేరబోతూ "శలవుల్లో గాడిదల్లాగా తిరక్క ఉపయోగపడే పన్లేవన్నా నేర్చుకొండి" అంటూ గొడుగు పుచ్చుకుని వెళ్ళిపోయారు.

నారాయణ తండ్రి వీధి మలుపు తిరిగేంతవరకూ అలాగే చూశాడు. వేసవికాలం ఎండలో చెమటలు కారుకుంటూ నడిచి వెళుతున్న తండ్రిని చూస్తే నారాయణకి కడుపులో ఏదో బాధగా వుంటుంది వెంటనే ఏదో ఓ గొప్ప పనిచేసేసి, తండ్రిని కూర్చోబెట్టి సమస్త సౌకర్యాలు సుఖాలు అనుభవించేలా చెయ్యాలని వుంటుంది నారాయణకి. ఆయన కొరుపట్టిన బట్టలు వేసుకున్నప్పుడు, ఎండలో నడిచి ~~వెళ్ళేటప్పుడు, అలిసిపోయి సాయంత్రంపూట~~ ఇంటికి రాగానే వాలుకుర్చీలో కళ్ళు మూసుకుని పడుకున్నప్పుడు నారాయణకి మనసులో ఏదో ఆవేశం, ఆప్యాయత, కోపం అన్నీ కలిసికట్టుగా తన్నుకొస్తాయి "నేను మాత్రం అన్నయ్యల్లాగా వుండను. ఎంత కష్టపడి అయినా సరే అమ్మా నాన్నలని సుఖపెడతాను" అనుకుంటాడు ఉద్రేకంగా.

"మీ కేవిటండీ సుందరయ్యగారూ! మహా అదృష్టవంతులు. వేలకి వేలు సంపాదించే కొడుకులున్నారు. ఇంకా ఇంత శ్రమపడతారేవిటండీ హాయిగా

ఇంట్లో కూర్చుని విశ్రాంతి తీసుకోక" అంటూ బంధువులుగానీ, స్నేహితులు గానీ అన్నప్పుడు ఆయన ఓ పేలవమైన నవ్వు నవ్వి వూరుకుంటారు. తండ్రి అలా మౌనంగా. నిర్లిప్తంగా నవ్వినప్పుడు నారాయణ గుండెల నెవరో పట్టి పిండుతున్నట్టుగా బాధపడతాడు.

సుందరయ్యగారికి నారాయణపైన ముగ్గురు కొడుకులు ఓ కూతురు ఉన్నారు. పెద్దకొడుకు చదువు కాగానే తెలిసినవాళ్ళద్వారా హైదరాబాద్‌లోని సెక్రటేరియేట్‌లో ఉద్యోగం వేయించారు. ఆ వెంటనే పెళ్ళికూడా చేసేశారు. పెళ్ళి అయ్యాక మెల్లమెల్లగా తలిదండ్రులున్నారన్న విషయాన్నే మర్చిపో సాగాడు ఆ ఘనుడు. సుందరయ్యగారు బాధపడలేదు. 'లోక రీతే అంత' అనుకున్నారు.

రెండోవాడు విశ్వం చదువులో చురుగ్గా వచ్చాడు. ఆయన తాహతుకి మించినదయినా ఎమ్. ఏ. చదివించారు. చదువుతున్నప్పుడే ఓ గుజరాతీ పిల్లని ప్రేమించాడు విశ్వం. చదువు కాగానే పెళ్ళిచేసుకున్నాడు. కొడుకు పెళ్ళి అయిన తర్వాతనే ఆయనకి ఆ విషయం తెలిసింది. ఆ పిల్ల బంధువు లంతా బొంబేలో వుంటున్నారు. మావగారి పరపతితో విశ్వం మంచి ఉద్యోగాన్నే సంపాదించుకున్నాడు. మరి కొన్నాళ్ళకి భార్యతో కలిసి విదేశాలకి కూడా వెళ్ళిపోయాడు. పార్వతమ్మగారు కొడుకుని తలుచుకుని బాధపడుతుంటే ఆయన కేకలేసేవారు.

"చెట్టు నాటాం కదా అని కాయలన్నీ మనకే కావాలనుకుంటే ఎలాపార్వతీ? అవి ఎవరికి ప్రాప్తో వాళ్ళకే దక్కుతాయి. మన కర్తవ్యం ఏదో అది చెయ్యటంవరకే మన బాధ్యత" అనేవారాయన. కానీ తల్లి ప్రాణం అంత తేలిగ్గా వూరుకునేదిగాదు. గుర్తొచ్చినప్పుడల్లా తమని అంత తేలిగ్గా మరిచి పోయిన ఆ కొడుకుని తల్చుకుని ఏడుస్తూ వుంటుందావిడ. అలాటి సమయాల్లో నారాయణ మనసులో 'ఏమయినా సరే నేను ఒక్కనాటికీ అమ్మనీ, నాన్ననీ ఇలా బాధపెట్టను' అని దృఢంగా అనుకుంటూ వుంటాడు.

విశ్వం విదేశాలకి వెళ్ళేముందర వచ్చి తలిదండ్రుల్ని చూసి ఓ గంట సేపు వుండి వెళ్ళిపోయాడు 'పోనీలే గుర్తుపెట్టుకుని వచ్చావు అదే పదివేలు' అన్నారు సుందరయ్యగారు. విశ్వం ఆ మాటల్లోని తండ్రి బాధనిగానీ, ఆవేదననుగానీ అర్థం చేసుకున్నా పట్టించుకునే స్థితిని ఏనాడో దాటిపోయాడు. తల్లి బలవంతాన భోజనానికి కూర్చుని 'బాబోయ్ మన ఆంధ్రుల కారాలు

ఎవ్వరూ తినలేరు' అంటూ, తల్లి ఎంతో ప్రేమగా, ఆప్యాయంగా తన కిష్టమని తయారుచేసిన పదార్థాలన్నీ అటూ ఇటూ నెట్టేసి పెరుగుపోసుకుని తిని వెళ్ళిపోతూంటే ఆవిడ మనసు గిలగిల్లాడిపోయింది. మనసుకి కానరాని గాయం తగిలినట్టుగా మౌనంగా ఉండిపోయింది నారాయణకి తల్లిని చూసి కళ్ళల్లో నీళ్ళు తిరిగినాయి.

"పోనీ అమ్మా వెధవని. వాడికోసం బాధపడతావెందుకు?" అన్నాడు కసిగా. అమూల్యమైన తల్లి ప్రేమని అలా నిర్లక్ష్యం చేసిపోయిన అన్నగారంటే నారాయణకి ఎక్కడలేని కసి, అసహ్యం కలిగినాయి

నారాయణ పైవాడు శ్రీధరం. చదువులో అంతంత మాత్రమే సుందరయ్య గారు అతి ప్రయత్నంమీద కొడుక్కి ఎంక్ట్రిసిటీ డిపార్టుమెంటులో ఉద్యోగం వేయించారు. శ్రీధరానికి వచ్చేది అతనికే సరిపోదు దానికితోడు ఏడాదిలో ట్రాన్స్ఫర్. రైలు ఖర్చులకే బోలెడంత అవుతాయి అని రెండేళ్ళకోసారయినా రాడు శ్రీధరం. శ్రీధరం పైది శారద. మంచి వుద్యోగంలో వున్న కుర్రాడిని చూసి వెనకా ముందు బాదరబందీలు లేవంటూ హైస్కూలు చదువయినా దాటని శారదకి పెళ్ళిచేసి పంపించేశారు. చివరికి వాళ్ళదగ్గర మిగిలింది నారాయణ మాత్రమే. ఆ దంపతులిద్దరి ఆశలూ నారాయణ మీదేను చివ్రరోజుల్లో నారాయణయినా తమ చేతికి ఆసరా అయ్యేట్టు చూడమని ఆ దంపతుల మూగ ప్రార్థన కానీ విధి అనేది ఏ క్షణంలో ఎవరితో ఎలా ఆడుకోవాలనుకుంటుందో అదిమాత్రం మానవ మేధకి అనూహ్యంగదా!

చలపతి, శంకరం, నారాయణ శలవలు ఎలా గడపాలన్న ఆలోచనలో వున్నారు.

"నేను మెద్రాసు మా మామయ్యగారింటికి వెడుతున్నాను మా పెదనాన్న గారమ్మాయి పెళ్ళికూడా వుంది" అన్నాడు చలపతి. "మా బావ రేస్‌కోర్స్ గ్రౌండ్స్ అవన్నీ చూపిస్తానన్నాడురోయ్." రహస్యంగా చెప్పాడు.

"మా అక్కయ్య దగ్గరికి వెళ్ళమంటోంది అమ్మ. కానీ ఆ వూళ్ళో కాల క్షేపం కాదురా బాబూ బోర్ కొట్టేస్తుంది. చూసేందుక్కూడా ఏమీ వుండవు." నిరుత్సాహంగా అన్నాడు నారాయణ

శంకరం మౌనంగా వాళ్ళ మాటలు వింటూ వున్నాడు శంకరానికి శలవల్లో వెళ్లి చూడతగ్గ దగ్గర బంధువులుగానీ, ఆప్యాయంగా ఆదరించేవాళ్ళుగానీ ఎవరూ లేరు. శంకరానికి ఐదో ఏటనే తల్లీ దండ్రీ ఇద్దరూ పోయారు. అప్పటికి

శంకరం చెల్లెలు గిరిజ మూడేళ్లది. బాధ్యతగా దగ్గరకి తీసుకుని పెంచే బంధువు లెవ్వరూ లేకపోయారు వాళ్ళకి. ఏమీకాని శాంతమ్మ ఆ దిక్కులేని పిల్లల్ని చూసి జాలిపడి చేరదీసింది. పెంచి పెద్దవాళ్లని చేసింది. ఆ అన్నా చెల్లెల్లిద్దరికి ఈ ప్రపంచంలో వున్న ఆత్మీయురాలు ఆవిడ ఒక్కతే. ఆ కారణంగానే శంకరం అంత చిన్న వయసులోకూడా ఇంటి బాధ్యతంతా మీద పడినట్టుగా పెద్దతరహాగా ప్రవర్తిస్తూ వుంటాడు.

నారాయణ మౌనం గమనించిన నారాయణ అన్నాడు. "శంకరం నువుకూడా రారా మా అక్కగారింటికి. నాక్కూడా కాలక్షేపం అవుతుంది" అన్నాడు.

"ఊహు నేనెక్కడికీ రానురా మా గిరిజని, మామ్మని విడిచిపెట్టి" అన్నాడు దృఢంగా శంకరం.

ఆ శలవల్లో శారద దగ్గర కొన్నిరోజులు గడిపి మేనమామగారింటికి వెళ్ళాడు నారాయణ.

శంకరం మేనమామ జగన్నాధంగారు పేరుమోసిన లాయరు. రెండు చేతులా సంపాదిస్తున్నారు. పొలాలున్నాయి, రకరకాల కంపెనీల్లో షేర్లున్నాయి. రకరకాల సంఘాల్లో సభ్యత్వాలున్నాయి, గౌరవ పదవులున్నాయి. ఎప్పుడూ వూపిరి పీల్చుకోవటానికి కూడా టైంలేని వ్యక్తిలాగా హడావిడిగా వుంటాడు. ఆయన నిద్రలేవకముందునించే జనం ఆయనకోసం ఎదురుచూస్తూ కూర్చుని వుంటారు. అర్ధరాత్రవుతున్నా బలవంతాన వాళ్ళని వదుల్చుకుని రావల్సిందే గానీ వాళ్ళంతటవాళ్ళు వదలరు. నారాయణని అన్నిటికంటే ఎక్కువ ఆకర్షించింది ఆయన రెండుచేతులా డబ్బుని ఖర్చుపెట్టే పద్ధతి!

"ఇదుగో వెంకట్రావ్ ఈ వెయ్యి తీసుకువెళ్లి ఆ ఎరువుల బస్తాలు పొలాల్లోకివించు" అంటూ నోట్ల కట్టలు ఎగరేసేవాడు.

"రాఘవులూ కరువంతా నీ దగ్గరే మండిపోతున్నట్టుందే. మామిడి రసాలు పాతిక ముప్పైరూపాయలా? ముప్పైగిప్పైలేదు. వంద చేసుకుని ఓ వంద పంపించు" అంటూ వందరూపాయల నోటుని చింపిరి కాగితంలాగా ఎగరేసే వాడు

పదివేలు అర్జంటుగా సర్దగలరా అవసరం పడింది అంటూ ఫోనుచేసిన పెద్ద మనిషితో "పది లేవండీ కావాలంటే ఐదు సర్దగలను" అంటూ మాంత్రికుడు టోపిలోంచి నోట్ల కట్టల్ని తీసినట్టుగా ఇనప్పెట్టె తెరిచి అందులోంచి కట్టలు కట్టలుగా కట్టిన డబ్బుని లెఖ్ఖలేనట్లుగా ఖర్చుపెట్టేవాడు.



"సంపాయించేది తినటానికి కాదుటండీ! అనుభవించకపోతే ఈ సంపాదించేది ఎవరికోసం చెప్పండి. రేపు నే చచ్చిపోయిన తరువాత ఈ పిల్లవెధవలు సరిగా తద్దినాలయినా పెడతారో లేదో?" అంటూ జోక్ చేశేవాడు.

ఆయనకి ఇంటికి ఎవరొచ్చారో, ఎవరు వెళ్ళారో కూడా తెలియనట్టే వుండేది. నారాయణ వచ్చిన రెండురోజుల తరువాత భోజనం చేస్తూన్న జగన్నాథం గారు ఎదురుగా నిలబడిన మేనల్లుడిని చూశారు.

"ఓరి నీ నారాయణా! ఎప్పుడొచ్చావురా? రైలుకా, బస్సుకా? అమ్మా, నాన్నా అంతా బావున్నారా? ఏమర్రా! నారాయణకికూడా భోజనం వడ్డించండి" అంటూ హడావిడి చెయ్యటం మొదలుపెట్టాడు.

నారాయణకి నవ్వొచ్చింది. "బాగానేవుంది మీ సంబరం. నారాయణ వొచ్చి రెండురోజులయితే ఇప్పుడేనా రావటం అంటూ అడుగుతారేవిటి?" అంటూ ఆయన భార్య నవ్వింది.

ఇంతకీ ఈ రెండు రోజుల్నించి నారాయణ ఆయన పక్కనే వుంటూ అయన ప్రతి చర్యా శ్రద్ధగా గమనిస్తున్నాడు. ఆయన అడిగినప్పుడల్లా ఇంట్లోంచి డబ్బు తీసుకొచ్చి చేతికి ఇస్తూనే వున్నాడు.

జగన్నాధంగారు ఎంతో దర్జాగా బట్టలేసుకుని కార్లలో వచ్చేవాళ్ళని కూడా లెఖ్ఖలేనట్లుగా మాట్లాడటం, ఆయన కేకలేస్తున్నా కిక్కురుమనకుండా వాళ్ళు అవన్నీ భరించటం, ఆయన జారీచేసే ఆర్డర్లన్నీ క్షణాల్లో నెరవేరిపోతూ

వుండటం, విచ్చలవిడిగా రెండుచేతులా డబ్బు ఖర్చుపెట్టే తీరూ ఇవన్నీ చూసిన నారాయణకి ఇదో సరికొత్త అనుభవం.

నారాయణకి ఇంటిదగ్గర సొంతానికి అంటూ ఎప్పుడూ డబ్బుండేది కాదు. ఏదయినా అవసరానికి భయపడుతూ తండ్రిని అడిగేవాడు. పది రూపాయలు అడిగితే తండ్రి ఐదు రూపాయలిచ్చేవాడు. మిగిలినవి పై నెల్లోకొందుగానిలే అనేవాడు. జగన్నాధంగారింట్లో పిల్లలుకూడా పదిరూపాయల నోట్లని లెఖ్ఖ లేనట్టుగా ఖర్చుచెయ్యటం నారాయణకి విచిత్రంగా వుండేది. నారాయణ వూరు తిరిగి వెళ్ళేటప్పుడు తను ఇన్నాళ్ళు బ్రతికింది ఎంత అర్ధవిహీనమయిన బ్రతుకో, తను ఎన్నెన్ని సరదాలు, ధనలోపంవల్ల కోల్పోతున్నాడో తెలిసినట్లయింది. జీవితంలో మజా రావాలంటే ఎలా జీవించాలో, దానికో పంచాక్షరీ మంత్రం వుందని బోధపడినట్లయింది. అదే 'ధనదేవత' అనుకున్నాడు.

4

నారాయణ శలవలు ముగించి ఇంటికి తిరిగివచ్చేసరికి పరీక్షల రిజల్ట్సు వచ్చి నాయి. శంకరం పాసయినాడు. నారాయణ, చలపతిల పరీక్ష పోయింది. పరీక్ష పోయిన దిగులుకంటే ఎక్కువగా డీలాలు పడిపోయిన తల్లిని తండ్రిని చూసి నారాయణ మరింత నిరుత్సాహపడిపోయాడు.

ఓ రోజు తెల్లవారేసరికి వూరంతా పొగలాగా గుప్పున ఓ వార్త వ్యాపిం చింది. 'తాళ్ళ సత్యానికి' గుర్రపు పందాల్లో ఆరు లక్షల రూపాయలొచ్చా యట! వూరిలో ఏ వీధిలో, ఏ షాపులో చూసినా, ఏ మనిషి నోటవిన్నా ఇదే మాట! నారాయణకి పరీక్ష పోయిందన్న దిగులు ఈ వార్త కలిగించిన సంచల నంలో కొంత సర్దుకుంది.

చలపతి మరో వారం రోజుల తరవాత వచ్చాడు. పరీక్ష పోయిందన్న విచారమే లేదు. మంచి స్టైయిల్స్‌లో బట్టలు కుట్టించి తెచ్చుకున్నాడు. అవన్నీ మేనమామ ప్రజెంట్ చేశాడట! తను చూసిన రేస్‌కోర్సు, తిరిగిన జాగాలు, చూసిన వింతలు అన్నీ కళ్ళముందు కదిలేట్టుగా వర్ణించి చెప్పాడు. చలపతి రాక నారాయణలో మిగిలివున్న విచారాన్ని పోగొట్టింది.

మిత్రులు ముగ్గురూ వారంరోజులపాటు సత్యన్నారాయణ తాళ్ళకొట్టు ముందు నించి తిరిగారు. కొట్లో సత్యనారాయణ జాడలేదు. పిచ్చయ్య మాత్రం కొట్లో కూర్చుని కనిపించాడు. ఉబ్బిపోయిన బెలూన్‌లాగా పిచ్చయ్య మహా సంతోషంగా వున్నాడు.

"సత్తెంగారు ఎపుడొస్తాడయ్యా!" అని అడిగాడు నారాయణ.

'వచ్చెయ్యాల్సిందే ఈపాటికి. నిన్న వస్తానని రాశాడు. నిన్నరాత్రంతా ఏ కారు హారను వినిపించినా సత్యమే వచ్చాడేమోనని ఎదురు చూడటంతోనే సరిపోయింది" అన్నాడు పిచ్చయ్య.

"ఓరి నీ గొప్పలు త"లెయ్య" అన్న చలపతి మాటలు విని గుర్రుగా చూసేడు పిచ్చయ్య. మరే వాగుడు వాగకముందే శంకరం, నారాయణ చలపతిని అవతలికి లాక్కుపోయారు.

నాలుగురోజుల తరువాత సత్యన్నారాయణ దిగాడు నల్లటి ఎంబాసిడర్ కారులో. సరాసరి కొట్టు దగ్గరికే వచ్చాడు. మనిషి ట్రిమ్ముగా డ్రస్సయి వున్నాడు. అప్పుడే మనిషిలో డబ్బు తెచ్చిన నిర్లక్ష్యం మెల్ల మెల్లగా ప్రవేశిస్తోంది. రెండ్రోజులు తాళ్ళకొట్టు తిరనాళ్ళలాగా తయారయింది. ప్రతివాళ్ళూ రావటం, సత్యన్నారాయణని అభినందించి, అతని అదృష్టాన్ని పొగడటం, వివరాలన్నీ అడిగి తెలుసుకోవటం, లోపల్లోపలే అసూయపడుతూ 'ఓరి నీ సత్తిగా, నీకెంత అదృష్టం పట్టిందిరా నత్తి వెధవా' అనుకుంటూ తిరిగి పోవటం !

వారంరోజుల తరువాత నారాయణ అటుగా వెడుతూ తాళ్ళకొట్టువైపు చూశాడు. సత్యన్నారాయణ సిగరెట్టు కాలుస్తూ దర్జాగా కూర్చుని వున్నాడు. గ్లాస్కోలాల్చీ, పంచెలో తెలుగు సినిమా హీరోలాగా వున్నాడు. నారాయణని చూస్తూనే చెయ్యూపి రమ్మన్నట్టుగా సైగ చేశాడు.

"ఏ ఏ ఏవోయ్ నారాయణా, బ్బా బ్బా బాగున్నావా ?" అంటూ పలకరించాడు.

"ఖలే ఛాన్సు కొట్టేశారండీ సత్యంగారూ" అన్నాడు నారాయణ ఆరాధనగా సత్యన్నారాయణ వైపు చూసి

"దా కూర్చో" అంటూ కాగితంలో వున్న వేయించి కారం చల్లిన జీడిపప్పు ఓ గుప్పెడు నారాయణ చేతిలో పోశాడు. స్థితి మారటంతో మరమరాలు కాస్తా జీడిపప్పుల్లోకి మారింది.

జేబులోంచి పది రూపాయల నోటు తీసి పిచ్చయ్య వైపు విసిరేస్తూ 'గో, గో, గోల్డ్ ఫ్లేక్' అనే లోపలే పిచ్చయ్య నోటు పుచ్చుకొని పక్కకొట్లోకి పరుగెత్తాడు.

నారాయణకి ఇందాకటినించీ ఓ ప్రశ్న మనస్సులో వేధిస్తోంది. "సత్యంగారూ, ఇంత డబ్బు ఏం చేసుకుంటారండీ?" చిట్టచివరకు అడిగేశాడు.

సత్యన్నారాయణ నోట్లోవున్న పళ్ళన్నీ వూగిపోయేట్టుగా నవ్వాడు. "బి బి బలే ప్రశ్న ఏ ఏ ఏశావే !" నారాయణకి అందులో అంత నవ్వవలసింది ఏముందో అర్థంకాలేదు.

"న్నీ న్నీ, నీకే వస్తే, న్ను న్ను నువ్వేంజేస్తావ్ ?" అంటూ ఎదురడిగాడు సత్యన్నారాయణ

నారాయణకి వెంటనే జవాబు తట్టలేదు. నిజమే తనకే అంత డబ్బు ఒక్కసారిగా వస్తే ! నారాయణ గుండె ఒక్క క్షణం వేగంగా కొట్టుకుంది. అయోమయంలోపడ్డ నారాయణని చూసి సత్యన్నారాయణ నవ్వాడు.

"నా న్నా నా పనీ అట్టాగే వుంది" అన్నాడు చివరికి నారాయణకి ఎందుకో ఒక్కసారి సత్యన్నారాయణ తలిదండ్రుల్ని చూడాలనిపించింది. ఇదివరకల్లా ఇద్దరూ సత్యన్నారాయణకున్న చెడుఅలవాటుని చూసి తిట్టి,ఏడ్చారు. ఇప్పుడదే దారి తప్పి అదృష్టంగా మారి సత్యన్నారాయణ గళసీమని అలంకరించింది. ఈ హఠాత్ ధనప్రాప్తికి ఆ ముసలివాళ్ళిద్దరూ సంతోషపడుతున్నారా దుఃఖపడుతున్నారా అన్న కుతూహలం కలిగింది.

నారాయణ ఇంటికి వెళుతూ సత్యన్నారాయణ ఇంటి దగ్గర ఆగి లోపలకు చూశాడు. ఇంటి ముందర ఓ కారు ఆగి వుంది మెడనిండా నగలు దిగేసుకుని, ఖరీదయిన జరీ చీర. పెద్దముడిచుట్టూ పూలు చుట్టుకొనివున్న ఓ లావుపాటి ఆవిడతో సత్యన్నారాయణ తల్లి సంతోషంగా ఖబుర్లు చెపుతోంది. ఎప్పుడూ లేనిది లోపల్నించి ముసలాయన నవ్వు పెద్దగా వినిపిస్తోంది. వాళ్ళంతా చాలా సంతోషంగా వున్నట్టు రూఢి అయింది నారాయణకి. డబ్బు స పాదించే మార్గం ఏదయినా ఫరవాలేదు. జీవితంలో సంతోషంగా, సుఖంగా వుండటానికి మాత్రం డబ్బు ముఖ్యం అనుకున్నాడు నారాయణ. ఇంటికి రాగానే తల్లి పక్కింటివాళ్ళతో అనటం వినిపించింది నారాయణకి. సత్యన్నారాయణ భార్య పెళ్ళి అయిన అయిదేళ్ళ తరువాత అత్తారింటికి వచ్చేసిందిట !

5

శంకరం కాలేజీలో చేరిపోయాడు. నారాయణ, చలపతి సెప్టెంబరుకి కట్టి మళ్ళీ తప్పారు. మార్చికి కట్టి ఎలాగో పాసయ్యారు.

సత్యన్నారాయణ శ్రీనివాసపురంలో వెయ్యిగజాల స్థలంలో బ్రహ్మాండమయిన మేడ కట్టించాడు. అన్ని హంగులతోనూ మేడ పూర్తయిన రోజున వూళ్ళోని పెద్దలందరికి ఘనమయిన విందు చేశాడు. 'గజలక్ష్మి సదన్' అని రాసివున్న

తెల్లటి పాలరాతి ఫలకాన్ని గేటుకి తాపడం చేయించాడు. సత్యన్నారాయణ భార్య ఆ పాలరాతిని చూసుకుని మురిసిపోయిందిట. ఆవిడ పేరు గజలక్ష్మి.

మరో ఏడాది గడిచింది. నారాయణ, చలపతి కాలేజీలో మొదటి సంవత్సరం పూర్తిచేశారు. శంకరం బి ఎ.లో చేరాడు. సత్యన్నారాయణ వాళ్ళ వార్డులో కౌన్సిలరుగా నిలబడి గెలిచాడు. మెయిన్ రోడ్డుమీద "సత్యన్నారాయణ సిల్క్ ప్యాలెస్" అంటూ ఓ వస్త్ర దుకాణం వెలిసింది. దాని ఓనరు తాళ్ళ సత్యన్నారాయణే! పెద్దకాలువ రోడ్డుమీద "సత్యనారాయణ టింబరు డిపో" వెలిసింది. దాని ఓనరు కూడా సత్యన్నారాయణే!

పూర్వపు తాళ్ళకొట్టు సత్యం బ్రతుకు పూర్తిగా మారిపోయింది. 'ఏరా సత్యం, సత్తిగా' అనే వాళ్ళంతా గౌరవంగా 'బాబూ సత్యన్నారాయణా' అంటూ గౌరవంగా పిలుస్తున్నారు. కౌన్సిలరు సత్యన్నారాయణగారు అంటున్నారు అతనితో పని వున్నవాళ్ళంతా. సత్యన్నారాయణ వేషం మారింది, హోదా పెరిగింది, ఫ్రెండ్స్ సర్కిల్ మారింది. నలుగురిలోనూ గౌరవం పెరిగింది. వూళ్ళోని 'పెద్దవాళ్ళు' అనబడే వాళ్ళంతా సత్యన్నారాయణతో స్నేహం కలిపారు.

కార్లలో తప్ప తిరగడు. ఖరీదయిన సిగరెట్లు తప్ప కాల్చడు. మడత నలగని బట్టలు తప్ప మరోటి తొడగడు. గుర్రపు పందేల వ్యసనం మరింత పెరిగింది. అయినా అతన్నిప్పుడు తలితండ్రులు తిట్టటం, శపించటం చెయ్యటం లేదు. 'బాబూ ఈ అలవాటు తగ్గించుకోరా సత్యం. లక్ష్మీదేవి చాలా చపల మయిందిరా. ఎట్టా వచ్చిందో అట్టాగే పోయే గుణం వున్నది. వున్నది జాగ్రత్త చేసుకుని ఇంక ఆ జోలికి పోకు నాయనా' అంటూ తల్లి నచ్చచెప్పబోయింది. కొడుకు అయిష్టాన్ని గమనించి మారు మాట్లాడక వూరుకుంది.

సత్యన్నారాయణ ఎంత మారినా అతని దగ్గర నారాయణ చనువు మాత్రం తగ్గలేదు. నారాయణ సరాసరి "సత్యన్నారాయణ సిల్క్ పేలెస్" లోకి వెళ్ళిపోతాడు సత్యన్నారాయణ ఆ సమయానికి అక్కడుంటే కుర్చీ తెప్పించి వేసి నారాయణని కూర్చోపెడతాడు. చల్లటి గోల్డుస్పాట్ తెప్పించి ఇస్తాడు. "ఏ ఏ ఏంటి కబుర్లు న్నా న్నా నారాయణా" అంటూ చిరునవ్వుతో పలకరిస్తాడు.

సత్యన్నారాయణ వొంటి నుంచి వెదజల్లుతున్న సెంటువాసనల్ని ఆఘ్రాణిస్తూ, ఫేనుకింద చల్లటి గోల్డ్‌స్పాట్ తాగుతున్న నారాయణకి తానో

స్వర్గం వచ్చానా అన్న అనుమానం కలుగుతూ వుంటుంది. చుట్టూ నిగనిగలాడే ముచ్చటయిన బీరువాలు, వాటినిండా కనువిందు చేస్తూ, తళతళా మెరుస్తూ రకరకాల బట్టలు, తెల్లగా మెరిసిపోతున్న కౌంటరు, కొట్టునిండా కిటకిట లాడుతూ రకరకాల మనుషులు—వీటన్నిటిని నారాయణ ఆశ్చర్యం నిండిన కళ్ళతో చూస్తూవుంటాడు. జీవితంలో తనుకూడా ఎప్పుడయినా ఇలాటి జీవితాన్ని అనుభవించగలడా లేకపోతే తండ్రిలాగానే మున్నూట అరవై రోజులూ గాడిద చాకిరీ చేస్తూ చాలీ చాలని జీతంతో, చస్తూ బ్రతికే ఆ జీవితమే తన మొహాన రాసిపెట్టివుందో. ఏమయినా సరే, ఏనాటికియినా తను సత్యన్నారాయణలాగా దర్జాగా బ్రతుకుతాడుగానీ, తండ్రిలాగా ఆ బండెడు బరువు మోస్తూ ఆ సారవిహీనమయిన జీవితాన్ని మాత్రం గడపలేడు అనుకుంటూ వుంటాడు నారాయణ.

సత్యన్నారాయణకి నారాయణ మొహంలోని ఆరాధన, కళ్ళలోని ఆ తన్మయత్వం తన ఎదుగుదలకి కొలమానం అనిపించింది. నారాయణ బుర్రలో మెదుల్తున్న ఆలోచనల్ని పసిగట్టినట్టుగా చిరునవ్వు నవ్వేవాడు తృప్తిగా. మనిషికి ధనసంపదలు వుండగానే తృప్తి కలగదు. వాటిని చూసి నలుగురూ ఈర్ష్యపడినప్పుడే తృప్తి కలుగుతుంది. సత్యన్నారాయణకి అలాటి తృప్తి నారాయణ దగ్గర దొరికేది,

"న్నే న్నే నేను ప వ పట్నం పోతున్నా న్నా న్నా నారాయణా, ను ను నువు కూడా వస్తావా ?" అన్నాడో రోజున. నారాయణ ఎగిరి గంతేసి నంత పనిచేసి "నిజంగానాండి" అన్నాడు.

"క్కా క్కా కార్లో వెడుతున్నా, ను ను నువ్వు గూడా రా" అన్నాడు సత్యన్నారాయణ. నారాయణ వెంటనే ఒప్పుకొన్నాడు.

తండ్రితో అక్కగారి వూరు వెడుతున్నానని మొదటిసారిగా అబద్ధం ఆడి, సత్యన్నారాయణ వెంట మద్రాసు వెళ్ళాడు. సత్యన్నారాయణకి వందిమాగధ బృందం ఎక్కువయింది. నారాయణలాటి మరో నలుగుర్ని వెంటవేసుకుని మద్రాసంతా తిప్పి చూపించాడు.

నారాయణకి ముఖ్యంగా నచ్చింది రేస్‌కోర్సు. అక్కడ మంచినీటి ప్రవాహంలా ప్రవహిస్తూ, క్షణాల్లో చేతులు మారిపోతున్న డబ్బు నారాయణ కళ్ళని మిరుమిట్లను గొల్పింది. ఆ జనం, ఆ హుషారు, ఆ కేకలు, ఆ ఆదుర్దా, పోగొట్టుకున్నవాళ్ళ ఏడుపు మొహాలు, గెల్చినవాళ్ళ సంరంభం-అదో విచిత్ర

ప్రపంచం. ఆకాసేపూ అదే నిజ ప్రపంచం. అక్కడున్న కాసేపు జీవితంలోని ఏ బాధలూ, భయాలూ గుర్తుకి రావు సత్యన్నారాయణ పక్కనే వుండి అన్నీ గమనిస్తున్నాడు నారాయణ ఆసారి సత్యన్నారాయణ పదివేల రూపాయలు గెల్చుకున్నాడు. ఆ నోట్ల కట్టల్ని చూసి నారాయణ ఉక్కిరి బిక్కిరి అయి పోయాడు. ఖుషీగా జల్సాగా ఖర్చుపెడుతున్న సత్యన్నారాయణ కొత్తవ్యక్తి లాగా కనిపించాడు నారాయణ కళ్ళకి. ఏమయినా సరే తను మాత్రం పైసా పైసాకి పీక్కుచచ్చే జీవితం మాత్రం గడపలేడు. కాకిలా కలకాలం బ్రతికే కంటే హంసలా అరఘడియైనా చాలు అన్న నిశ్చయానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో శారద వాళ్ళవూరిలో ఓ పూట వుండి వచ్చాడు. తండ్రికి తన అబద్ధం తెలుస్తే కోపంతో ఉగ్రుడయిపోతాడని తెలుసు నారాయణకి.

* * *

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాల్ని తనలో కలుపుకుంటూ కాలచక్రం గిర గిర తిరుగుతూనే వుంది. మరో అయిదు సంవత్సరాలు గడిచినాయి. శంకరం బి. ఎ. పూర్తిచేసి ఎల్. ఐ. సి.లో వుద్యోగం సంపాదించుకున్నాడు. చలపతి ఇంటరు పూర్తికాకుండానే చదువుకి స్వస్తి పలికాడు. నారాయణ బి. ఎ. డిగ్రీతో కుస్తీ పట్టి ఫలితంలేక వదిలేశాడు. సత్యన్నారాయణ మున్సిపల్ ఛైర్మన్ అయ్యాడు.

6

వసుంధరాదేవి వీక్లీ చదువుతూ తన గదిలో ఫోమ్‌బెడ్ మీద పడుకుని వుంది.

"మమ్మీ, మమ్మీ" కేకలు పెడుతూ పైకివచ్చాడు చలపతి.

"చలం ఏవిట్రా ఆ కేకలు. ఇక్కడున్నా ఇలారా" అంటూ పిల్చిందావిడ.

చలపతి తల్లిగదిలోకివచ్చి "హాయ్ మమ్మీ, నువ్విక్కడున్నావా? నీ కోసం ఇల్లంతా వెతికేను మమ్మీ" అంటూ నీరసం పోజు పెట్టి తల్లి పక్కన కూర్చున్నాడు

ఆవిడ ప్రేమగా కొడుకు వీపు నిమిరింది. షర్టుమీద పడ్డ ముడతని సరిచేస్తూ "ఏవిటి బాబూ, ఏం కావాలి?" అంటూ ప్రేమగా అడిగింది.

"మమ్మీ నాకో వెయ్యి రూపాయలు కావాలి" పది పైసలు కావాలన్నంత తేలిగ్గా అడిగేశాడు చలపతి.

"వెయ్యి రూపాయలా ? మొన్ననే గదురా ఎనిమిది వందలు కావాలని పట్టికెళ్ళావు. అంత క్రితం వారం వెయ్యిరూపాయలు పట్టుకెళ్ళావు ?"

"అబ్బ ఏమిటి మమ్మీ నువ్వుకూడా డాడీకిమల్లే క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తావు. నువ్వు ఇల్లు కదలవు. నీకు బయటి ప్రపంచం సంగతి ఏం తెలుస్తుంది ? అలా ఓసారి బయటికి వచ్చిచూడు ధరలు ఎలా మండిపోతున్నాయో. సినిమా టిక్కెట్టు నాలుగు రూపాయలు చేసి పారేశారు. టేక్సీ రేట్లు పెంచేశారు. డ్రింక్స్ ధర పెరిగిపోయింది. ఆఖరికి పుచ్చు బెండకాయలు కిలో నాలుగు రూపాయలట." ఉపన్యాసం దంచేశాడు చలపతి.

"అబ్బబ్బ, సరేరా. ఇంతకీ నీకు డబ్బెందుకు?" వసుంధరాదేవి కళ్ళజోడు సవరించుకుంటూ అడిగింది.



మద్రాసు వెళ్ళాలనీ, రాజ్యం రమ్మనమని లెటర్ వ్రాసిందనీ బొంకాడు చలపతి. తల్లి సంతోషించింది. కాని ఆవిడ దగ్గర డబ్బు లేదు. తండ్రిని అడగమంది. తాను తోడు వస్తానంది.

చలపతికి కొండంత ధైర్యం తల్లిఅండని చూసుకుని. చకచక మేడ మెట్లు దిగి తండ్రి గదిలోకి రాగానే అడుగులు ఆగిపోయినాయి. తన రాకని సూచిస్తూ మెల్లిగా దగ్గాడు.

టేబుల్ ముందు కూర్చుని ఏవో లెక్కలు చూసుకుంటున్న రాజేశ్వర్రావు తలఎత్తి చూసి, మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు.

చలపతి టేబుల్ దగ్గరగా వచ్చి "డాడీ, నాకో వెయ్యి రూపాయలు కావాలి !"

ఆయన చటుక్కున తల ఎత్తి కొడుకువైపు నిదానంగా ఓ క్షణం చూసి మళ్ళీ తన పనిలో మునిగిపోయాడు. చలపతికి తండ్రితో మాట్లాడాలంటే భయం. ఆయన చిటికి చిటికి ఏదో ఒకటి తేల్చడు ఆయన దగ్గరకొచ్చేసరికి చలపతికి మాటల్లో ఫోర్సు కాస్తా తగ్గిపోతుంది. నిస్సహాయంగా చూస్తున్న చలపతికి సహాయంగా వసుంధరాదేవి లోపలికి అడుగుపెట్టింది.

"వాడేమిటో అడుగుతున్నాడు. విన్నారా !" అందావిడ ధాటిగా.

ఆయన తలఎత్తి 'ఓహో నువ్వూ వచ్చావు' అన్నట్టుగా ఓ చూపుచూసి, "విన్నాను. ఎందుకు అని అడుగుతున్నాను" అంటూ మళ్ళీ తనపని చేసుకో సాగాడు.

ఆవిడ మనుషుల్లోని నిర్లక్ష్యవైఖరిని ఎంతమాత్రమూ భరించలేదు. భర్త ధోరణి చూసి కోపం పొంగుకొచ్చింది.

"ఎందుకేమిటి ? బయటతిరిగే మగపిల్లవాడికి ఎన్నో ఖర్చులుంటాయి. వాడేమయినా ఆడపిల్ల గనుకనా ఇల్లు కదలకుండా ఓ మూల కూర్చోటానికి. ఎందుకు, ఏమిటి అంటే ఏం చెపుతాడు ?" అందావిడ.

"నువు చెప్పింది బాగానే వుంది. వాడి సంపాదన వాడు ఎలా ఖర్చు పెట్టుకున్నా నేను అడగను. కాని ఇవ్వాల్సింది నేను గాబట్టి ఎందుకో కారణం తెలుసుకోవాల్సిన బాధ్యత నాకుందనుకుంటాను" అన్నాడాయన శాంతంగా తల ఎత్తకుండానే.

చలపతి మొహం ఎర్రబడింది. వసుంధరాదేవి ముక్కుపుటాలు అదిరినాయి కోపంతో.

"మీకు మీ వ్యాపారం, బిజినెస్సు, మిల్లులు ఇవి తప్ప మరోదేదీ బుర్రకి ఎక్కదా ? పెళ్ళాం పిల్లలు ఎలాపోయినా మీకు అక్కర్లేదన్నమాట, అంతేనా ?"

"అబ్బబ్బ వసూ నేనేమన్నానని ఇంత రాద్ధాంతం చేస్తావు? వాడికి అంత డబ్బు ఎందుకో అడిగాను. తప్పా?" ఆయన విసుగ్గా పుస్తకాలు మూసి టేబుల్ మీద పడేశాడు.

"మీరు ప్రతిదానికి ఇలాగే ఆరాలు తీస్తూవుంటే వయసొచ్చిన పిల్లవాడు ఎంత అభిమాన పడతాడో ఎప్పుడయినా ఆలోచించారా! మీ బుర్ర ఎప్పుడూ లెక్కల్లో తప్ప మరి దేంట్లోనూ పనిచెయ్యదయ్యే." ఆవిడ కోపం క్షణక్షణానికి పెరిగిపోతోంది.

"వయసొచ్చిన పిల్లవాడు గనుకనే వాడి బాధ్యత వాడికి గుర్తుచేస్తున్నాను. చదువూ సంధ్యా లేకుండా, కానీ సంపాదించే తెలివితేటల్లేకుండా వీడు వేలకివేల డబ్బుతో చేసే ఘనకార్యం ఏవిటీ అని అడుగుతున్నాను. అసలు వాడు ఇలా పాడయిపోవటానికి కారణం ఎవరో తెలుసా? నువ్వు. క్షణక్షణం వాడిని వెన కేసుకొచ్చి వాడి వెధవపనులన్నీ కప్పిపెడుతున్ననువ్వు వాడికి చదువుఎందుకు అంటలేదోతెలుసా. నువ్వు, నీ గారాబం. పాతికేళ్ళొస్తున్నా వాడికి తనకాళ్ళమీద తను నిలబడాలన్న జ్ఞానం, ఎందుకు కలగలేదో తెలుసా? నువ్వు, నీ గారాబం! వాడు బయట తిరిగి చేసే ఘనకార్యాలేవిటో ఏనాడన్నా తెలుసుకున్నావా?' రాజేశ్వర్రావు అలా గట్టిగా, కోపంగా మాట్లాడగానే వసుంధరాదేవికి తను తగ్గక తప్పదని తెలుసు. గొంతుని మృదువుగామార్చి అంది.

"వాడు పాడుచెయ్యటానికి డబ్బు అడగలేదు. మా అన్నయ్యగారింటికి వెడదామనుకుంటున్నాడు. రాజ్యం రమ్మని రాసిందట" అందావిడ.

ఆయన నమ్మలేనట్టుగా చూశాడు.

"ఏవిటీ? రాజ్యం వీడిని రమ్మని రాసిందా? భలే! ఎందుకు'' అంటూ నవ్వా డాయన.

"ఎందుకేమిటి, మీకసలు ఏదీ అర్థంకాదు. మా అన్నయ్య రెండుచేతులా సంపాదిస్తున్నాడు. వద్దన్నకొద్దీ డబ్బు వచ్చిపడుతోంది. వాడికి కొడుకయినా కూతురయినా అది ఒఖత్తె. రేపా ఆస్తిపాస్తులన్నిటికి అధికారిణి అదేగదా. ఆ రాజ్యాన్ని మనవాడికి ముడిపెట్టేస్తే మా అన్నయ్య ఆస్తంతా మనదే అవ్వదూ ? ఈమాత్రం ఆలోచన లేకపోయాక ఎంత వ్యాపారంచేసి ఏంప్రయోజనం ? అదేమో వాడిని రమ్మని రాసిందిట. మగపిల్లవాడు, చేతిలో రూపాయి డబ్బు

ల్లేకుండా వాళ్ళింటికి ఎలా వెడతాడు? వాళ్ళ తాహతుకి తగినట్టుగా ఖర్చుపెట్టక పోతే వీడినసలు ఖాతరు చేస్తుందా ఆరాజ్యం అసలే దానికి అన్నీ మా అన్నయ్య పోలికలు. మీరేమో ఈ వరస, ప్రతిదానికీ లెఖ్ఖలు పత్రాలంటూ."

రాజేశ్వరరావు ఇంకా ద్వైదభావంలోనే వున్నాడు, భార్య చెప్పింది నిజంగా నమ్మాలా వద్దా అన్నట్టుగా. తను ఎంత కంఠశోషపడినా చివరికి భార్యదే పైచెయ్యి అని ఆయనకి తెలుసు. ఆవిడవైపు ఓక్షణంచూసి, గాడ్రెజ్ బీరువా తెరిచి వెయ్యిరూపాయలు తీసుకొచ్చి భార్యముందు పడేశాడు నోట్లని.

"తీసుకుపో, నువు నీ కొడుకు ఏ గంగలో దూకినా సరే!" అంటూ గట్టిగా అలమారు తాళం వేశాడు.

తల్లి అందించిన నోట్లని శ్రద్ధంగా జేబులో పెట్టుకొన్నాడు సంతోషంగా.

"థాంక్యూ మమ్మీ, థాంక్యూ" అంటూ తన గదిలోకి వెళ్ళిపోయాడు.

'రాజ్యం ఈసారికి నా అవసరం గడిపేవు థాంక్యూ వెరీమచ్' అంటూ ఎక్కడోవున్న రాజ్యానికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

7

శంకరం మొదటినెల జీతం అందుకున్నరోజున ఆ పే పేకెట్‌ని చూసి సంతోషంతో ఉబ్బిపోయాడు. ఆప్యాయంగా గుండెలకానించుకుని జేబులో పెట్టుకున్నాడు. శంకరం తల్లిప్రేమగానీ, తండ్రి ఆదరణగానీ ఎరగడు. అతనికి తెలిసినదల్లా తమని తల్లికన్న మిన్నగా చూసే మామ్మ మాత్రమే! శంకరం ఇంటికి వచ్చి సరాసరి మామ్మదగ్గరగా వచ్చాడు.

శాంతమ్మ నేలమీద కూర్చుని పత్తితో వత్తులు చేస్తోంది. శంకరం సుడిగాలిలాగా వచ్చి ఆవిడని రెండుచేతులతోనూ చుట్టేశాడు. శాంతమ్మ బిత్తరపోయి చూసింది.

"ఒరేయ్ ఒరేయ్ ఏవిట్రా ఇది, వదులునాయనా, ముసలిదానితోనా నీ సరసాలు" అంటూ ప్రేమగా కేకవేసింది.

శంకరం ఆవిడ గుప్పిటతెరిచి జీతంవున్న కవరు ఆవిడచేతిలోపెట్టి గుప్పిట మూసేశాడు. ఆవిడ కాళ్ళమీద తలపెట్టి ఆ కాళ్ళని భక్తిగా కళ్ళకి అద్దుకున్నాడు.

"ఏమిట్రా ఇది శంకరం."

"నా మొదటినెల జీతం మామ్మా" అంటున్న శంకరం గొంతు బొంగురుపోయింది.

శాంతమ్మ కళ్ళనిండా నీళ్ళు తిరిగినాయి. ఆవిడ ఎండిపోయిన తనచేతుల్ని చాచి శంకరాన్ని దగ్గరగా తీసుకుంది. తన పంచెకొంగుతో శంకరం కళ్ళని అద్దింది. శంకరం ఆవిడ రెండుచేతుల్ని ప్రేమగా తన చేతుల్లోకి తీసుకుని కళ్ళమీదుంచుకున్నాడు. "మామ్మా నీ రుణం మేం ఎలాతీర్చుకోగలం" అంటున్న శంకరాన్నిచూసి నవ్విందావిడ.

"అయితే నా రుణం తీర్చుకుని నన్ను పంపెయ్యాలని చూస్తున్నావేంరా శంకరం?" అందావిడ.

"నీది తీర్చుకోలేని రుణం మామ్మా. తల్లీ తండ్రీ లేక, బంధువులందరు వది లేసిన ఇద్దరు అనాధబిడ్డల్ని ఇంతవాళ్ళని చేశావు. నువు తిన్నావో పస్తులే వున్నావో ఏనాడూ మాకు ఆకలిబాధ లేకుండా చేశావు. నీ నీడలో పెరిగి పెద్ద వాళ్ళం అయ్యాం. ఈనాడు మేము ఇలా వున్నామంటే ఇదంతా నీ చలవే మామ్మా. మాకు తల్లీ, తండ్రీ, దైవం అన్నీ నువ్వే." శంకరం ఆవిడని తన చేతుల్లోకి తీసుకుని మెల్లగా అన్నమాటలకి మామ్మ చలించిపోయింది.

వాడిలిపోయిన బుగ్గలమీదుగా కన్నీరు ధారలుకట్టింది.

"ఇది మీ అదృష్టం కాదురా శంకరం, నాది. ఒకే ఒక్క-క్షణంలో కట్టుకున్న భర్తని,కన్నబిడ్డల్ని గంగమ్మతల్లి తన గర్భంలో కలిపేసుకుంది. 'భగవంతుడా నన్ను మాత్రం ఎందుకు బతికించావు నాయనా' అని ఏడుస్తుంటే ఆదేవుడే జాలిపడి మీ ఇద్దరినీ నాకు అప్పచెప్పాడు 'చచ్చి ఏంసాధిస్తావు? పసిబిడ్డల్ని పెంచి పెద్దచెయ్యి నీ జీవితం తరిస్తుంది ' అని ఆ భగవంతుడే చెప్పినట్టు అని పించింది. నేను పోగొట్టుకున్న ఆనందాన్ని నాకు పంచిపెట్టిన దేముళ్ళురా మీ ఇద్దరూ. నేనుకాదు దేవతని. మీరు." శాంతమ్మ కంఠం దుఃఖభారంతో పెగల్లేదు.

మల్లెపూలు వడిలో పోసుకుని వచ్చిన గిరిజ ఇద్దరినీ ఆ స్థితిలో చూసి కంగా రుగా పిలిచింది. 'మామ్మా, అన్నయ్యా' ఏమయిందర్రా ఇద్దరూ అలా మూగ పోయిన విగ్రహాల్లాగా కూచున్నారూ' అంటూ దగ్గరగా వచ్చింది.

శాంతమ్మ కళ్ళు తుడుచుకుంది. శంకరం ఇచ్చిన డబ్బు కవరుని గిరిజకి ఇస్తూ, 'ఇది దాయవే గిరిజా శంకరం మొదటిజీతం, అందులోంచి పదిరూపా యలు తీసి విడిగా పెట్టి, ఒరేయ్ శంకరం, ఈసారెప్పుడయినా తిరపతి వెళ్ళి నప్పుడు ఆ డబ్బు డిబ్బెనలో వెయ్యి" అందావిడ.

గిరిజ మూతిముడుచుకుని అన్నగారివైపు కోపంగా చూసింది. "చూశావా

మామ్మా అన్నయ్యకి నువ్వంటేనే ప్రేమ. తన మొదటిజీతంలో నాకేదయినా కొనితెద్దామని వుందేమో చూశావా? అంతా తీసుకొచ్చి నీ చేతుల్లో పెట్టేశాడు," అంటున్న గిరిజనిచూసి మామ్మ, శంకరం నవ్వేశారు.

"కోపం ఎందుకే గిరిజా రేపు వాడి సంపాదనంతా దాచినీపెళ్ళి చెయ్యాల్సింది వాడేగదే" అందావిడ.

"ఆ, ఆ పెళ్ళి తరవాత చేస్తాడుగానీ ముందర నాకో మంచి పెన్ను కొని ఇమ్మను."

"ఎందుకమ్మా గిరిజా? నువు గూడా రచయిత్రివి అయిపోతావా?" అంటూ భయం నటిస్తున్న అన్నగారిని చూసి గిరిజ నవ్వేసింది.

"అలాగే నవ్వి హేళనచెయ్యి. రేపు ఓ రచయిత్రే మా వదినగారుగా రాక పోతే చూడు" అంది.

"వద్దమ్మా చెల్లెలా. నాకు వంట చెయ్యటం రాదు" అన్నాడు బెంగగా.

"పోన్లే నీకు వంటనేర్పించినతరువాతే ఆవిడని రాసుకోమని చెబుతాలే" అంది గిరిజ నవ్వుతూ.

"మామ్మా, అన్నయ్యతో చెప్పు పెన్ను కావాలని" అంది.

"మామ్మా, మూడునెలల్లో నాలుగు పెన్నులు పాడు చేసింది. ఇలా అయితే ఎలా మామ్మా." గిరిజని కవ్విస్తూ అన్నాడు శంకరం.

"అణాకానీ పెన్నులయితే పాడవ్వవా ఏం? ఒక్కమంచి పెన్ను పట్రమ్మని చెప్పు మామ్మా."

వాళ్ళిద్దరి వాదన చూసి శాంతమ్మ ముచ్చటగా నవ్వింది.

"నా సిఫారసు ఎందుకే మధ్య? నేనివాళున్నాను, రేపు వుంటానని నమ్మకం ఏముంది? నే పోయినా గూడా ఇలాగే కీచులాడుకుంటారేమర్రా? ఒరేయ్ శంకరం! నీకుఇప్పుడే చెపుతున్నాను దానిమనసుకి కష్టంకలిగేట్టుగా ఎప్పుడూ ప్రవర్తించకు తెల్సిందా! దానికి తల్లివయినా తండ్రివయినా అన్నవయినా నువ్వే. గిరిజా! నీక్కూడా చెపుతున్నా గుర్తుంచుకో. వాడికి ఈ ప్రపంచంలో ఎవరూలేరు నువు తప్ప. ఒక్కగానొక్క తోబుట్టువ్వి. వాడి మంచి చెడ్డలు చూడాల్సిన బాధ్యత నీదే తెలిసిందా?" అంది శాంతమ్మ.

ఆవిడ అప్పగింతలకి గిరిజ, శంకరం పకపకా నవ్వారు.

"మా యిద్దరికీ తోడూ నీడా అన్నీ నువ్వే మామ్మా. లే నాకు ఆకలేస్తోంది. నువు చేసుకున్న ఫలహారం ఏదయినా అట్టిపెట్టావా నాకు" అంటూ శాంతమ్మని లేపి లోపలికి తీసుకువెళ్ళాడు శంకరం.

"మామ్మా పూలుకట్టి వస్తున్నాను. అంతా వాడికే పెట్టెయ్యకు. నాక్కూడా అట్టిపెట్టు" అంటూ కేక పెట్టింది గిరిజ పూలు గుచ్చుతూ.

ఆ రాత్రి శాంతమ్మ గిరిజని, శంకరాన్ని వెంటబెట్టుకుని శివాలయానికి వెళ్ళింది. పార్వతీ అమ్మవారికి కుంకుమపూజ చేయించి తిరిగి వచ్చారు.

ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయిన శంకరానికిగానీ, గిరిజకిగానీ త్వరగా మెలకువరాలేదు. ఎండ మొహమ్మీద పడి ఉలిక్కిపడి లేచిన శంకరం 'ఇంకా మామ్మ లేవలేదా ఏం చెప్మా? లేకపోతే నన్ను అంత సేపు పడుకోనిచ్చేదిగాదే' అనుకుంటూ మామ్మ పక్కదగ్గరగా వెళ్ళాడు శాంతమ్మ నిండా ముసుగు పెట్టుకుని నిద్రపోతోంది.

శంకరం ఆత్రుతగా వంగి దుప్పటితీస్తూ 'మామ్మా, వంట్లో బాగాలేదా, ఇంత సేపు పడుకున్నావేం'అంటూ వంటిమీద చెయ్యివేసినవాడు కాస్తా మామ్మా! అంటూ గట్టిగా కేకపెట్టాడు. ఉలిక్కిపడి లేచిన గిరిజ కంగారుగా శంకరం దగ్గరికి వచ్చింది.

"ఏమయిందన్నయ్యా" అంటూ శాంతమ్మమీద చెయ్యివేసిన గిరిజ చల్లటి మంచుగడ్డలాటి శరీరం చేతికి తగలగానే చప్పున చేతిని వెనక్కి లాక్కుంది. శాంతమ్మ ఇహలోకంలో తను వచ్చినపని పూర్తయిపోయిందన్నట్లుగా ప్రశాంతంగా నిద్రపోతోంది. ఆమొహంలో బాధగానీ, వేదనపడిన చిహ్నాలుగానీ లేవు. అంతులేని తృప్తి నిండివుంది.

శాంతమ్మ శరీరం మీదపడి పసిపిల్లలకి మల్లే ఏడుస్తున్న అన్నాచెల్లెళ్ళని చూసి ఇరుగుపొరుగు కళ్ళుకూడా చమర్చాయి.

"ఎంత అదృష్టవంతురాలో, రోగం రొచ్చుతో తీసుకోకుండా హాయిగా ఒక్కక్షణంలో కన్నుమూసింది. ఎంత పుణ్యాత్మురాలో" అంటూ నలుగురూ తలోపనిచేసూ శాంతమ్మ అంతిమయాత్రకి సన్నాహాలు చేశారు.

ఈ వార్తతెలిసిన నారాయణ, చలపతి వెంటనే వచ్చారు. స్నేహితుడికి అండగా నిలబడి, కావల్సిన సహాయం చేశారు. అంతిమయాత్రకి తరలి శ్ళి పోతున్న శాంతమ్మగారి ముందుగా నిప్పుకుండతో నడుస్తున్న శంకరాన్నిచూసి వెక్కివెక్కి ఏడుస్తున్న గిరిజని పార్వతమ్మగారు ఓదార్పు మాటలతో ఊరడించసాగింది.

8

నారాయణకి అర్హత సరిపోతుంది అని అనుకున్న వుద్యోగాలన్నిటికీ దర ఖాస్తులు పెట్టిస్తున్నారు సుందరయ్యగారు. చివరిదశలో తమకి చేదోడుగావుండి

వుద్ధరిస్తాడనుకున్న నారాయణ ఇప్పుడాయనకో పెద్ద సమస్యగా తయారయ్యాడు. నారాయణ కాలేజీ చదువు మానేసి నాలుగేళ్ళవస్తోంది. ఇంతవరకు ఏ ఉద్యోగమూ రాలేదు. ఇదంతా తమ ఖర్మేనా, లేక దేశంలో నిరుద్యోగ సమస్య ఇంత తీవ్రంగా వుందో ఆయనకి అర్థంకావటంలేదు. నారాయణతో పాటుగా చదివిన కుర్రాళ్ళెంత మందో చిన్నదో పెద్దదో ఏదో ఒక ఉద్యోగంలో చేరిపోయారు. కొంతమంది పెళ్ళిళ్ళుకూడా చేసేసుకున్నారు. నారాయణ ఖర్మ ఇలా వుందని పార్వతమ్మగారు బాధపడటం అలవాటయిపోయింది.

పేపరు చూస్తున్న సుందరయ్యగారు ఒకచోట కనబడిన ప్రకటనచూసి తటాలున లేచి కూర్చున్నారు.

'నారాయణా' అంటూ కేకవేసేరు. పిల్లిలాగా నడుస్తూ నారాయణ వచ్చాడు. ''ఇదిగో, ఇది చూశావా'' అంటూ పేపరు చూపించారు. హైదరాబాదులోని ఓ ప్రైవేటు కంపెనీలో క్లర్కు-పోస్టుకి పడిన ప్రకటన అది

''సీతారామయ్యగారు ఆ కంపెనీ డైరెక్టరు. మనకి దూరపు బంధువవుతాడు. వెంటనే అప్లై చెయ్యి. నేనాయన్ని కలుసుకుని ఏవయినా తంటాలు పడతాను...'' అన్నారాయన.

నారాయణచేత వెంటనే దరఖాస్తు పంపించి, ఆయన వెంటనే హైదరాబాదు వెళ్ళి ఆ కంపెనీ డైరెక్టరయిన సీతారామయ్యగారిని కలుసుకున్నారు. తమ దూరపు బంధుత్వాన్ని గుర్తుచేసి, తన ప్రస్తుత పరిస్థితులన్నీ వివరించి ఎలాగయినా నారాయణకి ఆ వుద్యోగం వచ్చేట్టు చూడమని ప్రాధేయపడ్డారు. సీతారామయ్యగారు బాగా ఎదురుదెబ్బలు తిని పైకివచ్చిన మనిషి. ఆయన ఇలాటి కష్టనిష్ఠూరాలన్నీ బాగానే అర్థంచేసుకోగలరు. సుందరయ్యగారి స్థితివిని జాలి కలిగింది. పైగా నారాయణకి వున్న అర్హతలు ఆ ఉద్యోగానికి సరిపోతాయి. గనుక తాను తప్పక సహాయం చేస్తానని మాట ఇచ్చారాయన. కొండంత సంతోషంతో తిరిగి వచ్చారు సుందరయ్యగారు.

సుందరయ్యగారు ఎలాగో వందరూపాయలు అప్పుపట్టుకొచ్చి నారాయణకి ఇచ్చి ఇంటర్వ్యూనాటికి హైదరాబాదు పంపించారు. ఎప్పటికప్పుడు దరఖాస్తులకి, ఇంటర్వ్యూలకయే ఖర్చే ఆయనకి తలకిమించినదిగా వుంటుంది. ఈసారి కొడుక్కి వుద్యోగం వచ్చేసినట్లే ఆయన భావిస్తున్నారుకనుక ఇంక ఈబెడద వుండదులా బాబూ అనుకుంటూ నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు.

నారాయణ హైదరాబాదు వెళ్ళక వెళ్ళాడు. తిరిగి వచ్చాడు. ఎన్నాళ్ళయినా



వుద్యోగం వచ్చినజాడమాత్రం లేదు. ఒకరోజు సీతారామయ్యగారి దగ్గరనుంచి వచ్చిన వుత్తరంచూసి సుందరయ్యగారు నిలువునా కుప్పకూలినట్టయిపోయారు. నారాయణ ఇంటర్వ్యూకి రానికారణం తనకి తెలియదని, అతనికి మరేదయినా మంచి వుద్యోగం వేరేచోట దొరికివుంటుందని ఆశిస్తున్నానని ఆయన రాశారు.

సుందరయ్యగారిలో కోపం, నిరాశ, పెనవేసుకుని ఏంచెయ్యాలో తెలియని అయోమయంలో పడ్డారు. తను ఇంత శ్రమపడి, ఏర్పాట్లుచేసివస్తే నారాయణ అసలు ఇంటర్వ్యూకే వెళ్ళలేదట. ఎంత మోసం! నారాయణ ఎందుకు ఇలా చేశాడు. ఇలా జరిగింది ఇప్పుడేనా? ఇంతకుముందుగూడా ఇలాటి నాటకమే ఆడుతూవచ్చాడా?

"నారాయణా" అంటూ గావుకేకపెట్టారు. ఆ కేకవిని రావటానికి నారాయణ ఇంట్లోలేడు. అసలు నారాయణ ఇంటిపట్టున వుండటమే చాలా అరుదుగా ఉంటుంది. ఎక్కడ తిరుగుతున్నాడో ఏంచేస్తున్నాడో ఎవరికీ అంతుపట్టని విషయం. ఎప్పుడో ఇంటికి వస్తాడు. వచ్చినా వెంటనే వెళ్ళిపోడన్న నమ్మకం లేదు. ఏది అడిగినా నారాయణ మౌనమే సమాధానం అన్నిటికీను.

"నారాయణా" అంటూ ఉగ్రస్వరూపంతో సుందరయ్యగారు పిలిచేసమయానికి నారాయణ ఇంట్లోలేడు. కాస్మాపాలిటన్ క్లబ్బులో చలపతితో కలిసి రంజయిన పేకాట మధ్యలో వున్నాడు.

సుందరయ్యగారు తనకోపాన్ని తనలోనే దిగమింగుకుంటూ, నిస్సహా

యంగా పడకకుర్చీలో వాలి మనసుని సమాధానపరుచుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

"టెలిగ్రాం" అంటూ ఎర్ర సైకిలు మెసింజరు కేకతో కళ్ళుతెరిచి చూశారు. వణికే చేతుల్తో సంతకంచేసి, కవరుతెరిచి చూసిన సుందరయ్యగారు కుప్పకూలి నట్టుగా కూలబడిపోయారు.

"శారద భర్త గుండెజబ్బుతో అకస్మాత్తుగా కాలంచేశాడు." అని ఉంది ఆ టెలిగ్రాంలో, పార్వతమ్మ స్పృహతప్పి పడిపోయింది. నారాయణ వున్నా డేమోనని వచ్చి ఇద్దరినీ ఆ పరిస్థితుల్లో చూసి అయోమయంలో పడిన శంకరం ఉపచారాలతో మెలమెల్లగా కోలుకున్న పార్వతమ్మగారి దుఃఖం పట్టశక్యంకాక పోయింది. సుందరయ్యగారు ఏడుపు అనే పదాన్నే మర్చిపోయినట్టుగా, కఠిన శిలలాగా మారిపోయి, గాజువారిన కళ్ళతో చూస్తూ కూర్చున్నారు.

శంకరం వూరంతా తిరిగి చివరికి క్లబ్బులో పేకాటమధ్యలోవున్ననారాయణని పట్టుకొని జరిగిన ఘోరాన్ని వివరించి ఇంటికి తీసుకువచ్చాడు.

కూతురి పెళ్ళికి చేసిన అప్పు పూర్తిగా తీరకుండానే, ముగ్గురుపిల్లలతల్లి అయి నుదుట కుంకుమ చెరుపుకుని మళ్ళీ పుట్టింటికే తిరిగివచ్చిన శారదనిచూసి ఆ తల్లిదండ్రుల దుఃఖం వర్ణింప శక్యంగానిది.చిన్నవయసులో, ముగ్గురిపిల్లలతో ముందుజీవితం భూతంలాగా మింగుతానంటూ మీదికి దుముకుతుంటే నవ్వనేదే మర్చిపోయిన శారద హఠాత్తుగా చనిపోయిన భర్తని తలుచుకుని కుమిలి కుమిలి దుఃఖిస్తూవుంటే వృద్ధదంపతుల హృదయాలు, "భగవాన్ ఇన్నికష్టాలు మానొసట నెందుకురాశావు తండ్రీ. ముందుగా మమ్మల్నే తీసుకుపోకపోయావా" అంటూ ఆక్రోశించటం తప్ప మరేమీ చెయ్యలేకపోయాయి.

9

నారాయణ ఇంట్లోకి అడుగుపెట్టేసరికి 'రాధ' మంచంలో మూలుగుతూ పడుకొనివుంది. పట్టీలాగా నుదుటిమీద వేసిన చల్లటి తడిబట్ట క్షణాల్లో ఎండి పోతోంది జ్వర తీవ్రత ఉధృతంగా వుందనటానికి నిదర్శనంగా శారద మంచం పట్టీకి తలఆనించి కూర్చునివుంది దిగులుగా కూతురివైపు చూస్తూ, జ్వరతీవ్రతలో, రాధ 'నాన్నా నాన్నా' అంటూ కలవరిస్తూనేవుంది

శారద ముగ్గురి పిల్లలలోనూ రాధపెద్దది. ఎనిమిదేళ్ళ రాధ తరువాత ఆరేళ్ళ గోపి, నాలుగేళ్ళ రమ శారద సంతానం. రాధకి తండ్రిదగ్గర చేరిక ఎక్కువ. నిద్రలేస్తూనే తండ్రికోసరం వెతుకుతుంది. తండ్రితోపాటే భోజనం చేస్తుంది.

సూర్యం ఆఫీసుకివెళ్ళేటప్పుడు దోవలో రాధని స్కూలుదగ్గర దింపి వెడతాడు. రాత్రిపూట రాధ తండ్రి మంచంమీద పడుకునే నిద్రపోతుంది. నిద్రపోయే ముందు కొంచెంసేపు తండ్రితో స్కూలు ఖబుర్లవీ చెపితేగానీ ఆ పిల్లకి నిద్ర పట్టదు. రాధకి కాల్లో ముల్లుగుచ్చుకుందంటే చాలు సూర్యం ప్రాణం ఎగిరిపోయి నట్టుగా హడావిడి చేసేవాడు. శారద అతని ఖంగారు, హడావుడి చూసి భర్తని మందలిస్తూవుండేది. పిల్లల్ని అంత గారాబం చెయ్యొద్దని. సూర్యం నవ్వేసే వాడు.

"రాధ మా అమ్మపోలిక శారదా. మా అమ్మే మళ్ళీ ఇలా పుట్టింది నాకోసం. కాదమ్మా రాధా?" అనేవాడు రాధని ముద్దుపెట్టుకుంటూ.

రాధ మంచంకోటికి తల ఆనించి కూర్చున్న శారదకి భర్త బ్రతికున్ననాటి దృశ్యాలు కళ్ళముందు మాటిమాటికి కదుల్తూ మాయమవుతున్నాయి. కన్నీరు బుగ్గలమీదుగా జారిపోతున్నా ఆ స్పృహే లేనట్టుగా దిగాలుపడి కూర్చున్న శార దని చూడగానే నారాయణ గుండెలు ద్రవించిపోయినాయి. 'నాన్నా నాన్నా' అంటూ కలవరిస్తున్న రాధని చూడగానే కళ్ళనిండా నీళ్ళుతిరిగాయి

సూర్యంపోయి నెలదాటింది. శారదని ఆదరించి, పిల్లల బాధ్యతవహించదగ్గ పెద్దలుగానీ, బాధ్యతకలవాళ్ళుగానీ సూర్యంవైపు ఎవరూలేరు అంతాపదిరోజులు గడిచిపోగానే ఎవరిదోవన వాళ్ళు సర్దుకున్నారు. సుందరయ్యగారు పార్వతమ్మ కూతుర్ని పిల్లల్ని తమతో తీసుకువచ్చేశారు. వచ్చినదగ్గరనుంచి రాధని జ్వరం పట్టుకుంది. ఆ పిల్లకి తండ్రిమీద బెంగవల్లే అలా వచ్చిందని అందరికీ తెలుసు కాని దానికి మందేమిటో ఎవరికీ తెలియకుండావుంది.

"రాధా!" నారాయణ రాధవద్ద కూర్చుని మెల్లగా పిలిచాడు. రాధకి ఎక్కడి నుంచో తండ్రిపిలుస్తున్నట్టుగా వినిపించింది. తెరిపిడి పడని కళ్ళని బలవంతాన తెరవటానికి ప్రయత్నించింది. ఎంతో ఆశగా తెరవబడిన ఆ కళ్ళు నారాయణని చూడగానే నిరాశగానే వాలిపోయినాయి.

నారాయణ రాధ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని మృదువుగా నిమిరాడు. "రాధా ఎలా వుందమ్మా? అరే ఇవాళ జ్వరం తగ్గిపోయిందే! ఒళ్ళు ఎక్కువ వేడిలేదు, చూశావా? రేపటికి లేచి తిరిగేస్తుంది మా రాధ" అన్నాడు

నారాయణ మాటలు విని రాధ మెల్లిగా నవ్వింది. నారాయణ వచ్చేటప్పుడు రాధకి కాగితంతోచేసిన వస్తువుల్ని అమ్మేవాడిదగ్గర తెరిచిమూసే రంగురంగుల గొడుగొకటి పట్టుకొచ్చాడు. అది విప్పి రాధకిచ్చాడు.

"రాధా! నీకోసం తెచ్చాను బాగుందా" అన్నాడు.

రాధ చిక్కిపోయిన చేతిని చాచి ఆ రంగుల గొడుగుని మెల్లిగా పట్టుకుంది. దానివైపు ఒక్కక్షణం చూసి బాగుంది అన్నట్టుగా మెల్లగా తలూపింది.

నారాయణ చాలాసేపు రాధదగ్గరే కూర్చుని వేడిగావున్న వొంటిని ఆప్యాయంగా రాస్తూ, మెల్లగా ఖబుర్లు చెపుతూ, నవ్విస్తూ కూర్చున్నాడు.

రాధ ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయింది. తెల్లవారేసరికి జ్వరం కొంచెం తగ్గుముఖం పట్టింది.

శారదని చాటుగా పిల్చి కేకలేశాడు. "అక్కయ్యా! నువు పిల్లలముందు అలా బాధపడకు. రాధ చూడు అసలే బెంగతో జ్వరం తెచ్చుకుంది. నువు దాని ఎదురుగా ఏడుస్తూంటే అది మరీ బెంబేలు పడిపోతుంది. పిల్లలకోసమయినా నువు ధైర్యం తెచ్చుకోవాలి" అంటూ తనకంటె చిన్నవాడయిన నారాయణ పెద్దరికంగా చెప్తున్నమాటలు విని శారద దుఃఖం ఆపుకోలేకపోయింది. తమ్ముడి భుజంమీద వాలి వెక్కి వెక్కి ఏడ్చింది. నారాయణ అక్కగారి వీపు నిమురుతూ, ధైర్యం చెబుతూ, మాటల్లోపెట్టి దుఃఖాన్ని మరిపించాలని చూసాడు.

"రాధా! చూశావా ఈ కార్టూన్లు. పాపం గణపతికి మిగలకుండా ప్రసాదాలన్నీ ఈ ఎలుకే తినేసింది. బలే! గణపతి మొహం ఆకలితో ఎలా వాడిపోయిందో చూశావా?" రాధని నవ్వించాలని రకరకాల కార్టూన్లు చూపించి చెప్పేవాడు.

రాధకోసం రోజూ బజారునుంచి చిన్న చిన్న బహుమతులు, రాధ కిష్టమయిన వస్తువులు తెచ్చేవాడు. పదిరోజులకి రాధ జ్వరం మెల్లగా తగ్గింది. నారాయణ దగ్గర రాధకి చేరిక ఎక్కువయింది.

నారాయణ యింటికి రావటం ఆలస్యం అయితే ఎదురుచూస్తూ వీధిలో కూర్చునేది. రాధ దిగులుగా ఉన్నట్టు చూస్తే నారాయణ రాధని వెంటబెట్టుకుని బజార్లు తిప్పి చూపించేవాడు, పిల్లలు ముగ్గురిని పార్కుకి తీసుకువెళ్ళేవాడు. నాలుగునెల్లు నడిచేసరికి రాధకి తండ్రిమీద బెంగ వెనకపడసాగింది. నారాయణకి మరింత దగ్గరయింది.

గోపీ, రమ పక్కయింటి పిల్లలతో కలిసిపోయి ఆడుతూవుండేవాళ్ళు. రాధమాత్రం ఇంట్లో తల్లి దగ్గర తిరుగుతూనో, వాకిటివైపు కుర్చీలో బుగ్గన చేయి పెట్టుకుని కూర్చుని వీధిలో తిరిగేవాళ్ళని చూస్తూనో గడిపేది. అలా

చూస్తున్న రాధ హఠాత్తుగా వీధిలోంచి విడిచి వెళుతున్న ఓ మనిషిని చూసి పరుగెత్తుకుంటూ గుమ్మం వరకు వచ్చి ఆగిపోయింది. అతనెవరో దూరం నించి అచ్చుగా సూర్యంలాగే వున్నాడు. తరచుగా సూర్యం వేసుకునే రంగు బట్టలే వేసుకున్నాడు. సంభ్రమముగా చూస్తున్న రాధని దాటుకు వెళ్ళిపోయాడతను. కనీసం తల తిప్పికూడా చూడలేదు. రాధకి దుఃఖం పొంగుకు వచ్చింది. తండ్రి గుర్తుకి వచ్చాడు. ఏడుస్తూ అక్కడే నిలబడిపోయింది.

నారాయణ ఇంటికి వస్తూ దూరంనించే రాధని చూసి చెయ్యి ఊపాడు. రాధ ఎప్పటిలా నవ్వలేదు. ఆ పిల్ల కళ్ళనించి కారుతున్న కన్నీటిని చూసి చటుక్కున రాధని చేతుల్లోకి తీసుకున్నాడు.

"ఏమ్మా రాధా! ఎందుకు ఏడుస్తున్నావు ? అమ్మ కేకలేసిందా ?" అంటూ బుజ్జగించాడు.

రాధ జవాబు చెప్పలేదు. తండ్రిలాటి మనిషి వెళ్ళినవైపే చూస్తోంది.

"ఏం జరిగింది చెప్పమ్మా!" రాధ కన్నీరు తుడుస్తూ ప్రతిమాలాడు

"మావయ్యా! ఆయన అచ్చు నాన్నలాగా లేరూ ?" దూరంగా తిరుగుతున్న మనుషులవైపు చెయి చూపిస్తూ అంది రాధ. నారాయణకి రాధ దుఃఖానికి కారణం అర్థం అయింది. ఆ పిల్ల మొహం చూసిన నారాయణకి గిర్రున కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఈ చిన్న మనసులో తండ్రి జ్ఞాపకాలు ఎలా దూరం చెయ్యటం !

"రాధా! మనం షికారుకు వెడదామా సైకిలుమీద" అన్నాడు రాధ వుత్సాహంగా చూసింది.

నారాయణ సైకిలుమీద బజార్లన్నీ కాసేపు తిప్పి శంకరం ఇంటికి వచ్చాడు. శంకరం రాధని చూస్తూనే ఎదురొచ్చి చెయి పుచ్చుకుని లోపలికి తీసుకు వచ్చాడు. నారాయణ వెనకకే వచ్చి కూర్చున్నాడు.

"గిరిజా! రాధ వచ్చిందమ్మా" అంటూ పిల్చాడు. శాంతమ్మ పోయిన తరువాత గిరిజకి ఒంటరిగా ఇంట్లో తోచటం కష్టంగా వుంది. శంకరం ఆఫీసుకి వెళ్ళిన సమయాల్లో వంటచేసి మహిళాసమితికి వెడుతోంది. ఇంటరు పరీక్షకి ప్రయివేటుగా కట్టించాడు శంకరం. కాసేపు బుక్స్ చదువుతుంది. వంట చేస్తుంది.

గిరిజ వంట చేస్తోంది. రాధని పిల్చి దగ్గర కూర్చోపెట్టుకుంది. ఖబుర్లు చెపుతూ కూర తరుగుతోంది.

రాధకి గిరిజ ఖబుర్లు నచ్చినాయి. గిరిజ వెంట వెంట తిరుగుతూ అన్నీ పన్లని గమనించటం సరదాగా వుంది. గిరిజ ఎంబ్రాయిడరీ ఎంతో బాగా వేస్తుంది. రాధకి చిన్న చిన్న కుట్లు నేర్పింది. గిరిజ సినిమా ఖబుర్లు చెప్తుంటే పకపక నవ్వేది రాధ.

"రాధతో చక్కగా కాలక్షేపం అవుతుంది అన్నయ్యా" అనేది గిరిజ. రాధ కూడా గిరిజ దగ్గర సంతోషంగా ఉంటుందని గ్రహించాడు శంకరం. రాధ దిగులుగా వున్నప్పుడల్లా తీసుకువచ్చి గిరిజదగ్గర విడిచి వెళ్ళేవాడు. కాసేపయిన తరువాత గిరిజ రాధని తీసుకొచ్చి వాళ్ళ ఇంటి దగ్గర దింపివెళ్ళేది.

"రాధ వచ్చాక మా గిరిజకి బాగా కాలక్షేపంగా వుందిరా నారాయణా!" అనేవాడు శంకరం.

"రాధ దిగులుగా, బెంగగా వుంటే నేను చూడలేనురా శంకరం. నిజంగా భగవంతుడు వీళ్ళకి ఇంత దురదృష్టాన్ని ఎందుకు కలిగించాడో తెలియదు." నారాయణ కంఠం బరువుగా పలికేది.

"దీనికే మరీ వాళ్ళనాన్న దగ్గర అలవాటు చిన్నవాళ్ళిద్దరూ ఫరవాలేదు. దీంతో మరీ కష్టంగా వుంది," అనేవాడు నారాయణ.

రాధకి గిరిజ దగ్గర, శంకరం దగ్గర బాగా చనువు పెరిగింది.

10

నారాయణకి ఇప్పుడు జీవితంలో ఒకటే గమ్యం. తనంటే దూరంగా పారిపోయే అదృష్టలక్ష్మిని ఏ విధానయినా వెతికిపట్టుకోవాలన్న పట్టుదల ఒక్కటే నారాయణ జీవితాన్ని నడిపిస్తోంది. అందుకుగల అడ్డుమార్గాల నన్నిటిని కూలంకషంగా పరిశోధిస్తున్నాడు. ఆ వూరిలో ధనదేవత ముద్దుబిడ్డ లయి, పనిపాటులేక తిరిగే చలపతిలాంటివాళ్ళు మరికొందరున్నారు. చలపతి వీరందరికీ నాయకుడులాటివాడు. నారాయణ చలపతికి నమ్మిన బంటులాటివాడు. ఆ గుంపంతా ఎటు తిరుగుతూవుంటే నారాయణా అటే పోతూ వుంటాడు. నారాయణని తమతోపాటుగా మద్రాసు, బెంగుళూరు హైదరాబాదు తీసుకుపోతూ వుంటారు. నారాయణ లక్ష్యం తను ఏనాటికయినా సత్యన్నారాయణలాగా క్షణాల్లో ఎదిగిపోవాలన్నదే!

ఒకరోజు నారాయణ గది బూజు దులుపుతుంది శారద. చీపురుకి తగిలి అటకమీదుగా నున్న చిన్న అట్టపెట్టె కింద పడింది. దాంట్లోంచి గదంతా వెదజల్లబడిన కాగితం ముక్కల్ని చూసి శారద ఆశ్చర్యపోయింది.



అవన్నీ లాటరీ టిక్కెట్లు. అన్ని స్టేట్సు లాటరీ టిక్కెట్లు వున్నాయి అందులో. శారద మరో విషయం గమనించలేకపోయింది. అందులో రేసులకి సంబంధించిన టిక్కెట్లు గూడా వున్నాయి.

వాటిని చూడగానే శారద ప్రాణం ఉసూరుమంది, ఎన్ని వందల వేల రూపాయలు తగలపోస్తున్నాడో అనిపించి. కాణీ సంపాదనలేని నారాయణకి ఇంత డబ్బు ఎక్కడినించి వస్తున్నట్టో ! తండ్రిమీద జాలివేసింది. ఆయన రెక్కలు విరుచుకుని సంపాదిస్తుంటే వీడు ఇలా తగలేస్తున్నాడన్నమాట అనుకుంది.

నారాయణ పేకాటలో కూడా తన అదృష్టాన్ని పరీక్ష పెట్టాడని శారదకి తెలియదు.

శారద పెళ్ళికి చేసిన ఐదువేల రూపాయల అప్పు ఈనాటివరకు పూర్తిగా తీర్చలేకపోయారు సుందరయ్యగారు. మరో వెయ్యిరూపాయలు తీర్చవలసివుంది. బాకీదారు వత్తిడి చేస్తున్నాడు. ఆయన మరో మార్గంలేక ఉన్న రెండు ఎకరాల పొలంలోనూ అరఎకరం అమ్మేశారు. రెండువేల రూపాయలు వచ్చింది. ఆ డబ్బు తీసుకుని తనే వెళ్ళి బాకీ తీరుద్దామనుకున్నారు.

ఆ ఎండల్లో ప్రయాణం చెయ్యటానికి భయపడ్డారు. అప్పుడే నారాయణ ఇంటికి వచ్చి భోజనం చేస్తున్నాడు. సుందరయ్యగారు కొడుకుని పిల్చి డబ్బు యిచ్చి పక్కవూరిలో ఉన్న పరంధామయ్యగారి బాకీ తీర్చి రమ్మని చెప్పారు. రైల్లో ప్రయాణం చేసేటప్పుడు డబ్బును ఎలా జాగ్రత్త పెట్టుకోవాలో, అక్కడికి వెళ్ళిన తరువాత చెయ్యవలసిన పనేమిటో అన్నీ ఒకటికి పదిసార్లు హెచ్చరించి మరీ పంపారు.

11

"బాబూ, శంకరం" అన్న పిలుపుకి తల ఎత్తి చూశాడు శంకరం. పార్వతమ్మగారు గుమ్మంలో నిలబడి వుంది.

"రండి అత్తయ్యా, లోపలికి రండి" అన్నాడు మర్యాదగా లేస్తూ.

"నారాయణ రెండు రోజులయి ఇంటికి రాలేదు నాయనా! నీగ్గానీ ఏమయినా చెప్పాడేమోనని..." ఆవిడ గుమ్మంలో నిలబడే అడిగింది.

"ఏదో అనబోయిన శంకరం చటుక్కున ఆగిపోయాడు. అలసటగా, దిగులుగా, నీరసంగా కనిపిస్తున్న ఆవిడని చూసి నోటిలోని మాటలు నోట్లోనే ఆగిపోయినాయి.

"నా కేం చెప్పలేదత్తయ్యా." ఆవిడవైపు సూటిగా చూడలేక నేలవైపు చూస్తూ జవాబిచ్చాడు.

"ఉస్సురంటూ ఆవిడ వెనక్కి తిరిగి "సరే వస్తా శంకరం. ఏదయినా ఖబురు తెలిస్తే చెప్పు" అన్నారు.

"లోపలికి రాకుండానే వెళ్ళిపోతున్నారేం అత్తయ్యా?" లోపల్నించి వచ్చిన గిరిజ మాటలు విని పార్వతమ్మగారు తిరిగి చూసింది.

"ఏంలేదమ్మా శంకరాన్ని ఖబురు కనుక్కుందామని వచ్చాను మళ్ళీ వస్తాలే" అంటూ వెళ్ళిపోయారావిడ.

గిరిజ ప్రశ్నార్థకంగా అన్నగారివైపు తిరిగి చూసింది. శంకరం ఉస్సు రంటూ కుర్చీలో కూలబడి ఆవిడ వెళ్ళినవైపే చూస్తున్నాడు.

"ఏమయిందన్నయ్యా ?"

"ఏముందమ్మా అయ్యేందుకు. మామూలే. హైదరాబాదులో సీజను మొదలయింది గదూ. అక్కడికే ఉడాయించాడన్నమాట.

"ఏం సీజనూ ?" అయోమయంగా ప్రశ్నించిన గిరిజని చూసి శంకరం జాలిగా, కోపంగా నవ్వాడు.

"ఇంకా ఏం వుంది ? రేసులు." అప్పటికి అర్థమయింది అన్నగారి కోపమంతా స్నేహితుడిమీదేనని.

"నారాయణ రేసులగ్గూడా వెడతాడా అన్నయ్యా? ఆడతాడా ? చూడటానికేనా ?"

"చూడటానికి వెళ్ళినా ఆడాలనే అనిపిస్తుందమ్మా."

"పాపం ఆవిడకి ఆ సంగతి చెప్పకపోయావా ? కొడుకు యింటికి రాలేదని ఆవిడ ఖంగారు పడటంలా ?" అంది.

"చెప్పి మరింత ఏడిపించటం ఎందుకమ్మా. వస్తాడుగా. వచ్చాక గోడ కట్టినట్టుగా ఏదో ఓ కట్టుకథ చెబుతాడు ఆవిడకి." కోపంగా అంటున్న శంకరాన్ని చూసి మరేం అడగలేకపోయింది గిరిజ

* * *

నీరసపడిన శరీరాలతో, నిరాశ నిండిన మొహాలతో రేసుకోర్సునుంచి బయటపడ్డారు చలపతి, నారాయణలు.

"హోటలు అద్దె చెల్లించటానికయినా మిగిలిందా లేదా గురూ ?" చలపతి ప్రశ్న విని నారాయణ జేబులు తడుముకున్నాడు. ఇరవై రూపాయ లున్నాయి లెక్కపెట్టగా.

చలపతి జేబులన్నీ దులిపి పాతిక రూపాయలు బయటికి తీసాడు.

"వెంటనే ఖండా ఎత్తెయ్యాలి గురూ, లేకపోతే ప్రమాదం" అన్నాడు చలపతి.

నారాయణకి హఠాత్తుగా తను పోగొట్టుకున్న పదివందల రూపాయలు కళ్ళముందు కదిలినాయి. ఒక్క క్షణం అడుగులు తడబడ్డాయి. మైకం దిగిపోయినట్టయింది. అర ఎకరం అమ్మి, తనమీద నమ్మకముంచి తండ్రి తన చేతికి ఇచ్చిన మొత్తం అది. పొరుగూరిలో బాకీ తీర్చి రమ్మని పంపిన తండ్రికి తనేం సమాధానం చెప్తాడు నారాయణకి కాళ్ళు వణికి, కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. చలపతి చూడకుండా కళ్ళు అద్దుకున్నాడు.

ఆ వెయ్యి రూపాయలకి తనేం సమాధానం చెప్పాలా అన్న ఆలోచనతోటే నారాయణకి తిరుగు ప్రయాణం అంతా గడిచిపోయింది.

12

నారాయణ సిగరెట్ తాగుతూ శంకరం ఎదురుగా కూర్చున్నాడు.

నారాయణని పరీక్షగా గమనిస్తున్నాడు శంకరం. అతని చూపులు నారాయణకి ఇబ్బందిగా వున్నాయి.

"ఇదేం బాగాలేదు నారాయణా." హఠాత్తుగా అన్నాడు శంకరం. ఉలిక్కి-పడ్డ నారాయణ ప్రశ్నార్థకంగా చూశాడు శంకరంవైపు

"వెళ్ళి రేసులు ఆడొచ్చిందేకాక, బాకీ తీర్చటానికి వెడుతుంటే రైల్లో ఎవడో పాకెట్ కొట్టేశాడని ఇంట్లో చెబుతావా ?" ఆ డబ్బు ఎంత కష్టపడి మీ నాన్నగారు జతపరిచారో నువ్వెప్పుడయినా ఆలోచించావా ?"

"నారాయణ సిగ్గుతో తలవంచుకున్నాడు అంతలో రోషం తన్నుకొచ్చింది. "నీ కీ విషయాలన్నీ ఎవరు చెప్పారు ?" అన్నాడు తీక్షణంగా చూస్తూ.

శంకరం మెల్లగా నవ్వాడు. "పిల్లి కళ్ళుమూసుకుని పాలు త్రాగుతూ, నన్నెవరూ చూడటంలేదు అనుకుంటుందిట!"

చర్రున వచ్చిన కోపాన్ని సిగరెట్ మీద చూపించాడు నారాయణ మౌనంగా కాలుతున్న సిగరెట్ చివరని చూస్తూ కూర్చున్నాడు.

"ఇప్పటికయినా ఏదో ఒక వుద్యోగం చూసుకో నారాయణా. ఎన్నాళ్ళు ఇలా గడుపుతావు ?"

"నా క్వాలిఫికేషన్‌కి ఏ మాదిరి వుద్యోగం దొరుకుతుందంటావు?" నారాయణ తాపీగా ప్రశ్నించాడు.

"నీ పొట్ట నీవు పోసుకోవటానికి ఏదో ఒకటి దొరక్క-పోదు."

"దొరుకుతుందనుకో ! ఏమాత్రంది ? ఏ ఎల్.డి.సి.యో, అలాటిదే మరొకటో దొరుకుతుందనుకో. ఎంత జీతం ఇస్తారంటావు ? నెలంతా ఒళ్ళు విరుచుకుని చాకిరీ చేసినా వాళ్ళిచ్చే జీతం నువు ఒక్క-పూట జాలీగా గడప టానికి సరిపోతుందా ? నా తల్లిదండ్రుల్ని పువ్వుల్లోపెట్టి పూజించాలని నాకు వుంది. అందుకు మరి నా జీతం సరిపోతుందా ? మరి పెళ్ళవుతుందనుకో. నా భార్యని కాలు కదపనివ్వకుండా ప్రేమగా చూసుకోవడానికి వీఁ వుతుందా ? నా అక్క-చెల్లెళ్ళకి వాళ్ళు కోరిన చీరెసారె సంతోషంగా ఇచ్చేంత స్తోమత వుంటుందంటావా ?"

నారాయణ తర్కానికి శంకరం ఆశ్చర్యంతో అవాక్క-యినట్టు ఉండి పోయాడు.

"వచ్చే జీతం చాలలేదని అసలు ఉద్యోగాన్నే వొద్దనుకుంటారా ఎవరయినా అని గదూ నీ ఆశ్చర్యం! కాకిలా కలకాలం బ్రతికేకంటే, హంసలా ఆరు ఘడియలు బ్రతికినా చాలు శంకరం!" నారాయణ అదే స్థాయిలో అన్నాడు.

"అంటే నీ ఉద్దేశ్యం..."

"మరేంలేదు. ఈ అణాకాణీ వుద్యోగాలు చెయ్యాలంటే నా ప్రాణం పోయినట్టుగా వుంది. అదృష్టం కలిసివచ్చి ఏ జాక్‌పాటో తగిలిందనుకో, ఇలాటి వెధవ ఉద్యోగాలు లక్షా తొంభై కొనిపారేయగల్ను. మావాళ్ళందరినీ పువ్వులు పరిచి నడిపిస్తాను నేనే పదిమందికి ఉద్యోగాలిస్తాను. తెలిసిందా?"

శంకరం చిరునవ్వుతో నారాయణని చూస్తూ అడిగాడు. "అవునూ, ఇదంతా ఎప్పుడు? నీకు ఆ జాక్‌పాట్ ఏదో వచ్చినప్పుడుగదా? అది నీకు వస్తుందని గ్యారంటీ ఏమయినా వుందా?"

నారాయణ నవ్వాడు శంకరం అమాయకత్వాన్ని చూసి అన్నట్లుగా. "రాదని గ్యారంటీ కూడా ఏం లేదుగా. తాళ్ళ సత్యానికి ఆరు లక్షలు రాలా? కూటికి గతిలేనివాడు ఈ రోజు ఈ జిల్లాలోని బిజినెస్సంతా గుత్తకి తీసుకోలా?"

"నువు చెప్పింది బాగానే వుంది నారాయణా, ఒకడికి ఆరు లక్షలో, ఆరు వందలో రావాలంటే నీలాటివారెందరు నష్టపోవాలో ఎప్పుడయినా ఆలోచించావా?"

"అలా అని చెప్పి చేతులు ముడుచుకు కూర్చుంటే అదృష్టదేవత నీ దరిదాపులకే రాదు బ్రదర్. ఏ పనయినా సాధనతో సమకూరుతుందని చదువుకోలా?"

నారాయణకి తను మరింకే జవాబు చెప్పలేనట్టుగా శంకరం మౌనంగా కూర్చుండిపోయాడు. శంకరం చూపుల్లోని జాలిని నారాయణ అసలు భరించ లేదు. చటుక్కున లేచి నిలబడి సిగరెట్ బయటికి విసిరేశాడు.

"నావాళ్ళంటే నా కెంతో ప్రేమ శంకరం. చెప్పలేనంత. కాని ఈ ప్రపంచంలో ఈ ప్రేమని ప్రదర్శించుకోటానికి డబ్బు మినహా మరే మార్గం వుందో చెప్పు! ఎప్పటికయినా దాన్ని సాధించాలనే నా ప్రయత్నమంతా! తెలిసిందా?" నారాయణ కళ్ళల్లో నిలిచిన నీటిని శంకరం గమనించకుండా చకచకా బయటికి వెళ్ళిపోయాడు.

తలుపు పక్కగా నిలబడి ఈ సంభాషణ అంతా వింటున్న గిరిజ ఆశ్చర్యంతో బొమ్మలాగా వుండిపోయింది. మాటిమాటికి నారాయణ చివరిగా అన్న మాటలే చెవుల్లో మ్రోగసాగాయి. అతని రూపమే కళ్ళముందు కదులుతూ వుండిపోయింది.

13

పాతికేళ్ళు దాటుతున్నా నిలకడలేని కొడుకుని చూసే పార్వతమ్మగారి దిగులంతాను. బాధ్యత తెలియని కొడుకంటే తండ్రికి కోపం. శక్తి వుడిగి పోతున్న తన రెక్కలకి ఆసరాగా ఒక్క కొడుకూ లేదే అన్నది ఆయన బాధ. మిగిలిన ముగ్గురు కొడుకులూ రెక్కలు వచ్చిన పక్షుల్లాగా ఎవరిదోవన వాళ్ళు వెళ్ళిపోయారు దగ్గరున్న నారాయణయినా తనకి ఆసరా అవుతాడేమో అనుకుంటే ఆ ఆశ నిరాశే అయింది. రెక్కాడితే గానీ డొక్కాడని సంసారాలు భర్తని పోగొట్టుకొన్న కూతురు, పిల్లలు ఆయనకి మరో బంధం.

నారాయణ, పిల్లిలాగా ఇంట్లోకి ప్రవేశించాడు మూడు రోజులుగా కొడుకు కోసరం చూస్తున్న పార్వతమ్మగారి గుండె కుదటపడింది.

"ఎప్పుడొచ్చావురా నారాయణా ? ఇన్నాళ్ళు ఎక్కడికి వెళ్ళావ్" అందావిడ ఆత్రుతగా.

"మాధవయ్యగారు భీమవరంలో ఏదో ఉద్యోగం ఉందని రాశారు. వెంటనే పరిగెత్తుకెళ్ళాను" అన్నాడు నారాయణ.

కొడుకు మొహంలోని అలసట చూసి ఆవిడ ద్రవించిపోయింది. "ఆహా ఏమయింది ఇంతకీ? వుద్యోగం వచ్చినట్టేనా ?"

నారాయణ మొహం నిరాశతో నిండిపోయింది. "మరొకడెవడో మినిష్టరుగారి రికమెండేషను తెచ్చుకొట్ట వాడికిచ్చేశారు. ఇవ్వక తప్పేదేముంది ? ఈసారి వేకెన్సీ వస్తే మాధవయ్యగారు ఖబురు పెడతానన్నారు" అన్నాడు నిస్త్రాణగా.

వెలగబోయిన దీపం గుప్పున ఆరిపోయినట్లయింది పార్వతమ్మగారి ఆశ కాస్తా. వాళ్ళ సంభాషణ వింటున్న సుందరయ్యగారు కోపంతో పళ్ళు పటపట లాడించారు. నారాయణని హైద్రాబాదులో రేసులదగ్గర చూశామని చెప్పారు ఆయనకి తెలిసిన మనిషి తల్లితో పచ్చి అబద్ధాలు సునాయాసంగా ఆడే కొడుకుని చూసి ఆయన గుండెలు మండిపోయినాయి. నారాయణని చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది ఆయనకి ఆ కోపంలో తనేం చేస్తాడో తనకే తెలియదని, చకచకా వీధిలోకి వెళ్ళిపోయారాయన.

నారాయణ తల్లి ఆప్యాయంగా పెట్టిన భోజనం తిని, వీధికేసి బయల్దేరాడు. లాటరీ టిక్కెట్ల షాపులో టిక్కెట్లని పరీక్ష చేస్తున్నాడు నారాయణ ఆ షాపు వాడికి రెగ్యులర్ కస్టమర్. అతను అన్ని లాటరీల వివరాలు, డ్రా డేట్లు, ప్రైజు ఎమౌంట్లు, ఏ టిక్కెట్లు తీసుకోవాలో అన్నీ నారాయణకి వివరిస్తున్నాడు



శ్రద్ధగా. నారాయణ అన్నీ పరిశీలించి పెద్ద మొత్తాలున్న టిక్కెట్లని తీసుకుని డబ్బు చెల్లిస్తూవుండగా భుజంమీద చెయ్యి పడింది. ఎవరా అని తిరిగి చూస్తే శంకరం! "హలో కనపడటంలేదేం" అంటూ పలకరించాడు నారాయణ చేతిలోని టిక్కెట్లవంక పరీక్షగా చూస్తూ.

నారాయణ శంకరం చూపుని గమనించాడ. టిక్కెట్లని జేబులో పెట్టుకుంటూ "మళ్ళీ పిట్లమీద ఉపన్యాసం దంచబోకు నాయనా ! నేను చెప్పిన థియరీ ఎన్నటికీ వర్తిస్తుందని తెలుసుకో. సాధనమున సమకూరు పనులు" అంటూ నవ్వాడు

శంకరం కూడా నవ్వాడు "అవును నారాయణా, సాధన అనేది కత్తిలాటిది. పళ్ళు కోసుకోవచ్చు, మెడా తెగ్గోసుకోవచ్చు" అన్నాడు.

"మరీ ఇంత శంకరాచార్యులవారిలాగా తయారవకు శంకరం. జీవితం ఆనందించటానికే అన్నది గుర్తుంచుకో" అంటున్న నారాయణని జాలిగా చూడటం తప్ప మరేం చెయ్యలేకపోయాడు.

"ట్రై ఎండ్ ట్రై. విజయం నీదే. వస్తా పనుంది" అంటూ నాలుగడుగులు వేశాడో లేదో చలపతి ఎదురొచ్చాడు.

"నువ్విక్కడున్నావా నారాయణా. వెతకలేక చస్తున్నాం. ఓ హేండ్

తక్కువయింది. నిన్ను పట్టుకుందామనే ఊరంతా తిరుగుతున్నాను" అంటూ నారాయణని కాస్మాపాలిటన్ క్లబ్బువైపు నడిపించుకుపోయాడు చలపతి.

14

నారాయణ పిల్లిలాగా ఇంట్లోకి ప్రవేశించాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ వుండుండి వెక్కిళ్ళులాగా వినవస్తున్నాయి. పిల్లల గోలతో తల్లి మందలింపులతో ఎప్పుడూ సందడిగా వుండే ఇల్లు ఇలా వుందేమిటా అన్న శంక నారాయణ మనసులోకి వచ్చింది. చీకటిగావున్న ఓ మూల కుర్చీలో ఎవరో వున్నట్టుగా గమనించి దగ్గరగా వచ్చిచూశాడు. తండ్రి కళ్ళు మూసుకుని మడతకుర్చీలో పడుకునివున్నాడు. ఆయన మెలకువగావున్నాడో నిద్రపోతున్నాడో నారాయణకి తెలియలేదు. తల్లి గుమ్మం మీద తలపెట్టుకుని వంటగది గుమ్మంలో పడుకుంది. చిన్నపిల్లలిద్దరూ దొడ్లో బావిగట్టుమీద కూర్చుని ఏంచెయ్యాలో తోచనట్టుగా ఏడుస్తున్న తల్లివైపు తిక్కులు చూస్తున్నారు. ఓ మూలగా అరుగుమీద కూర్చుని చేతుల్లో మొహం దించుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్న అక్కగారిని చూడగానే నారాయణకి ఇంట్లో జరగరానిదేదో జరిగిపోయిందన్న విషయం తట్టింది.

"అమ్మా ఏమయింది ?" అంటూ తల్లి దగ్గరగావచ్చి మెల్లగా పలకరించాడు. ఆవిడ కళ్ళు తెరిచి చూసింది. గట్టుతెగిన ప్రవాహంలా కన్నీరు చెంపలమీదకి దూకింది. నారాయణ ఖంగారు మరింత ఎక్కువయింది. తమ్ముడి గొంతువిని శారద ఎక్కిళ్ళు మరింత ఎక్కువయ్యాయి.

"ఏమయిందమ్మా !"

"ఏముంది నాయనా అయేందుకు. రాఘ మన్ని విడిచి వెళ్ళిపోయిందిరా నారాయణా !" ఆవిడ దుఃఖం మళ్ళీ పొంగుకొచ్చింది.

నారాయణ నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు.

"పిచ్చితల్లి ఆ దేవుడి దగ్గరకెళ్ళిపోయిందిరా నాయనా."

నారాయణ కలలో నడుస్తున్నవాడిలాగా అక్కగారి దగ్గరకు నడిచాడు. శారద కుళ్ళి కుళ్ళి ఏడుస్తోంది. నారాయణ దగ్గరగా వచ్చి నిలబడ్డాడు. ఏం మాట్లాడాలో ఏం చెయ్యాలో తెలియని విమూఢుడిలాగా నిలబడి చూస్తున్నాడు. అసంకల్పితంగానే అతని చెయ్యి శారద వీపుని, తలని నిమిరింది. దుఃఖంతో శారద గుండెలు ఎగిసిపడుతున్నాయి.

''వూరుకో అక్కయ్యా. వూరుకో.'' ఆ మాటలు తనకే వినిపించినవో లేదో అన్నంత మెల్లగా పలికాడు.

పిల్లలిద్దరూ నారాయణ దగ్గరగా వచ్చి నిలబడ్డారు బిక్కు బిక్కు మంటూ.

"మావయ్యా రాధకి జ్వరంవచ్చి చచ్చిపోయింది మావయ్యా," ఆరేళ్ళ రమ నారాయణ చొక్కా పుచ్చుకుని చెప్పింది బిక్కమొహం వేసుకుని.

"కాదు మావయ్యా. రాధ గాజులు పోయాయని బెంగపెట్టుకుని చచ్చిపోయిందట." ఎనిమిదేళ్ళ గోపి ఆరిందాలాగా అన్నాడు.

నారాయణ తలమీద పిడుగు పడిన వాడిలాగా శారద పక్కన కూర్చుండి పోయాడు.

పక్కింటి హనుమాయమ్మగారు పెరటి తలుపు తీసుకుని లోపలికి వచ్చింది. నారాయణని చూస్తూనే, "చూశావా నాయనా ఎంత ఘోరం జరిగిపోయిందో. నువ్వు వూళ్ళో లేవు. రెండు రోజులు జ్వరం కాసి మూడోనాటికల్లా అన్నీ ముగించుకొని వెళ్ళిపోయింది పిచ్చిపిల్ల. వూరుకోమ్మా శారదా! ఎంతకాలమని ఇట్టా ఏడుస్తావు. నువు ఏడుస్తే మాత్రం పోయిన పిల్ల తిరిగొస్తుందా చెప్పు? ఊ చెప్పమ్మా! ఊరుకో మరి!"

శారద దుఃఖం ఆవిడ ఊరడింపుకు ఎక్కువయిందే గానీ తరగటంలేదు. నారాయణ గాజుబుడ్లలాటి కళ్ళతో ఆవిడవైపే చూస్తున్నాడు.

"ఇంతకీ ఖర్మం తోసుకొస్తే అలాగే జరుగుతాయనుకో. రాధమ్మకి తలంటి పోస్తూ చేతుల్నున్న బంగారపు గాజులు తీసి గూట్లో వుంచిందట శారద. ఓ రెండుగంటలయ్యాక చేతులకి తొడుగుదామని చూస్తే గాజుల్లేవుట. ఎంత వెతికినా కనపడలేదట. పనిదాన్ని అడిగితే తెలియదంటూ వట్టూ, సత్యాలూ పెట్టుకుందిట. ఈ పిచ్చిపిల్ల ఆ గాజుల కోసరం ఒకటే వరసన ఏడుపు. అవి వాళ్ళ నాన్న బతికి ఉన్నప్పుడు దానికి చేయించాట్ట. ఆ గాజుల్ని ఒక్క క్షణం తీయదుట చేతుల్నించి. ప్రాణం విసిగిపోయి కూతుర్ని నాలుగు బాదిందట మీ అక్కయ్య. ఆ సాయంత్రానికి బిళ్ళపెట్టుగా జ్వరం వచ్చిపడింది. రెండు రోజులు అట్లాగే బాధపడింది. డాక్టరు చూసి ఏదో విషజ్వరం అన్నాడు. వెయ్యవలసిన మందలెన్నో వేశారు చెయ్యవలసినదంతా చేశారు. ఇంతకీ ఎంత చేసి ఏం ప్రయోజనం మనకి ప్రాప్తం లేకపోయాక. పోయే ముందుగూడా 'గాజులు, గాజులు' అంటూనే ప్రాణం విడిచింది." హనుమాయమ్మగారు కళ్ళు వొత్తుకుంటూ నారాయణ లేని ఈ వారంరోజుల్లోనూ జరిగినదంతా ఏకరువు పెట్టింది.

నారాయణ చెవులు వింటున్నా, కళ్ళు చూస్తున్నా అవేమీ మనసుకి ఎక్కటం

లేదు. తలమీద మంచుపర్వతాన్ని పెట్టినట్లుగా మనసంతా స్తబ్దుగా వుంది. కళ్ళముందు, 'మావయ్యా, మావయ్యా' అంటూ గిలకలాగా హుషారుగా తిరుగుతూ తెల్లగా బొద్దుగా ముద్దుగా వుండే రాధే గిరగిరా తిరుగుతోంది. శారద పిల్లలు మగ్గురిలోకీ రాధంటే నారాయణకి ఇష్టం బాధ్యతారహితంగా తిరిగే నారాయణంటే ఇంట్లో పెద్దంతా ముభావంగా వుంటే, ఇంట్లోవున్న కాసేపూ నారాయణకి రాధతో కాలం గడిచిపోతుంది. మాయా మర్మాలు, కల్మషాలు ఎరగని ఆ చిన్న రాధ కళ్ళు తిప్పకుంటూ, ముసిముసి నవ్వులు నవ్వుతూ మాట్లాడుతుంటే నారాయణకి మనసులోని బాధలు, నిరాశలు అన్నీ 'ఉఫ్'న ఎగిరిపోయినట్లుగా మనసు ప్రశాంతంగా వుండేది బుట్టబొమ్మలాగా పరికిణీ, జాకెట్ వేసుకుని, రెండుజడలు ఊపుకుంటూ తిరిగే రాధ, 'గాజులు, గాజులు' అంటూ మంచంలో మరణయాతన పడే దృశ్యమే నారాయణ కళ్ళముందు గిరగిర తిరుగుతోంది. మాటా మంతీ లేకుండా బిగుసుకుపోయినట్లుగా కూర్చున్న నారాయణని చూసి హనుమాయమ్మగారు భయపడింది. "నారాయణా! ఇప్పుడే వూటినుంచి వచ్చినట్టున్నావు. లే. లేచి స్నానం అదీ కానిచ్చి కాస్త ఎంగిలిపడు. నీతోపాటు శారదగ్గూడా ఓ ముద్ద తినిపించు. మూడు రోజుల్నించి కటిక ఉపవాసాలు చేస్తోంది" అందావిడ.

15

ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్నట్లుగా వినబడింది, వంటపనిలోనున్న గిరిజకి. ముందు గదిలోకి వచ్చి చూసిన గిరిజ ఆశ్చర్యపోయింది. నారాయణ కుర్చీలో కూర్చుని టేబుల్‌మేద రెండు చేతుల్లో తల ఆనించి వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. గిరిజకి ఒక్క క్షణం ఏం చెయ్యాలో అర్థంకాలేదు. శంకరం ఇంకా ఆఫీసునుంచి ఇంటికి రాలేదు. నారాయణ గిరిజని గమనించనేలేదు. మనసులో కొండలాగా పేరుకుపోయిన భారాన్ని కరిగించుకోవటానికా అన్నట్టు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

"ఏమయింది? మమ్మల్నే. ఏమయిందండి" అంది గిరిజ మృదువుగా. నారాయణ ఆ మాటల్ని విన్నట్టులేదు.

"ఎందుకు? రాధ పోయినందుకేనా! అనుకోనిది జరిగిపోయింది హఠాత్తుగా. కళ్ళముందే కదులుతోందల్లే వుంది." ఓదార్పుగా అన్న గిరిజ గొంతు కూడా బొంగురుపోయింది.

"లేదు గిరిజా లేదు. నేను పాపిని, హంతకుడిని. రాధ చచ్చిపోలేదు. నేనే

చంపాను. నా పాపానికి శిక్ష లేదు. లేదు" కుమిలి కుమిలి ఏడుస్తున్న నారాయణ మాటలు గిరిజకి అర్థంకాలేదు

"అరే అంతగా ఏడవకండి. ఏం చేస్తాం. భగవంతుని ఆజ్ఞని మనం ధిక్కరించలేం గదా. తలనొప్పి వస్తుంది. అంత బాధపడకండి." గిరిజ టేబుల్ దగ్గరగా వస్తూ అంది.

నారాయణ దుఃఖం మరింత ఎక్కువయింది తలని టేబుల్‌కేసి కొట్టుకుని ఏడుస్తున్నాడు. గిరిజకి ఏం చెయ్యాలో పాలుపోలేదు నారాయణని పట్టుకుని ఆపాలని వచ్చిన చెయ్యి వెనక్కి తీసుకుంది పరాయిమగవాడిని తాకాలంటే ఏదో సంకోచం. పసిపిల్లవాడిలా ఏడుస్తున్న నారాయణని చూస్తే ప్రతి స్త్రీలోనూ సహజంగా వుండే తల్లిమనసు గిరిజని వూరుకోనివ్వటంలేదు

''వూరుకోండి నారాయణగారూ బాధపడకండి." నారాయణ నుదురు చిట్లి రక్తం చిమ్మింది. గిరిజ మరింక ఆగలేకపోయింది రెండుచేతుల్తోనూ నారాయణ తలని పట్టుకొని బలవంతాన అతన్ని కుర్చీలో సరిగ్గా కూర్చోపెట్టింది ఫేను స్విచ్ ఆన్‌చేసి, లోపలికి వెళ్ళి టవల్ తడిపి తీసుకువచ్చి నారాయణ నుదుటి మీదినుంచి బొట్లుగా కారుతున్న రక్తాన్ని తుడిచి తడి టవల్‌ని అదిమి పెట్టింది. చల్లటి టవల్ మొహానికి తగలగానే నారాయణ మనసులోని మంట కాస్తంత తగ్గినట్టుగా వుంది. చల్లగా వేస్తున్న ఫేనుగాలికి అలిసిపోయినట్టుగా కుర్చీ వెనక్కి వాలిపోయి కళ్ళు మూసుకున్నాడు ఈ సందడిలోవున్న నారాయణగానీ, గిరిజగానీ ఎదురు వీధిలోని పంకజమ్మగారి మనవడి పుట్టినరోజుకి పిలవటానికి వచ్చిన ముత్తైదువుల్ని గమనించనేలేదు వాళ్ళు క్షణం గుమ్మంలోంచి తొంగిచూసి, తలుపు టకటకలాడించారు తిరిగి చూసిన గిరిజ గుమ్మంలో నిలబడ్డ ఆడవాళ్ళనిచూసి చప్పున చేతిలోని టవల్‌ని టేబుల్‌మీద పడేస్తూ 'రండి' అంటూ గుమ్మంవైపు వచ్చింది

వాళ్ళో క్షణం లోపలికి రామా వద్దా అన్నట్టుగా ఊగిసలాడి "బొట్టు పెట్టించుకో గిరిజా. రేపు పేరంటానికి తప్పకుండా రా" అంటూ ఓసారి లోపలికి తొంగిచూసి "పార్వతమ్మగారి నారాయణ గదూ ?" అన్నది ఓ సన్నగా వాసంబద్దలా గా వున్న ఆవిడ.

ఆవిడ మాటల్లోని సందేహాన్నిగానీ, అనుమానాన్నిగానీ గిరిజ గుర్తించనేలేదు. ''ఊ అన్నయ్య కోసరం వచ్చారు.'' అని మాత్రం అంది.

"ఊహు. మీ అన్నయ్య లేడల్లేవుందే" అందో ఆరిందాలాటి, వయసొస్తున్న పిల్ల.

"లేదు. ఇంకా ఆఫీసునుంచి రాలేదు" అంది గిరిజ.

"ఊహుం. సరే వస్తాం. తప్పకుండా పేరంటానికి రామ్మా" అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

గిరిజ లోపల్నుంచి కాఫీ కలిపి తీసుకొస్తుంటే శంకరం ఇంటికి వచ్చాడు. నుదుట చేతులుంచుకొని, అలిసిపోయినట్లుగా కళ్ళు మూసుకుని కూర్చున్న నారాయణని ఆశ్చర్యంగా చూస్తూ లోపలికి వచ్చాడు. గిరిజ అన్నగారిని పక్కగా పిలిచి అంతా చెప్పింది. "అవును పాపం వీడిదగ్గర రాధకి బాగా చేరిక ! హఠాత్తుగా ఖబురు వినటంతో తట్టుకోలేక పోయినట్టున్నాడు" అన్నాడు శంకరం.

గిరిజ కాఫీ కప్పుల్ని టేబుల్‌మీద వుంచి, తడి టవల్ని లోపలికి తీసుకు వెళ్ళింది.

"నారాయణా! కాఫీ తాగు." శంకరం గొంతు విని నారాయణ కళ్ళు తెరిచాడు. స్నేహితుడిని చూడగానే నారాయణ కళ్ళనించి జల జల కన్నీళ్ళు రాలినాయి. శంకరం అనునయంగా స్నేహితుడి భుజంమీద చెయ్యివేసి కాఫీ కప్పు చేతికి అందించాడు.

కాఫీ తాగినంతసేపూ మిత్రులిద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళు వున్నారు. నారాయణలో అరగంట క్రితం వున్న ఆవేగమూ, ఆవేశమూ తగ్గినాయి. శంకరంతో చెపుదామని నోటి చివరివరకు వచ్చిన మాటలు నోటిలోనే ఆగిపోతున్నాయి. శంకరం మనసులో ఏదో అనుమానం నీలి నీడలాగా తారట్లాడుతోంది. నారాయణని ఆ మాట అడగడమా మానటమా అన్నట్లు సందేహిస్తున్నాడు శంకరం. మిత్రులిద్దరి చూపులూ రెండు మూడుసార్లు కలుసుకుని విడిపోయినాయి.

"నారాయణా ?" శంకరం పిలుపు విని నారాయణ ఉలిక్కిపడ్డాడు. మిత్రుడివైపు చూశాడు.

"నారాయణా ! ఆ గాజులు అపహరించింది నువ్వేగదూ" అని అడగాలనుకున్న శంకరం మాటలు నారాయణవైపు చూడగానే నోటిలోనే ఆగిపోయినాయి.

క్షణాలు గడిచిపోతున్నాయి.

"శంకరం !"

నారాయణ పిలుపు విని శంకరం ఆత్రుతగా చూశాడు.

"ఆ గాజులు నేనే దొంగిలించాను శంకరం. ఆ పసిబిడ్డ ప్రాణాన్ని తీసింది నేనే. నేనే ఆ హంతకుడిని. మహాపాపిని నేనే శంకరం'' అని నారాయణ చెప్పాలనుకున్న మాటలు బయటికి రానేలేదు. శంకరంవైపు చూసి తల దించుకున్నాడు. శంకరం అంతా అర్థమయిందన్నట్లుగా జాలిగా మిత్రుడివైపు చూశాడు.

శంకరం ఓ రోజు సాయంత్రంవేళ ఆఫీసునుంచి తిరిగి వస్తూంటే ఉమా మహేశ్వరంగారు పిలిచారు. శంకరం వాళ్ళ వీధి మొదటిలోనేవుంది ఆయన ఇల్లు. బాధ్యతలన్నీ తీరిపోగా రిటైరయి హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు. శంకరంతో చనువుగా మాట్లాడుతూ వుంటారు. ఆ రోజూ అలాగే పిలిచారు.

కుశలప్రశ్నలు అయ్యాక ఆయన అసలు విషయంలోకి వచ్చారు. "శంకరం! గిరిజకి ఏవయినా సంబంధాలు చూస్తున్నావా?" అన్నారు.

"ప్రైవేటుగా ఇంటరుకి కట్టింది బాబాయిగారూ. అదయ్యాక చూడొచ్చుగదా అని..."

"చూడు బాబూ నేను పెద్దవాడినిగా చెప్తున్నాను విను. ఓ వయసు వచ్చిన తరవాత ఆడపిల్లలని ఎంతత్వరగా మరోయింటికి పంపితే మన బాధ్యత అంత తేలికవుతుంది. ఈ ప్రపంచం వుందే మహా విచిత్రమయింది. దీనికి చెవులుతప్ప కళ్ళులేవు. నలుగురు కలిసి గుర్రాన్ని గాడిదఅంటే అవుననే సమాజంలో బతుకుతున్నాం. అరటాకు ముల్లు సామెత నీకు తెల్సినదేగదా!

త్వరగా ఏదో ఓ మంచిసంబంధం నిశ్చయంచేసి ఆ బాధ్యత తీర్చుకో!" అన్నారాయన.

అప్పటికిగానీ ఆయన మనసులో ఏదో పెట్టుకని మాట్లాడుతున్నారన్న విషయం శంకరానికి తట్టలేదు.

"అసలు సంగతేమిటి బాబయ్యగారూ?" ఆత్రుతగా అడిగాడు శంకరం.

"నేను అరవైఏళ్ళ ప్రపంచాన్ని చూసినవాడిని. లోకరీతిని చెప్పాను. నీవు లేనప్పుడు నీ స్నేహితు లెవర్నీ ఇంటికి రానివ్వకు" అన్నారాయన

తనకి ఇంటికి వచ్చే స్నేహితు లెవరున్నారని, చిన్ననాటి స్నేహితుడు నారాయణ తప్ప గిరిజని, నారాయణని గూర్చి ఎవరో అసత్యంగా మాట్లాడి వుంటారని అతనికి అప్పటికి తట్టింది అతనికి కోపం ముంచుకొచ్చింది. ముఖం ఎర్రబడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

అతని ముఖకవళికలు గమనించిన ఉమామహేశ్వరంగారు అతని వీపుని అనునయంగా తట్టి "ఆవేశం అన్నివిధాల అనర్థం బాబూ కాగల కార్యంచూడు" అంటూ సాగనంపారాయన.

కోపంగా ఇంటికివచ్చిన శంకరానికి గిరిజని చూడగానే ఆ కోపం చల్లబడి పోయింది. నిర్మలంగా, నిష్కల్మషంగా నవ్వే ఆ మొహం చూడగానే అతని మనసులోని మాటలు లోపలే అణిగిపోయినాయి. తన కర్తవ్యమేమిటా అన్న ఆలోచనలో పడిపోయాడు.

16

గిరిజని ముగ్గురు సంబంధాలవాళ్ళు చూసివెళ్ళారు కుదిరిపోయిందనుకున్న ప్రతి సంబంధం చిట్టచివరికి ఏదో ఓ కారణంతో విరమించుకోవటంతో శంకరానికి రోజురోజుకి గుండెల్లో బరువు హెచ్చసాగింది. మరో పెద్దమనిషి శంకరాన్ని మొహంమీదే అడిగేశాడు. "ఏమయ్యా శంకరం! నారాయణ కాదన్నాడా? బయట సంబంధం వెతుకుతున్నావేమిటి?" అంటూ. శంకరానికి ఆయనతో దెబ్బలాడాలన్నంత కోపం వచ్చింది. చివరికి నష్టం ఎవరిదో తెలుసుకనుక మౌనంగా వుండిపోయాడు.

ఈ మధ్య శంకరంలో కలుగుతున్న చిరాకునీ, కోపాన్నీ చూసిన గిరిజకి కారణం తెలియక తికమకపడసాగింది. శంకరం తనను తప్పించుకుని తిరుగుతున్నాడని, తనతో పూర్వంలా వుండటంలేదని, తన రాకనిగూడా అతను ఇష్టపడటంలేదని నారాయణ గ్రహించటానికి చాలారోజులే పట్టింది.

ఆ రోజు శంకరానికి మనసేమీ బాగాలేదు తన తాహతుకి మించిన కట్నం ఇవ్వటానికి ఒప్పుకుని ఓ సంబంధాన్ని ఖాయపరిచాడు. ఏదోవిధంగా గిరిజ పెళ్ళి జరుగుతుందిగదా అన్న సంతోషంలోవున్న అతని ఆశల్ని కూలుస్తూ ఓ ఉత్తరం వచ్చింది ఆ రోజే. డబ్బుకంటె ముఖ్యంగా గుణసంపదకల కోడలు కావాలన్నదే తమ అభిలాష అంటూ కొన్ని కారణాలవల్ల తాము ఆ సంబంధాన్ని వదులుకుంటున్నట్టుగా రాశాడా పెళ్ళిపెద్ద. శంకరానికి మండుతున్న గుండెలమీద కారంచల్లినట్టుగా వున్నాయామాటలు. విచారంగా విసుగ్గా ఇంటికి రాగానే గిరిజ చిరునవ్వుతో ఎదురొచ్చింది.

"నారాయణ వచ్చి వెళ్ళాడన్నయ్యా నీకోసం" అంది కాఫీ ఇస్తూ. ఆ మాటలు వినగానే శంకరం అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డాడు.

"వచ్చాడా ? ఎందుకు రానిస్తావా వెధవని ? వాడిమూలానే అన్నీ ఇట్లా తగలడుతున్నాయి" అంటూ రౌద్రంగా అరిచాడు.

"ఏంజరిగిందన్నయ్యా ? గిరిజ బిక్కమొహంవేసుకొని అన్నగారి కోపానికి భయపడుతూ మెల్లగా అడిగింది,

శంకరం ఉత్తరాన్ని తీసి గిరిజమీదకి విసిరేశాడు "చదువుకో... ఇన్నాళ్ళ నుంచీ ఏ సంబంధం చూసినా ఎందుకు కుదరటంలేదో" అంటూ లోపలికి వెళ్ళి పోయాడు విసురుగా.

శంకరం ఆవేశం తగ్గగానే అనవసరంగా చెల్లెలిమీద కోపగించుకున్నందుకు సిగ్గుపడుతూ ముందుగదిలోకి వచ్చాడు.

గిరిజ ఉత్తరాన్ని చేత్తోపుచ్చుకొని, బుగ్గన చెయ్యానించుకుని నేలవైపు చూస్తూ కూర్చునుంది శంకరం దగ్గరగా వచ్చి ప్రేమగా చెల్లెలి తలమీద చెయ్యివేసి పక్కన కూర్చున్నాడు. గిరిజ కళ్ళెత్తి అన్నగారిని చూసింది. ఆ చూపుకి చలించిపోయాడు శంకరం.

"నీమీద నాకేం కోపంలేదమ్మా గిరిజా. వాడు తరుచుగా మనింటికి వస్తూ వుండటంతో లేనిపోని అభాండాలన్నీ సృష్టించారు ఈ వెధవజనం. ఏంచెయ్యాలో పాలుపోవటంలేదమ్మా." గుండెల్లో గూడుకట్టుకుంటున్న భారాన్ని చెల్లెలితో చెప్పుకుంటేనయినా కాస్త బరువు తీరుతుందనుకున్నాడు శంకరం.

"ఈసంగతి నాకు ఇన్ని రోజుల్నించి చెప్పలేదేం అన్నయ్యా" అంది గిరిజ మెల్లగా. తనని గురించి లోకమంతా కోడై కూస్తున్న విషయం తనకే తెలియక పోవటం నిజంగా ఈ ప్రపంచంలోని ఒక ఆశ్చర్యకరమైన వింతే అనుకుంది

గిరిజ. ఖారంజా, మౌనంగా క్షణాలు, నిముషాలు గడుస్తున్నాయి. ఇద్దరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

"నారాయణకి మాత్రం ఏం తక్కువన్నయ్యా?" గిరిజ సూటిగా అడిగిన మాటలకి శంకరం ఉలిక్కిపడి ఆశ్చర్యంగా చెల్లెలివైపు చూశాడు, నమ్మలేనట్లుగా. చిట్టచివరికి తెప్పరిల్లిన శంకరం కోపంగా అన్నాడు." వాడా వడ్డీ అబద్ధాలకోరు, దొంగ, జూదరి!"

గిరిజ మెల్లగా నవ్వింది. "కానీ వాటన్నిటితోబాటు మనిషిలో మంచితనం కూడా వుందన్నయ్యా." గిరిజ మాటల్ని శంకరం నమ్మలేనట్టుగా చూశాడు. లోకం అనుకునే మాటలన్నీ నిజమా ఏవిటీ అన్న సందేహం కూడా వుంది ఆ చూపులో. అన్నగారి ఆలోచలను పసిగట్టినట్టే అంది గిరిజ 'నీవు అన్నతర వాతే నేను నారాయణగురించి ఆలోచిస్తున్నానన్నయ్యా. ప్రతిమనిషిలోనూ కొన్ని బలహీనతలతోపాటు మంచితనంకూడా వుంటుందన్నయ్యా. మంచి తనాన్ని బయటకి తీసుకురాగలిగేశక్తి మనకి వుంటే ఆ మనిషి మంచిమార్గాన పడ్డట్టే.''

శంకరం చెల్లెలిమాటల్నిగూర్చి ఆలోచిస్తున్నాడు, పసిపిల్లలాటి తనచెల్లెలు ఇంతగా ఎప్పుడు ఎదిగిపోయిందని! నిజమే నారాయణలో క్షణాల్లో డబ్బు సంపాదించాలన్న యావతో బాటు మంచి గుణాలుకూడా వున్నాయి. స్నేహానికి విలువనిస్తాడు, వినయంగా, మర్యాదగా మాట్లాడతాడు. స్త్రీలంటే గౌరవంవుంది. ఎన్నివున్నా తనకాళ్ళమీద తను నిలబడలేని మగాడిని 'అసమర్థు'డనే అంటుంది ఈ సంఘం. నారాయణ వ్యక్తిత్వంలో గిరిజని ఆకర్షించిన విషయమేవిటో ఎంత తన్నుకున్నా శంకరానికి అర్థంకాలేదు.

17

నారాయణ పూర్తిగా ఇల్లుపట్టకుండా తిరగటం ఎక్కువయింది. ఎప్పుడో వస్తే వస్తాడు, లేకపోతే లేనేలేదు. వచ్చినా ఒక్కోరోజు భోజనం చేస్తాడు. ఒక్కొక్కసారి అదీ చెయ్యడు. తలిదండ్రు లిద్దరికీ నారాయణ విప్పలేని సమస్య. ఏళ్ళు పైబడుతున్నా కొడుకు తాడూ బొంగరంలేని వాడిలాగా అలా తిరగడం ఆ ఇద్దరినీ లోలోపల విచారంతో కుంగదీస్తోంది.

"పోనీ నారాయణకి పెళ్ళిచేద్దామండీ. బాధ్యతలు మీదపడి అప్పుడయినా కుదురుగా వుంటాడేమో" అంది పార్వతమ్మ.

తాడెత్తున ఎగిరిపడ్డారు సుందరయ్యగారు. "ఇలాటి సుపుత్రుడిని కన్నది చాలక ఇంకో పిల్లగొంతుకూడా కొయ్యటం ఎందుకే ? వాడికే తిండి సంపాదించుకోలేనివాడు పెళ్ళాంపిల్లల్ని ఏం పెట్టి పోషిస్తాడంటావు. లేకపోతే వాడి సంసారాన్నికూడా నేనే మొయ్యాలనా నీ ఉద్దేశ్యం.

ఏళ్ళతరబడి ఇద్దరిమధ్యా ఈ సంభాషణ ఇలా జరుగుతూనేవుంది. ఏమయినా సరే నారాయణకి ఏదోవిధాన పెళ్ళిచెయ్యాలని పార్వతమ్మగారు పట్టుపట్టింది. సుందరయ్యగారు తలవంచక తప్పలేదు.

* * *

'నారాయణా! గిరిజని చేసుకోవటం నీకు ఇష్టమేనా' అని శంకరం అడిగినప్పుడు నారాయణ ప్రపంచం అంతా తలక్రిందులైనట్టుగా ఆశ్చర్యంగా, అయోమయంగా చూశాడు స్నేహితుడివైపు. చాలసేపటికిగానీ మాటల్ని కూడదీసుకోలేకపోయాడు.

"నేనా? గిరిజనా? నీకేం మతిగానీ పోలేదుగదా?" అన్నాడు.

"అవును నువ్వే నీకు ఇష్టమో కాదో చెపితే మీవాళ్ళతో మాట్లాడతాను."

"చూడు శంకరం నవు నన్నెందుకు ఎంచుకున్నావో నాకు అర్థంకావటంలేదు. నా చిన్ననాటి స్నేహితుడివి. నీ దగ్గర నేను దాయగలిగిందేమీ లేదు."

"నిన్ను ఎన్నుకుంది నేనుగాదు, గిరిజే."

నారాయణ నమ్మలేనట్టు చూశాడు. కళ్ళు తళతళమెరిశాయి ఒక్క క్షణం.

"గిరిజకి నావిషయాలేమీ తెలియకపోతే నువు చెప్పెయ్యి" అన్నాడు చివరికి.

''తనకి నిన్నుమార్చగలశక్తి వుందనుకుంటుంది గిరిజ''ముభావంగాఅన్నాడు శంకరం. అతనికి అంతరాంతరాల్లో ఈ పెళ్ళి ఏమాత్రం ఇష్టంలేదు. నారాయణ శంకరంవైపు చూశాడు. అతని ముఖంలో గిరిజే కనిపించింది. అయినవాళ్ళందరు తనని వేరుగా, దూరంగా చూస్తున్న తరుణంలో మరోయువతి తనని కోరుకుంటూ, తన జీవితంలో ప్రవేశించాలనుకుంటుంది. ఎంత విచిత్రం. నారాయణ జీవితంలో ఎప్పుడూ ఎరగని అనుభూతి ఇది.

నారాయణకి, గిరిజకి పెళ్ళయిపోయింది. ఈ యేడుపేదో ముందరే ఏడువకూడదూ అనుకున్నారు లోకులు. 'తండ్రీ ఇప్పటికయినా వాడికి కుదురు నివ్వు' అంటూ తలిదండ్రులు మొక్కుకున్నారు. 'భగవాన్ నా చెల్లెలి జీవితం పచ్చగా నిత్యకళ్యాణంలాగా మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగిపోనీ' అంటూ వేడుకున్నాడు శంకరం.

నారాయణకి త్వరలోనే తను పెళ్ళిచేసుకుని ఎంత పొరపాటుచేశాడో తెలియసాగింది. గిరిజతో కొత్తజీవితం మధురంగానేవుంది కానీ దానితోపాటుగా మరికొన్ని సమస్యలుకూడా ఎదురయ్యాయి.

"మీరు ఏదోఒక ఉద్యోగం చూసుకోండి లేకపోతే నలుగురిలో చులకనయిపోతాం మిమ్మల్నిబట్టేగదా నాకు గౌరవం" అంది గిరిజ

ఇది జగమెరిగిన సత్యమే అయినా నారాయణకి మింగుడు పడని సమస్యే. మరొకళ్ళ కింద పనిచెయ్యటమనేదే నారాయణ తత్వానికి వ్యతిరేకం కొత్తభార్య మాటల్ని తీసివెయ్యలేక ఇదిగో అదిగో అంటూ గడుపుతూ వచ్చాడు. నారాయణకు మరో కొత్త బాధ తలకి చుట్టుకుంది. ఇదివరకు తెగినగాలిపటంలాగ ఎక్కడ తిరిగినా చీకూచింతా వుండేదిగాదు. ఇప్పుడు నారాయణ ఏ పని చేస్తున్నా గిరిజే మనసులో మెదులుతోంది. తనని కట్టుకుని గిరిజ అవమానాల పాలవుతోందేమోనన్న ఆవేదన సంపాదనలేని మొగుడి భార్య ధీమాగా తలెత్తుకుని నలుగురిలోనూ ఎలా తిరగ్గలదు! నారాయణకి తండ్రి కంట పడాలంటే ఇదివరకు లేని బెరుకు పట్టుకుంది శక్తి ఉడిగిపోయి ముసలిఎద్దులాగా సంసారాన్ని ఈడుస్తున్న తండ్రిమీద తన భార్య మరోభారం ఇంటికివస్తే ఏక్షణాన బయిటికి పోదామా అన్నట్టు ముళ్ళమీదున్నట్టుగా గడిపేవాడు. వీటన్నింటికి పరిష్కారం ఒకటే, తను చేతుల్నిండా డబ్బుసంపాదించాలి ఎలా? నారాయణ మునపటి అలవాట్లు మరికాస్త విస్తరించినాయి. పదిరాళ్ళు విసిరితే ఒకటయినా తగలకపోతుందా అన్న ఆశ ఎక్కువయిపోయింది.

నారాయణ తీరు మార్చుకోమని గిరిజ ఎంతగానో నచ్చచెప్పేది. బతిమాలేది కళ్ళనీళ్ళు పెట్టుకునేది. బెదిరించేది. నారాయణ అన్నిటికీ ఒకటే జవాబు చెప్పేవాడు

"కొద్దిరోజులు ఓపికపట్టు గిరిజా. నాజాతకంలో బ్రహ్మాండమయిన మార్పు రాబోతుంది. మహాలక్ష్మీ యోగం రాసిపెట్టివుంది నాకు అప్పుడు చూసుకో నా తడాఖా. నేనంటే లెఖచెయ్యనివాళ్ళే రేపు నాకాళ్ళు పట్టుకుంటారు. నిన్నూ, అమ్మనీ, నాన్ననీ అందర్నీ కింద నడవనిస్తాననుకున్నావా?"

"ఎప్పుడో పట్టబోయే యోగం సంగతి ఎందుకు? ఈరోజు జరగబోతున్న దాన్ని గురించి ఆలోచించండి. ఇంతకాలం మనిద్దరమే ఇప్పుడు మరో ప్రాణి మనమధ్యకి రాబోతోంది." నారాయణని మార్చాలన్న తన ప్రయత్నాలన్నీ వ్యర్థమయిపోయాయన్న విసుగు, విచారం, ముందురోజులు ఎలా వెడతాయో అన్న భయం గిరిజలోని సంతోషాన్ని హరించేస్తున్నాయి

నారాయణకి ఈ వార్త, సంతోషాన్ని కలిగించినా మరికాస్త భయాన్నికూడా వెంటతెచ్చింది. నారాయణ అతికష్టంమీద ఓ గేరేజీ యజమానికి సహాయంగా పనిచెయ్యటానికి ఒప్పుకున్నాడు ఈ వార్త విన్న గిరిజ సంతోషానికి అవధు ల్లేవు తల్లిదండ్రి 'వాడి చెడ్డరోజులు పోయినట్టున్నాయి కుదురు ఏర్పడు తోంది' అంటూ మురిసిపోయారు అందరి సంతోషం మూడునాళ్ళ ముచ్చటే అయింది. నెలరోజులు గడవకుండానే ఆ ఉద్యోగానికి గుడ్‌బై చెప్పేశాడు నారాయణ

శంకరం ఒకరోజు ఆఫీసునించి వస్తుంటే షావుకారు మాధవయ్య కనిపిం చాడు. "శంకరంగారూ! మీ బావమర్దిగారిని కాస్తంత త్వరగా బాకీ తీర్చమని చెప్పరూ డబ్బు అవసరంపడింది" అన్నాడు.

శంకరానికి విషయం అర్థంకాలేదు "బాకీ ఏమిటండీ?" అన్నాడు.

"నోటురాసి వెయ్యిరూపాయలు తీసుకున్నాడండీనారాయణగారు ఏడాదిదాటి పోయింది. ఇదిగో అదిగో అంటాడు. గట్టిగా అడిగితే వడ్డీ ఇస్తున్నాగాదుటయ్యా అంటాడండి అన్నీ బిగిసిపోయిన బేరాలే అవుతే మాకుమాత్రం చెయ్యేట్టా తిరుగుద్దండి" అన్నాడు మాదవయ్య.

"నువ్వు ఏ ఆధారం చూసుకుని నారాయణకి బాకీ పెట్టావయ్యా ఎలాతీర్చ గలడనుకున్నావు?" అన్నాడు శంకరం. అతనికి గిరిజ భవిష్యత్తు రోజురోజుకి అంధకారంలోకి జారిపోతున్నట్లుగ అనిపించసాగింది

"అలా అంటారేటండి మీరు, ఇల్లుందిగదండి. రెండెకరాలు పొలంవుంది గదు టండీ! పైగా సుందరయ్యగారు మాట తప్పని మనిషండి" అన్నాడు షావుకారు.

"ఇంటికీ పొలానికీ నారాయణ ఒక్కడే గాదయ్యా వారసుడు మరి ముగ్గురున్నారు. ఆ సంగతి తెల్సా?" శంకరం కోపంగానే అన్నాడు.

"అయన్నీ నే చూసుకుంటా లెండి మీకెందుకు. మీరు నారాయణతో బాకీ త్వరగా తీర్చమన్నానని చెప్తరూ." శంకరం మాటలువిని మాధవయ్యలో కంగారు పుట్టింది.

"మాధవయ్యగారూ! మీరు నాకో సహాయం చెయ్యగలరా?" అన్నాడు.

"చెప్పండి" అన్నాడు మాధవయ్య.

"ఇకముందు మీరుగానీ, మీకు తెలిసినవాళ్ళు గానీ నారాయణకి అప్పు ఇవ్వకుండా చూడండి. అదే మీరు చెయ్యగల పెద్ద ఉపకారం" అంటూ వెళ్ళి పోతున్న శంకరాన్ని చూసి 'బలేవోడే పంతులు' అంటూ సణుక్కున్నాడు మాధవయ్య.

శంకరం నారాయణ అప్పుల సంగతి గిరిజతో చెప్పాడు. "విన్నావా సంగతి ? ఇంకెన్ని అప్పులున్నాయో భగవంతుడికే తెలియాలి. నేనప్పుడే చెప్పాను కదామ్మా. ఈ మానవుడిని మార్చటం బ్రహ్మతరం కూడా కాదని. ఛీ, ఛీ మనిషయి పుట్టగానే సరా, బరువు బాధ్యతలు, పరువు ప్రతిష్ఠలు గుర్తించని మనిషి పశువుకంటే హీనం."

ఖిన్నురాలయి వింటున్న గిరిజని చూడగానే శంకరానికి దుఃఖం పొర్లుకొచ్చింది. దుఃఖంలో వున్న చెల్లెలిని అనునయించటానికి బదులు మరింత బాధ పెడుతున్నాడు మాటలతో. ఇందులో తన తప్పూ వుంది. నారాయణ ఎలాటి వాడో తెలిసి కూడా ఈ పెళ్ళి జరిపించటం తన బుద్ధితక్కువతనమూ, పొరపాటూ గాదూ; గిరిజకి గర్భిణీ స్త్రీలో వుండవలసిన సంతోషంగానీ,మెరుపు నిగారింపులు గానీ లేవు. మనిషి చిక్కింది. శంకరానికి చటుక్కున ఏదో అనుమానం వచ్చింది.

"అమ్మా గిరిజా! నీ గొలుసు వుందా మెళ్లో?" అన్నాడు మెల్లగా. గిరిజ పమిట కొంగుని మెడచుట్టూ కప్పుకుని వుంది. ఆ కళ్ళనుంచి రాలిన నీటి బిందువులే శంకరానికి సమాధానాన్ని చెప్పాయి. సంగతులన్నీ విన్న సుందరయ్యగారు కోపం పట్టలేక నారాయణని ఎడాపెడా చివాట్లుపెట్టి ఇంట్లోంచి బయటికి పొమ్మన్నారు. నారాయణ రోషంతో ఇంటికి రావటం మానేసి క్లబ్బులోనే మకాం పెట్టాడు. గిరిజ దుఃఖం, పార్వతమ్మగారి ఆవేదన చూడలేక శంకరం నచ్చచెప్పి నారాయణని ఇంటికి తీసుకువచ్చాడు. ఒక మనిషి బాధ్యతారహితమయిన ప్రవర్తన ఎంతమంది జీవితాల్లో నిప్పులు పోస్తుందో, నిరాశని నింపుతుందో, ఎన్ని సంసారాలు నరక సదృశంగా మారతాయో నారాయణని చూస్తే చాలు.

18

రాత్రి పన్నెండు గంటల వేళ నారాయణ క్లబ్బులోంచి బయటికి వచ్చాడు. క్లబ్బు బాయ్ రామం వెనకే వచ్చాడు 'బాబూ'అంటూ. ''బాబూ ఒక్క అయిదు రూపాయలుంటే ఇవ్వండి.' సంకోచిస్తూనే అడిగాడు.

"ఎందుకురా?" నారాయణ వాడివైపు చూస్తూ అడిగాడు. వాడు సిగ్గుపడ్డాడు జవాబు చెప్పటానికి. "ఏంలేదు బాబూ మరి మా ఆవిడ నీళ్ళోసుకుంది. తీపి తినాలనుందంట బాబూ" అంటూ నసిగాడు.



నారాయణ ఒక్క క్షణం వాడివైపు చూసి జేబులోంచి ఐదు రూపాయల కాగితాన్ని తీసి వాడికిచ్చాడు. వాడు ఓ నమస్కారం పెట్టి క్లబ్బు తలుపులన్నీ మూయ్యటానికి వెళ్ళిపోయాడు. నారాయణ నడిరోడ్డుమీద నిలబడిపోయాడు ఓ క్షణం.

అవును, గిరిజ కూడా తన బిడ్డకి తల్లి కాబోతోంది. తనకికూడా మనసులో ఏవేవో కోర్కెలు వుండే వుంటాయి. ఒక్కనాడూ నోరుతెరిచి తనసేదీ అడగ లేదు. తనయినా ఏ ఒక్కనాడూ ఏ చిన్నవస్తువయినా ప్రేమగా తీసుకువెళ్ళి గిరిజకి ఇవ్వలేదు. పాపం ఎన్ని ఆశలతో, కోర్కెలతో తనని వివాహం చేసుకుందో! ఇప్పుడందుకు విచారిస్తోందేమో! నిజానికి తనెందుకు నలుగురిలా జీవించలేకపోతున్నాడో నారాయణకే అర్థంకావటంలేదు.

జేబులో మిగిలిన ఆఖరి రూపాయినోటు చేతికి తగిలింది. గిరిజకి ఇష్టమయిన దేదయినా తీసుకువెళ్ళాలన్న కోరిక కలిగింది. రూపాయికి ఏం వస్తుందని!

నడుస్తుంటే సినిమాహాలు దగ్గర పూలదండల్ని అమ్ముతున్న పూలసాయేబు కనిపించాడు. గిరిజకి మల్లెపూలంటే ఎంతో ఇష్టం. నారాయణ రూపాయి ఇచ్చి వాడి దగ్గరున్న మల్లెదండలన్నిటినీ పొట్లం కట్టించి తీసుకున్నాడు.

ఇంటికి వచ్చిన నారాయణ పిల్లిలాగా నడుస్తూ తన గదిలో ప్రవేశించాడు. గిరిజ తన మంచంమీద పడుకుని నిద్రపోతోంది. లైటువేసి మెల్లగా దగ్గరగా వచ్చి తట్టి లేపబోయిన నారాయణ ఆ లైటు వెలుతురులో గిరిజ మొహం చూసి చటుక్కున ఆగిపోయాడు. గిరిజ చెంపలమీద కన్నీరు చారికలు కట్టివుంది.

విశాలమయిన కళ్ళకింద నల్లటి నీలి నీడలు. ఆ మొహంలో బాధ, ఆవేదన, దుఃఖం అన్నీ పెనవేసుకుని వున్నాయి. నారాయణ మనసు బాధతో, సిగ్గుతో ముడుచుకుపోయింది. చేతిలోని పూల పొట్లాన్ని గిరిజకు దగ్గరగా పెట్టి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు కిటికీలోంచి బయటి చీకటిలోకి చూస్తూ ఎంతసేపు అలా కూర్చున్నాడో నారాయణకే తెలియదు. డ్రాయరు తెరిచి డైరీ అందుకుని అందులో రాసుకున్నాడు. "అదృష్ట దేవతా నన్ను త్వరగా కరుణించు. నా వాళ్ళందరినీ ఎప్పటికి సుఖపెట్ట గలుగుతానో."

* * *

సత్యన్నారాయణ చాలా బిజీ మనిషి అయిపోయాడు. ఆతన్ని పట్టుకోవా లంటే గంటలతరబడి వేచి వుండాల్సి వస్తోంది. నారాయణ ఆ ప్రొద్దుటినించీ ప్రయత్నించి సాయంత్రం వేళకి సత్యన్నారాయణని కలుసుకోగలిగాడు. ఎప్పటిలాగే చిరునవ్వుతో ఆహ్వానించి చల్లటి గోల్డ్‌స్పాట్ తెప్పించి ఇచ్చాడు. కుశల ప్రశ్నలు అడిగాడు

నారాయణ ఎందుకో విచారంగా వున్నట్టుగమనించాడు సత్యన్నారాయణ. "సత్యంగారూ మీరు నాకో సహాయం చెయ్యాలండీ!" చివరకు ఎలాగో గొంతు పెగుల్చుకుని మెల్లగా అడిగాడు నారాయణ.

సత్యన్నారాయణ ఆశ్చర్యంగా వింతగా చూశాడు.

"నాకేదయినా వుద్యోగం ఇప్పించండి" అన్నాడు మళ్ళీ

"ఓ ఇ, ఇ ఇన్నాళ్ళకి మ్మమ్మ, మంచి బుద్ధి క క కలిగిందోయ్ నా న్నా నారాయణా" అంటూ నవ్వాడు సత్యన్నారాయణ

నారాయణకి ఆ క్షణంలో తను ఇంతవరకూ విడిచిపెట్టుకున్న అవకాశాలన్నీ గుర్తుకొచ్చి బాధ కలిగింది. తన ప్రవర్తనతో తండ్రికి ఎంత ఆవేదన కలిగించాడో తల్చుకుంటే సిగ్గువేసింది

"ఏ ఏ ఏ వుద్యోగం ఇ ఇప్పించమంటావు?" అంటూ నారాయణనే ఎదురు ప్రశ్నించాడు. నారాయణ మౌనంగా బట్టలకొట్లోకి వచ్చిపోతున్న జనం వైపూ లైట్ల వెలుగుకి తళతళా మెరుస్తున్న బట్టల తాములవైపూ చూస్తున్నాడు.

సత్యన్నారాయణ మాత్రం క్షణాల్లో ఏ వుద్యోగమని ఇప్పించగలడు! "త్వరగా చూపించండి చీరలు," అంటూ తొందరచేస్తున్న కస్టమర్స్‌ని, కొట్లోని రష్‌కి తట్టుకోలేకుండావున్న గుమాస్తాల్ని చూస్తున్న సత్యన్నారాయణకి ఒక ఆలోచన వచ్చింది.

"కా కాల్లో చేరిపో న్నా న్నారాయణా. మ మ మరో మంచి వుద్యోగం చూ చూసేవరకు" అన్నాడు.

నారాయణ ఆ మాటలు విని ఓసారి ట్యూబ్‌లైట్ల వెలుగుకి దేదీప్యమానంగా వెలిగిపోతున్న ఆ షాపునీ, జనాన్నీ పరిశీలనగా చూసి తల వంచుకున్నాడు. ఆఖరికి బట్టలు అమ్మే సేల్సుమన్‌గానా తన జీవితం నడవబోయేది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినట్లయింది. గిరిజ మొహం కళ్ళముందు మెదిలింది. రాత్రి నిద్రలో ఆ మొహంలో గమనించిన బాధను, దుఃఖాన్ని నారాయణని మారు మాట్లాడ నివ్వలేదు.

"రేపటినించి వస్తాను" అంటూ లేచి వచ్చేశాడు నారాయణ

19

నారాయణకి మొదట్లో ఆ వుద్యోగం సరదాగానే వుంది. వచ్చే పోయే రకరకాల జనం. రకరకాల మనస్తత్వాలు. కానీ ఆ తసేపు నిలబడి పనిచెయ్యా లంటే కాళ్ళు నొప్పి పెట్టసాగాయి. అయినా వోర్చుకున్నాడు నారాయణ. నారాయణ గాక మరో ముగ్గురు వున్నారు షాపులో. నారాయణ వాళ్ళదగ్గర నించి పనిలోని మెళుకువలన్నీ నేర్చుకున్నాడు.

సుందరయ్యగారికి కొడుకులోని ఈ మార్పు అర్థంగాలేదు. అంతకంటే ఎన్నో మంచి అవకాశాలు వదులుకుని ఆఖరికి 'సేల్స్‌మన్'గా ఎందుకు చేరినట్టో ఆయనకి ఆశ్చర్యం కలిగించినా ఏమీ లేనిదానికంటే ఏదో ఒకటి మేలేగదా అని సంతోషపడ్డాడు.

పార్వతమ్మగారు కొడుకు కలెక్టరు అయిపోయినట్టుగా సంతోషపడింది. "నే చెప్పలేదుటండీ, పెళ్ళిచేస్తే బాధ్యతలన్నీ మీదబడి వాడే మారతాడని. తండ్రి కాబోతున్నాడు. వాడికి మాత్రం బరువు బాధ్యతలు తెలియకుండా వుంటాయా?" అంటూ పొంగిపోయిందావిడ.

ఈ వార్త గిరిజకి సంతోషాన్నే కలిగించింది. భర్తలో మార్పు వస్తున్నం దుకు, ఈ మార్పు స్థిరం కావాలని మొక్కుకుంది దేముళ్ళకి.

నారాయణకి క్షణక్షణం ఆలోచనలతో పోరాడటమే సరిపోతుంది. తను కలలుగన్న జీవితం ఏమిటి? తను చేసే పనేమిటి? సత్యన్నారాయణ లాగా ఠీవిగా కార్లలో తిరుగుతూ, కౌంటరు దగ్గర దర్జాగా కూర్చుని అధార్టీ చెలా యించాలనుకున్నాడు. రెండుచేతులా డబ్బు సంపాదించాలనుకున్నాడు గానీ,

ఇలా పొద్దస్తమానం నిలబడి చేసే గుమాస్తా పనా తను కోరుకుంది. నారాయణకి తనమీద తనకి కోపం, తనవాళ్ళందరి మీద క్రోధం. ముఖ్యంగా గిరిజమీద. తనీ పెళ్ళి చేసుకోకుండా వుంటే ఎంత హాయిగా వుండేది! తను వాళ్ళ బాధని చూడలేడు. ఈ జీవితానికి అనుగుణంగా మారనూలేడు. ముందు నుయ్యి వెనుక గొయ్యిలాగా వుంది నారాయణ పరిస్థితి.

పళ్ళబిగువున నెలరోజులు గడిచినాయి. సత్యన్నారాయణ మిగిలినవాళ్లతో బాటుగా నారాయణకి కూడా వందరూపాయలు చేతిలో పెట్టాడు. ఆ నోటు చూడగానే నారాయణ ప్రాణం వుసూరుమంది. ఈ నోటుతో ఎన్ని అవసరాలు తీరతాయని? నెలరోజుల కష్టానికి ఇది ఫలితమా? హోటల్లోనే ముప్ఫయి రూపాయల వరకు ఇవ్వాలి. సిగరెట్ల బడ్డీలో పదిరూపాయలు ఇవ్వాలి. మరింకెన్నో ఖర్చులు. అన్నీ పోయి గిరిజకి ఇవ్వటానికి ఇందులో ఏం మిగులుతుందని.

నారాయణకి పిచ్చెత్తినట్టుగా వుంది. నెలరోజులుగా చలపతివాళ్లతో కలిసి తిరగటానికి వీలులేకుండా వుంది. ఈ నెల లాటరీ టిక్కెట్లు కొననేలేదు. నారాయణ ఏభై రూపాయలు తన దగ్గర వుంచుకుని మిగిలిన యాభై గిరిజ చేతికి ఇచ్చాడు, ఇంటికి వెళ్ళగానే. ఆ డబ్బు చూడగానే గిరిజ మొహం సంతోషంతో వెలిగిపోయింది. భర్త సంపాదనలో మొదటిసారిగా తన చేతికిచ్చిన డబ్బు అది. భక్తిగా కళ్ళకి అద్దుకుంది.

"అత్తయ్యకి ఇవ్వనా" అని అడిగింది నారాయణని.

"ఏదో చెయ్యి" అన్నాడు నారాయణ విసుగ్గా. భోజనంచేసి వెంటనే బయటికి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం ఒంటిగంటవేళ నారాయణ కొట్లో ఒక్కడే వున్నాడు. మిగిలిన వాళ్ళంతా భోజనాలకి వెళ్ళి ఇంకా తిరిగి రాలేదు. సత్యన్నారాయణ లేనప్పుడు కొట్టు అజమాయిషీ చేసే నీలకంఠం కేష్ దగ్గర కూర్చుని పెర్రీమేసన్ నవల చదువుతున్నాడు. షాపుముందు ఓ పెద్దకారు ఆగింది. సినిమా స్టార్లని మించిన మేకప్పులో వున్న ఓ లావుపాటి ఆవిడ మరో నలుగుర్ని వెంటేసుకొని వచ్చింది.

నీలకంఠం చదువుతున్న పుస్తకాన్ని మూసిపెట్టి వాళ్ళని మర్యాదగా ఆహ్వానించాడు.

ఆవిడ ఠీవిగా లోపలికి వచ్చింది. రకరకాల సినిమాలపేర్లు చెప్పి, ఆపేర్లున్న చీరలన్నీ చూపించమంది. నారాయణ ఒక్కటొక్కటితీసి ముందు పడేస్తున్నాడు.

ఆవిడ బృందం అంతా ఒకొక్క చీరే సుతారంగా ఇలాచూసి అలా పెట్టేస్తున్నారు జార్జెట్లు, షిఫాన్లు, పోలిస్టర్లు, వూలీలు, మరి వంద రకాలు గుట్టలు పడ్డాయి కౌంటరుమీద. అసలు వాళ్ళకి ఏవీ కొనే వుద్దేశ్యం లేనట్టుగా అర్థమయింది నారాయణకి.

"కంచి చీరలున్నాయా? తెల్లచీరకి ఎర్రబార్డరు, హంసలువున్న చీర కావాలి" అంది జీడిగింజలాంటి రంగున్న వాసంబద్దలాటావిడ.

నారాయణకి వొళ్ళు మండింది. అసలే చిరాగ్గా వున్నాడు

"ముందర ఇవి కానివ్వండి. అవి తరువాత చూద్దురుగాని" అన్నాడు కోపాన్ని అణిచిపెడుతూ.

"ఇవన్నీ పాతఫేషనయిపోయాయండీ. ఇంకేవన్నా కొత్తరకాలుంటే చూపించండి" అంది లావుపాటి మేకప్పావిడ

నారాయణ కోపం కట్టలు తెంచుకుని ప్రవహించింది.

"చాల్లేవమ్మా మహా కొన్నావు. లక్షరకాలు తీయించావు ఇవి నచ్చలేదుట. ఇహ కంచిచీరలు కొంటుందిట. వెళ్ళెళ్ళు, నీకు టైము గడవకపోతే ఏ మ్యాటినీకయినా పో. మా ప్రాణాలు తియ్యమాకు" అంటూ చకచకా చీరలన్నీ బీరువాల్లో సర్దెయ్యసాగాడు

నారాయణ విదిలింపులకి వచ్చినవాళ్ళు తెల్లబోయారు. ఆపైన అవమానంతో ఎర్రబడిపోయారు. కోపంతో మాడిపోయారు. లావుపాటి ఆవిడ చెప్పులు విరిగేట్టుగా నేలని బాదుతూ నీలకంఠం ముందుకి వెళ్ళి నిలబడింది. నీలకంఠం గంట నించి ఈ తమాషా అంతా గమనిస్తూనే వున్నాడు. అతనికి విసుగ్గానే ~~వుంది. కానీ వ్యాపారంతో ఇలాటి చికాకులెన్నో దాచుకోవాలి. కొంతమంది~~ తలతిక్కల్ని భరించాలి. ఓర్పు, సహనం లేందే వ్యాపారం సాగదు. వాళ్ళు కొనకపోయినా చిరునవ్వుతో అడిగినవన్నీ చూపించటమే వ్యాపార రహస్యం.

"ఏవండీ సత్యన్నారాయణ గారెక్కడ. మీ షాపుకి వచ్చేవాళ్ళని ఇలాగే ట్రీట్ చేస్తూ వుంటారా ? ఇంత ఇన్సల్ట్ చేస్తాడా ఆఫ్ట్రాల్ ఒక గుమస్తా ? సత్యన్నారాయణగారు రాగానే నాకు ఫోన్ చెయ్యమనండి. ఈ కుర్రాడిని తీసి పారేసేవరకు మీ షాపుకి ఎవ్వరూ రారని గుర్తుంచుకోండి" అంటూ ఆవిడ బృందాన్ని వెంటేసుకుని వెళ్ళిపోయింది ధుమధుమలాడుతూ. నీలకంఠం నెత్తీ నోరూ కొట్టుకున్నాడు. నారాయణని మందలించాడు. ఆవిడెవరో తెలియ చెప్పాడు. "ఆవిడ సత్యానికి చాలా దగ్గర మనిషయ్యా నారాయణా. నువ్విలా

మాట్లాడావని తెలిస్తే సత్యం అగ్గిమీద గుగ్గిలమైపోతాడు. ఇంత ఓర్పులేకపోతే నువ్వేం వుద్యోగం చేస్తావయ్యా". అంటూ చివాట్లేశాడు నారాయణని.

నారాయణకి అసహ్యం హద్దులు దాటిపోయింది. "సత్యన్నారాయణగారొచ్చాక చెప్పండి. నేను వుద్యోగం మానుకుంటున్నాను" అంటూ వెళ్ళిపోయాడు నారాయణ.

"వెధవ వుద్యోగం, ప్రాణాల్ని తీసింది. పీడా వదిలిపోయింది" అంటూ హాయిగా ఊపిరి పీల్చుకుని షాపు బయటపడిన నారాయణ, సరాసరి కాస్మోపాలిటన్ క్లబ్బుకేసి నడిచి వెళ్ళాడు.

20

సుందరయ్యగారు రిటైరయినారు. గిరిజకి ఆడపిల్ల కలిగింది. సుషమ అని పేరు పెట్టారు. శంకరం ముచ్చటపడి మేనకోడలికి సన్నటి బంగారు గొలుసు చేయించి ఇచ్చాడు. శారద పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. కొడుకు బెంగతో పార్వతమ్మగారి ఆరోగ్యం చెడింది. ఆవిడ మందు ఖర్చులు, ఇంటి ఖర్చులు గడపటమే కష్టంగా వుంది సుందరయ్యగారికి.

సుషమ గుక్కపట్టి ఏడుస్తుంటే పార్వతమ్మగారు మనుమరాలిని చేతిలోకి తీసుకున్నారు.

"గిరిజా, పాపకి పాలు కలిపి తీసుకురా" అంటూ కేక పెట్టారు. పది నిముషాలు, పావుగంట గడిచినా గిరిజ వస్తున్న జాడలేదు. పాప చేతుల్లో నిలవటంలేదు

శారద చేతిలోని పని వదిలి గదిలోకి వచ్చింది, 'గిరిజా' ఏం చేస్తోందో చూద్దామని.

గిరిజ ఖాళీ పాలపిండి డబ్బాని ఎదురుగా పెట్టుకుని బొమ్మలాగా కూర్చుని వుంది. ఆ మనిషిలో ప్రాణం వుంది అనడానికి సాక్ష్యం ఆ కళ్ళనించి అవిరళ ధారగా కారుతున్న కన్నీరు మాత్రమే. శారదకి క్షణంలో పరిస్థితి అర్థమయింది. దుఃఖం వచ్చింది. జాలేసింది. పాపకి పాలడబ్బా తెమ్మని ఎవరితో చెప్పుకుంటుంది ? సంపాదనలేకుండా, ఇల్లు పట్టకుండా తిరిగే భర్త తోనా, ఓపికున్నంతకాలం సంసారభారాన్ని లాక్కొచ్చి విశ్రాంతి తీసుకో వలసిన సమయంలో కూడా ముసలి ఎద్దులాగా అందరి భారాన్ని మీద వేసుకుని ఈడ్చుకొస్తున్న మావగారితోనా ?

శారద పక్కయింటివాళ్ళని అడిగి పాలు తెచ్చి పాపకి ఆకలి తీర్చి నిద్ర పుచ్చింది.

గిరిజ ఆ సాయంత్రం అన్నగారి దగ్గరికి వెళ్ళింది. శంకరం అప్పుడే ఆఫీసునుంచి తిరిగి వచ్చాడు. వంట ప్రయత్నం చేస్తున్నాడు.

శంకరానికి పిల్లనివ్వటానికి ఎంతమందో ముందుకి వచ్చారు. అయినా చెల్లెలి సంసారం చూశాక అతనికి వెంటనే పెళ్ళి చేసుకోబుద్ధి పుట్టటంలేదు. వచ్చినవాళ్ళందరిని ఏదో వంకన తిప్పి పంపేస్తున్నాడు.

వంట ప్రయత్నంలో ఉన్న అన్నగారిని చూడగానే గిరిజకి జాలి వేసింది. శంకరం చేతుల్లోంచి కూర తీసుకుని తను తరగటం మొదలుపెట్టింది.

"అన్నయ్యా! ఇప్పుడే చెబుతున్నాను. ఈసారి నువ్వు అవునన్నా సరే కాదన్నా సరే ఆ సోదెమ్మ మామ్మగారి మనవరాలి సంబంధం కుదిర్చేస్తాను. లేదంటావా నీకు నచ్చిన పిల్లని ఎవరో ఒకళ్ళని ఒప్పుకో. అంతేగానీ ఇంకా ఇలాగే అవస్త పడతానంటే ఒప్పుకోను" అంది తీవ్రంగా.

"గిరిజా! అంత పాపం చేశానుటే నేను. మామ్మగారి మనవరాలిని పెళ్ళాడమంటావా ? ఎందుకే అంత కోపం నామీద." జాలిగా అంటున్న శంకరాన్ని చూసి నవ్వేసింది.

ఆ వాడలో మామ్మగారి నోటికి ఎదురులేదు. ఆవిడ నోరు చూసే మనవరాలి సంబంధాలన్నీ తప్పిపోతున్నాయని అంతా వేళాకోళం చేస్తూవుంటారు.

"మరేవిటన్నయ్యా ఇలా ఎంతకాలం ?"

"గిరిజా! ఒక గొప్పకవి పెళ్ళిని గురించి ఏం చెప్పాడో తెలుసా ? అది తలుపులు మూసేసిన గదిలాటిదట. లోపలున్నవాళ్ళేమో బయటికి రావాలని చూస్తూ వుంటార్ట. బయటనున్నవాళ్ళేమో లోపలికి పోవాలని ఆత్రపడుతూ వుంటార్ట.''

"నిజమే అన్నయ్యా. ఎవరోగానీ చాలా బాగా చెప్పారు,'' అంది గిరిజ.

''పాపేది ?"

"శారద వొదిన దగ్గర వుంది."

"నారాయణ ఇంటికి వస్తున్నాడా అమ్మా ?"

పరధ్యాన్నంగా ఉన్న గిరిజ శంకరం ప్రశ్న వినిపించుకోలేదు.

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు ?"

"అన్నయ్యా !"

గిరిజ ఏదో చెప్పాలని, సంకోచిస్తోందని గ్రహించాడు. దగ్గరగా వచ్చి కూర్చున్నాడు. ''ఏమిటమ్మా గిరిజా !?"

"అన్నయ్యా! నా కేదయినా వుద్యోగం దొరుకుతుందేమో ప్రయత్నించ దలవా ?" గిరిజ మెల్లగా అంది.

శంకరం చెల్లెల్ని పరీక్షగా చూసాడు. గిరిజ తలవంచుకుని కూర తరుగుతోంది. ఆ ముఖంలో ఏ భావాలున్నాయో గమనించలేకపోయాడు.

"పసిబిడ్డతో నీకు ఇప్పుడు వుద్యోగం ఏమిటమ్మా ? ఇప్పుడు అంత అవసరం ఏం వచ్చిందని ?"

గిరిజకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఇంట్లో అవసరంగా వుంది అన్నయ్యా. పాపని అత్తయ్యా, వదినా చూసుకుంటారు" అంది మెల్లగా.

ఏదో జరిగిందని గ్రహించాడు శంకరం. బుజ్జగించి బతిమిలాడిన తరువాత గిరిజ ప్రొద్దుటి సంఘటనని గురించి చెప్పింది. అభిమానంతో, చెప్పలేనట్లుగా చెబుతున్న గిరిజని చూసి శంకరం మనసు బాధతో, జాలితో నిండిపోయింది. అంతలోనే చర్రున కోపం పైకి తన్నుకొచ్చింది.

"నే నా రోజునా చెప్పానా ? వాడు వుట్టి వెధవమ్మా ఆ మనిషి ఇంక మారడని. నా మాట విన్నావా ? సూక్తులు వల్లించావే ! ఏదీ నీ మంచితనం వాడిని ఏమన్నా మార్చగలిగిందా ? ఇప్పుడు బాధపడుతోంది ఎవరు ? నువ్వేనా? ఛీ ఛీ ఇంత బాధ్యత ఎరగని మనిషిని నే నెక్కడా చూడలేదమ్మా!

అసలు మనిషా పశువా అన్న అనుమానం వస్తోంది. అయితే నువు కూడా వాడిలాగానే తయారవుతావన్నమాట. నీ కో అన్నయ్య అనే వాడున్నాడని మర్చిపోయావామ్మా ? పసిబిడ్డకి పాలు లేకుండా చేస్తావా ? నే నంత పరాయివాడిని అయిపోయానా ?" శంకరానికి ఆపైన మాటలు పెగలక కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

అన్నగారి ఆవేదన, బాధ, ఆప్యాయత చూసి గిరిజ కళల్లో చివ్వున నీరు చిమ్మింది. తను ఏమాత్రం బాధపడినా శంకరం సహించలేడని తెలుసు గిరిజకి ఎన్ని బాధల్లో వున్నా గిరిజకి ఆ ప్రేమే కొండంత అండగా వుండి ధైర్యాన్నిస్తుంది.

గిరిజ తలెత్తి అన్నగారిని చూసి నవ్వింది. "నువు మాత్రం ఎన్నని ఇస్తావు ? ఎంత కాలం అని ఇస్తావు అన్నయ్యా ? నాకయినా ఇంట్లో తీరుబడిగానే వుంటుంది. నేను చెయ్యగల ఉద్యోగం ఏదయినా వుంటే చూసి పెట్టు."

శంకరం ఏదో ఆలోచిస్తూ మౌనంగా వుండిపోయాడు.

"మహిళా మండలిలో కొత్తగా పిల్లలకోసం, నర్సరీ స్కూలు ఒకటి పెడుతున్నారట అన్నయ్యా. దానికి ఓ టీచరు కావాలిట. నీకు తెలిసినవాళ్ళెవ రయినా వుంటే ప్రయత్నించు" అంది గిరిజ.

శంకరం "చూద్దాం" అంటూ లేచి బట్టలు వేసుకుని బయటికి వెళ్ళాడు. పది నిముషాల్లో రెండు పాలడబ్బాలు తీసుకుని తిరిగి వచ్చాడు. గిరిజకి ఇష్టమయిన జిలేబీ, మల్లెపువ్వులూ కూడా తీసుకువచ్చాడు.

అవి చూడగానే గిరిజకి అభిమానంతో కళ్ళలో నీరు తిరిగింది. "నిన్ను ఇవన్నీ తెమ్మని నీతో నా సోదంతా చెప్పుకుంటున్నాననుకుంటున్నావా ?" అంది కోపంగా.

గిరిజ అభిమానపడి చిన్నపుచ్చుకుందని శంకరానికి తెలుసు. ప్రేమగా చెల్లెల్ని దగ్గరగా తీసుకున్నాడు. "చూడు, మామ్మ పోయేముందు ఏం చెప్పిందో గుర్తుందా. నువు తప్ప నా కీ ప్రపంచంలో ఎవరూలేరని చెప్పిందా లేదా ? నువు కూడా నన్ను దూరం చేసేస్తావామ్మా గిరిజా !"

కన్నీటిని ఆపుకోవటం గిరిజ వశం కాలేకపోయింది. శంకరం ఆ కన్నీళ్ళని చేత్తో తుడిచాడు.

"ఎన్ని కష్టాల్లోనయినా మనిషిని ముందుకు నడిపేది భవిష్యత్తుమీది ఆశ

ఒకటేనమ్మా. ధైర్యం కోల్పోయిన రోజున మనకి మిగిలేది ఏదీ వుండదమ్మా గిరిజా." శంకరం పొట్లం విప్పి జిలేబీ గిరిజ నోటికి అందించాడు.

"ఇప్పుడు వద్దన్నయ్యా. తినాలని లేదు."

"అరే గిరిజే! జిలేబీ వద్దనటమే !? ఏది నీ మొహం ఇటు చూపించు. అసలు నువు మా గిరిజవేనా ?"

అన్నగారి ఆశ్చర్యానికి నవ్వొచ్చింది గిరిజకి. జిలేబీ అందుకుని నోట్లో పెట్టుకుంది.

"అదీ. నువు మా గిరిజవే" అంటూ చెల్లెలికి మరో జిలేబీ చుట్టని అందించాడు. గిరిజని ఇంటివరకు దింపి, సుషమని ముద్దాడి సుందరయ్యగారితో కాసేపు కబుర్లాడి తిరిగి వెళ్లాడు శంకరం.

21

గిరిజ పదిరోజుల్నించి మహిళా మండలిలో వుద్యోగానికి వెడుతోంది.

గిరిజ మొదటగా ఈ వార్త నారాయణ చెవిన వేసినప్పుడు ఉలిక్కిపడ్డాడు.

"నువ్వా ? ఉద్యోగమా ? ఎక్కడ ?" అంటూ ఆశ్చర్యంగా అడిగాడు.

గిరిజ వివరాలు చెప్పింది. అయిష్టంగా మారిన నారాయణ ముఖకవళికలు గమనించనట్టే వుండిపోయింది.

"ఇప్పుడు అంత అవసరం ఏమిటి గిరిజా ?" అన్నాడు చివరికి.

గిరిజ సూటిగా అతని కళ్ళలోకి చూసింది నారాయణ ఆ చూపుని ఎదుర్కోలేకపోయాడు. సుషమని ఎత్తుకునే నెపంతో పక్కకి తిరిగాడు.

"అవసరమా ? ఎందుకులేదు. పెద్దవాళ్ళం మనిద్దరికి ఎలాగయినా గడిచి పోతుంది. కాని పాప ఇంకా పసిదిగదా. దానికి అవసరాలేవో వుంటూ వుంటాయి. మరి అవి తీరేదెలా ?"

గిరిజ గొంతు సౌమ్యంగానే వున్నా ఆ గొంతులోని నిష్ఠురత, బాధ, నిర్లిప్తత ధ్వనించిన తీరుకి నారాయణ తల వంగిపోయింది. వెంటనే చర్రున కోపం వచ్చింది. నారాయణ పెళ్ళయిన దగ్గరనుంచి ఇలాటి నిస్సహాయ స్థితిని అనేకసార్లు ఎదుర్కోవలసి వస్తూనేవుంది. ఆ అన్నా, చెల్లెళ్ళ ఎదురుగా తనెప్పుడూ దోషిలాగా నిలబడుతున్నట్టే అనిపిస్తుంది నారాయణకి. అది తన అంతరాత్మ పడే పశ్చాత్తాపమే అని గ్రహించలేదు. తననిలా ఇరకాటంలో పెడుతున్న గిరిజని చూస్తే వెంటనే కోపం చర్రున లేస్తుంది. సూటిగా నిర్మలంగా చూసే గిరిజ చూపుని ఎదుర్కోగానే, నువ్వీ కోపానికి కూడా

అనర్హుడివి అన్నట్టుగా కోపం మాయమయిపోతుంది. నిస్సహాయంగా తలవంచుకోవటం తప్ప మరేమీ చెయ్యలేకపోతాడు. ఇప్పుడూ అలాగే జరిగింది. సుషమని కింద దింపి బయటికి వెళ్ళిపోయాడు.

గిరిజ మెల్లగా కొత్త ఉద్యోగానికి అలవాటు పడుతోంది. గిరిజతోపాటుగా మరో టీచరు కూడా వుంది. ఇద్దరూ చెరొక క్లాసుని చూస్తూ వుంటారు. మహిళామండలి ఆవరణలో రెండు రేకుషెడ్ల లాటివి వేశారు. వాటిలోనే క్లాసులు జరుగుతూ వుంటాయి. దుర్గాదేవి మహిళామండలికి సెక్రటరీ. కుట్లు, అల్లికలు, మిషను కుట్టటం అన్నీ నేర్పుతారక్కడ. అవి నేర్పే టీచర్లున్నారు విడిగా. మండలి ఎకౌంట్సూ, రాతకోతలూ అన్నీ చూడటానికి వెంకటప్పయ్య గారిని ఏర్పాటుచేశారు. ఆయన మండలి ప్రెసిడెంటుకి ఏదో దూరపు బంధువు. ఏభై యేళ్ళ వయసుంటుంది. పెద్దవాడని అందరూ గౌరవంగా ఉంటారు ఆయనతో. అందరితో చనువుగా మాట్లాడుతూ వుంటాడు.

"వచ్చావామ్మా గిరిజా! ఏదీ నీ ఫ్రెండు రాలేదా ఇంకా ?" అంటూ ఎదురొస్తాడు వీధిలోకే. గిరిజతో పాటుగా పనిచేస్తున్న మరో టీచరు సుధ.

"టయిమయింది గదా వస్తూ వుంటుంది" అంటుంది గిరిజ. తను క్లాసులోకి వెళ్ళి కూర్చుంటుంది. పిల్లలు ఒకొక్కరే వస్తుంటారు.

వెంకటప్పయ్య ఆఫీసు గదిలోకి వెళ్ళిపోతాడు పని చూసుకోవటానికి. ఆ గదిలోంచి రెండు రేకు షెడ్లు స్పష్టంగా కన్పిస్తూవుంటాయి. గిరిజ వారం రోజులయేసరికి గ్రహించింది. టేబుల్ దగ్గర కూర్చున్న వెంకటప్పయ్య చూపులన్నీ రేకుషెడ్లమీదే వుంటాయని. వెంకటప్పయ్యని చూస్తే అకారణంగానే గిరిజకి భయం వెయ్యటం మొదలయింది. ఆయన చూపులు శరీరాన్నంతా పట్టి తడిమి చూస్తున్నట్టుగా వుంటాయి. ఆ చూపుల్లో లేకితనం వున్నట్టు కనిపిస్తుంది. గిరిజ ఎప్పుడు దృష్టి తిప్పి చూసినా వెంకటప్పయ్య ఇటే చూస్తూ కనిపించసాగాడు.

గిరిజ వుండబట్టలేక మెల్లగా సుధతో అన్నది ఒకరోజున. "అబ్బ ఏమిటి ఆ ముసలాయన మరీ అలా గుడ్లు మిటకరించుకుని చూస్తాడేమిటి ?" అంది.

సుధ నవ్వింది. "నువ్వూ గమనించావన్నమాట. ఆయన దృష్టి ఎప్పుడూ మనమీదే వుంటుంది. చూశావా" అంది సుధ.

"అవును. గమనిస్తూనే వున్నాను" అంది గిరిజ.

"మన్నే కాదులే. ఏ ఆడది కనపడ్డా అలాగే చూస్తూ వుంటాడు చూపుల్తో

తినేసేట్టుగా. మన కుట్టు టీచరుందా. ఆవిడకి దాదాపు ఏభై య్యేళ్ళవరకు వుంటాయా ? ఆవిడనీ అలాగే చూస్తాడు. అదో జబ్బల్లే వుంది" అంది సుధ.

గిరిజ అసంతృప్తిగా మొహం చిట్లించుకుంది.

"అంతేకాదు. ఆయనకి మరో జబ్బుకూడా వుంది" అంది సుధ.

గిరిజ కుతూహలంగా చూసింది.

"ఆడవాళ్ళు దగ్గరగా వస్తే ఏదో ఒక వంకన వాళ్ళని తాకి, బ్రహ్మానందం అనుభవిస్తూ వుంటాడుట ముసలి వెధవ" అంది సుధ ఏహ్యతగా.

గిరిజకి భయం మరింత అధికమయింది.

"ఓసారి ఇలాగే పెన్ను తీసుకునే నెపంతో సీత చెయ్యి పుచ్చుకుని గట్టిగా నొక్కాడట. బలంగా ఒక్క నెట్టు నెట్టిందట చేతితో. పాపం వెళ్ళి పది గజాల అవతల పడ్డాడట. సీత చెప్పింది నాతో." అంది పకపక నవ్వుతూ సుధ.

గిరిజ వెంకటప్పయ్య దరిదాపుల్లోకి వెళ్ళేదికాదు సాధ్యమయినంత వరకు. ఆయన ఏమయినా అడిగినా దూరంనించే సమాధానం చెప్పేది. ఇంత వయసు వచ్చిన పెద్దమనిషి! ఇదేం గుణం అనుకుంటూ విస్తుపోయేది.

"అసలు ఇలాటివాళ్ళని నలుగురు ఆడవాళ్ళు తిరిగేచోట వెయ్యకూడదు సుధా. అందరం కలిసి చెప్తే ఈయన్ని తీసెయ్యరా ?" అంది గిరిజ ఓసారి.

సుధ నవ్వింది. "ఈయన ఇంకా నయం గిరిజా. వుట్టి చూపులతోనే వెదరగొడుతూ వుంటాడు. బయట ప్రపంచంలో వెంకటప్పయ్యని మించిన దుర్మార్గులు ఎందరో వుంటారు. మనం అనుక్షణం మన జాగ్రత్తలో వుండవలసిందే" అంది సుధ.

గిరిజకి రోజులు యాంత్రికంగా గడిచిపోతున్నాయి. నెలలు గడుస్తున్నకొద్దీ సుషమ కొత్త కొత్త ఆటలు, మాటలు నేర్చుకుంటుంది.

22

ఎసెంబ్లీ ఎలక్షన్లు జరుగుతున్నాయి రాష్ట్రమంతటా. సత్యన్నారాయణ ఎమ్.ఎల్.ఎ.గా ఆ నియోజకవర్గంనుంచి నిలబడి పోటీ చేస్తున్నాడు. వూరంతా ఎన్నికల సంరంభం, కోలాహలం, సభలు, ఉపన్యాసాలు. నారాయణ తీరుబడిలేకుండా తిరుగుతున్నాడు. కొన్ని వందలమంది సత్యన్నారాయణ తరఫున పనిచేస్తున్నారు. ఎన్నికలు జరగనూ జరిగాయి. ఫలితాలూ తెలిశాయి. సత్యన్నారాయణ చిత్తుగా ఓడిపోయాడు. సత్యన్నారాయణ ఈ ఎన్నికల కోసరమే దాదాపు లక్షా ఏభై వేలు పైగా ఖర్చు

పెట్టాడు. ఫలితాలు తెలిసిన రోజున సత్యన్నారాయణ కూర్చున్న చోటునించి అరగంటదాకా కదల్లేకపోయాట్ట. చుట్టూ చేరిన ఆశ్రితజనం సత్యన్నారాయణకి హార్ట్ ఎటాక్‌గానీ వచ్చిందేమోనని ఖంగారుపడిపోయారట. కానీ చివరికి సత్యన్నారాయణే లేచి అందర్నీ సాగనంపాడట. సానుభూతి చూపబోయినవాళ్ళ మీద కేకలేసి మరీ సాగనంపాడట!

పదేళ్ళ క్రితం సత్యన్నారాయణని అదృష్టలక్ష్మి వరించిన తరువాత కలిగిన మొట్టమొదటి అపజయం ఇది. ఈ షాకుకి సత్యన్నారాయణ తట్టుకోలేడనే చాలా మంది భావించారు. సత్యన్నారాయణ యథాప్రకారం పూలరంగడిలాగా తిరుగుతూంటే ఆశ్చర్యంతో విస్తుపోయినవాళ్ళే ఎక్కువ.

నారాయణకి బాకీలుపెట్టిన ఇద్దరు పెద్దమనుషులు డబ్బుకోసం వత్తిడిచేయ సాగారు. నారాయణ అదుగో ఇదిగో అంటూ వాళ్ళని తిప్పటంతో, ఆ ఇద్దరూ నారాయణ రాసిచ్చిన ప్రోనోటు కాగితాలు పుచ్చుకుని తిన్నగా సుందరయ్య గారిదగ్గరకే వచ్చారు. ఏవిధంగానయినాసరే ఆ బాకీలు చెల్లువేయించమని కోరారు. సుందరయ్యగారు నిమిత్తమాత్రంగా చూస్తూ వూరుకున్నారు. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడటమేగదా!

సుందరయ్యగారు మరో ఎకరం పొలం అమ్మి వాళ్ళ బాకీలు తీర్చి పంపిం చేశారు. ఆయనకి నారాయణ ఎప్పటికయినా స్థిరత్వం సంపాదించుకుని ఈ సంసారభారాన్ని భుజాలకి ఎత్తుకోగలడు అన్న నమ్మకం పూర్తిగా పోయింది. వయోభారానికితోడు మానసికమయిన దిగులు క్రుంగదీయసాగింది. జీవితంలో అన్నివిధాలా ఓడిపోయిన వ్యక్తిలాగా రోజులు లెక్కపెడుతున్నట్టుగా కాలం గడపసాగారు.

పార్వతమ్మగారి ఆరోగ్యం అంతంతమాత్రంగానే వుంది. మందులు లేకుండా ఆవిడకి రోజు జరగదు. నారాయణ దిగులుతో బాటుగా శారద జీవితం ఎలా గడవనున్నదో అని మరో వ్యధ.

సుషమ పనులన్నీ పూర్తిచేసి ఇంట్లో శారదకి సహాయంగా వుంటూ ఉద్యో గానికి పరిగెత్తే గిరిజని చూస్తే ఇద్దరికీ చెప్పలేని దిగులు, జాలి.

"మీరు చెప్పింది నిజమేనండీ. ఆనాడు మీ మాట వినకుండా పెళ్ళిచేస్తే నన్నా దారిలో పడతాడని నిక్షేపంలాటి పిల్లని తీసుకొచ్చి వీడికి అంటగట్టాం. ఆ పిల్ల మొహాన ఏం రాసుందో తలుచుకుంటే గుండెలు పగిలిపోతున్నాయి" అంటూ దుఃఖపడతారు పార్వతమ్మగారు.

"అంతా ఖర్మ పార్వతీ. నీకు బుద్ధిలేదనుకో! నా బుద్ధిమాత్రం ఏమయి పోయిందని? ఆ పెళ్ళికి నేను ఒప్పుకోకుండావుంటే ఈ రోజు ఆ పిల్లకి యిన్ని కష్టాలే వుండేవి కావుగదా" అంటూ తనని తనే నిందించుకుంటారాయన.

23

నారాయణ ఆ రోజు చాలా హుషారుగా వచ్చాడు ఇంటికి. ఏనాడూ పోగొట్టు కోవటం తప్ప పొందలేని నారాయణ దురదృష్టం ఎదురు తిరిగినట్టుంది. మూడు వందలు గెల్చుకుని వచ్చాడు. జేబులోవున్న ఆ నోట్లు మనసుకి ఎంతో బలాన్ని, హుషారుని ఇస్తున్నాయి. సుషమకి మంచి గౌను కొన్నాడు. గిరిజకి గులాబి రంగు జార్జెట్ చీర కొన్నాడు. గోపికి, రమకి బొమ్మలు, పూలు, జిలేబీలు కొని హుషారుగా ఇంటికి వచ్చాడు.

గదిలో సుషమని ఆడిస్తోంది గిరిజ. నారాయణ ఆ పేకెట్లన్నీ గిరిజ ఎదురుగా పెట్టి అటు తిరిగి షర్టుమార్చుకోసాగాడు. అయినా ఓరకంటితో గిరిజని చూస్తూనే వున్నాడు.

గిరిజ ఓసారి నారాయణవైపు, పేకెట్లవైపు మార్చి మార్చి చూసి తనకేం పట్టనట్టుగా సుషమతో ఖబుర్లు చెప్పటంలో మునిగిపోయింది. నారాయణకి కోపం తన్నుకొచ్చింది

"సుషమా" అంటూ కూతుర్ని చేతుల్లోకి తీసుకున్నాడు. తండ్రి పిలుపు వినగానే సుషమ కేరింతలు కొడుతూ మీదకి దూకింది. నారాయణ కూతుర్ని వొళ్ళో కూచోపెట్టుకుని పేకెట్ తెరిచి కొత్తగౌనుతీసి సుషమకి తొడగసాగాడు. అప్పటికి గిరిజ ఏమీ మాట్లాడలేదు. చేతిలోవున్న పుస్తకాన్ని తిప్పుతూ కూర్చుంది. నారాయణకి చిర్రెత్తు కొచ్చింది.

"సుషమా నీ గౌను అమ్మకి చూపించు" అంటూ సుషమని గిరిజ వొళ్ళో కూర్చోపెట్టాడు.

గిరిజ సుషమని కింద కూర్చోపెడుతూ 'భోజనానికి రండి' అంటూ లేచి లోపలికి వెళ్ళబోయింది.

నారాయణకి గిరిజ చెంప పగలగొట్టాలన్నంత కోపం వచ్చింది.

'ఇలారా' అన్నాడు. గిరిజ వచ్చి ఎదురుగా నిలబడి కళ్ళతోనే ఏమిటి అన్నట్టుగా చూసింది.

నారాయణ చీరవున్న పేకెట్ తీసి గిరిజ చేతికి ఇస్తూ "నీకు రంగు నచ్చిం దేమో చూడు" అన్నాడు.

గిరిజ చీర బయటికితీసి ఓసారి చూసి పేకెట్‌లో పెట్టి పేకెట్‌ని మంచంమీద వుంచింది.

'బావుందా?' అన్నాడు గిరిజ మొహాన్నిచూస్తూ.

'బావుంది' అంది.

నారాయణకి మితిమీరిన కోపంతో ఏంచెయ్యాలో పాలుపోలేదు. గిరిజతో ఏదోవిధంగా పోట్లాట పెట్టుకుని తిట్టి కసి తీర్చుకోవాలని వుంది. కానీ గిరిజ అందుకు సందీయటంలేదు.

"ఇదుగో ఇందులో జిలేబీలు వున్నాయి. నీకు ఇష్టంకదూ" అన్నాడు గొంతులోకి మార్దవం తెచ్చుకుంటూ.

గిరిజ తలెత్తి చూడకుండానే సుషమకి నారాయణ తొడిగిన గౌను విప్పి, మామూలుగౌను తొడగసాగింది.

నారాయణకి వొళ్ళంతా కారం రాచుకున్నట్టయింది. అయినా తమాయించు కుంటూ "ఇవిగో ఇవి గోపీకి, రమకి ఇవ్వు" అంటూ రెండు పేకెట్లు అందించాడు.

గిరిజ వాటిని ఓ చేత్తో అందుకుని రెండోచేత్తో మంచంమీద పెట్టింది. కనీసం వాటివయిపు తిరిగయినా చూడలేదు. నారాయణకి ఈ ముభావం,

నిర్లక్ష్యం భరింప శక్యంకాలేదు. ఒక్కసారిగా మండిపడ్డాడు. "అసలు నేను ఇంటికి రావటం నీకు ఇష్టంలేదన్నట్లేవుందే" అన్నాడు.

గిరిజ ఆశ్చర్యంగా చూసింది. "మీ యింటికి మిమ్మల్ని రావద్దనటానికి నేనెవర్ని" అంది.

"అంటే ఇది నేను,నాయిల్లు తప్ప నువ్వు నాకేమీ అవ్వవన్నమాట! అంతేనా?" పేకెట్లని దూరంగా ఎగరకొడుతూ అన్నాడు.

"అరే, మీకు ఇంకా ఆ సంగతి గుర్తుందన్నమాట!" ఆశ్చర్యంగా అంటున్న గిరిజ చేతిని పుచ్చుకుని గుంజి ఎదురుగా వచ్చి నిలబడి "అంటే నీ ఉద్దేశ్యం?" రౌద్రంగా పళ్ళుబిగబట్టి అన్నాడు.

"అంటే మీకొక ఇల్లు, భార్య పిల్లలు, తల్లి దండ్రి వున్నారని..."

గిరిజ మాటలు పూర్తి కాకుండానే ఛెళ్ళున చెంపమీద కొట్టాడు.

"అంటే నేను బాధ్యతలేకుండా తిరుగుతున్నాననేగా అర్థం?"

గిరిజ చెంపపట్టుకునే నారాయణవైపు చూసి మెల్లగా నవ్వింది. ఒక్కసారిగా నారాయణ కోపం అంతా చల్లబడిపోయింది. నారాయణ ఆ చూపుని ఎదుర్కోలేదు.

"మీ కోసం నేను ఇన్ని కొని తీసుకువస్తే ఒక్క మంచిమాట మాట్లాడవేం?" పశ్చాత్తాపాన్ని కనబడనీయకుండా విసుగ్గా అన్నాడు.

"ఇది పేకాటలో గెల్చిన డబ్బా లేకపోతే రేసుల్లోనా?" ఇంతసేపటికి గిరిజ నోటినుంచి వచ్చిన మాటలు కొరడాదెబ్బల్లాగా తగిలాయి నారాయణకి.

చల్లబడుతున్న ఆవేశం మళ్ళీ పొంగుకొచ్చింది.

"ఏం. అదయితే డబ్బుకాదా?" మీద మీదకి వస్తూ అడిగాడు కోపంగా.

"ఏమీలేదు. ఆ డబ్బుని నమ్ముకుని మాకిలాటివి అలవాటుచేస్తే మీకే నష్టం అని" గిరిజ విసిరిన మాటల్లోని అర్థం బోధపడి తిరి, చూసేసరికి గిరిజ అక్కడలేదు. సుషమని ఎత్తుకుని వంటగదిలోకి వెళ్ళిపోయింది.

నారాయణ శరీరంలోని సత్తువంతా ఎవరో లాగిపారేసినట్టుగా మంచంమీద చేరబడి కళ్ళుమూసుకున్నాడు.

24

వసుంధరాదేవి అసహనంగా,కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా తిరుగుతోంది.ఆవిడ అన్నగారు రాజ్యానికి వేరే సంబంధాలు చూస్తున్నాడన్న వార్త ఆవిడకి తెలియ వచ్చింది. కోపంతో ఉక్కిరిబిక్కిరయింది. యువరాజులాటి తన కొడుకు

ఎదురుగా వుండగా, మేనల్లుడన్న రక్తసంబంధంకూడా లేకుండా అన్నగారు కూతురికి వేరేసంబంధాలు చూడటం ఆవిడకి చెప్పలేనంత అవమానంగావుంది. రాజ్యంతోబాటుగా ఆ పిల్లవెనక రాబోయే ఆస్తిమీద చెప్పలేనంత ఆశా, మోజూ వున్నాయి. అన్నీ బాగానే వున్నాయి కానీ ఈ చలపతి వెధవ ఇన్నాళ్ళుగా ఏం ఏడుస్తున్నట్టు. వేలకి వేలు పట్టుకుపోయి రాజ్యంవాళ్ళింటికి అంటూ వారానికో సారి పరిగెడుతూ వుంటాడుగదా! ఒక్క ఆడపిల్ల మనసుని గెల్చుకోలేక పోయాడా? ఛీ ఛీ తన కడుపున ఇంత చాతకాని వెధవ పుడతాడని ఆవిడ ఏనాడూ ఊహించలేదు.

"నేనోసారి మా అన్నయ్య వాళ్ళింటికి వెళ్లొస్తాను" అన్న భార్యని రాజేశ్వర్రావు ఆశ్చర్యంగా చూశాడు.

"అదేం! హఠాత్తుగా అన్నగారిమీద బెంగపెట్టుకున్నావా?" అన్నాడు. ఆవిడ అసలుకారణాన్ని ఆయనకి చెప్పదల్చుకోలేదు. చలపతి అంటే భర్తకి ఏమాత్రం సదభిప్రాయం లేదని ఆవిడకి తెలుసు.

భర్త తనని, కొడుకుని హేళనగా ఏదయినా అంటే ఆవిడ భరించలేదు. అందుకే తను చలపతి పెళ్ళి గురించి ఏదోఒకటి అన్నగారితో తేల్చుకునేవరకు భర్తతో చెప్పకూడదని నిశ్చయించుకుంది.

రాజేశ్వర్రావు ఆవిడ అడిగినంత డబ్బు ఇచ్చాడు. వసుంధరాదేవి అన్నగారింటికి వచ్చింది. నరసింహంగారు చెల్లెల్నిచూసి సంతోషించాడు.

"ఏవిటమ్మా వసుంధరా? అంతా బాగున్నారా? చలపతి రాలేదా?" అన్నారు.

"చలపతి ఇక్కడికే వచ్చాడుగా అన్నయ్యా? ఇంట్లో బయలుదేరి నాలుగు రోజులయిందే" అంది వసుంధర ఆశ్చర్యంగా.

నరసింహంగారు నవ్వారు. "వాడికి పెద్దస్నేహాలెన్నో వున్నాయమ్మా. ఇక్కడికి ఎందుకు వస్తాడు?" అన్నారు.

వసుంధర మనసు చివుక్కుమంది.

సావకాశం చూసుకుని వసుంధర రాజ్యం పెళ్ళివిషయం కదిపింది.

"రాజ్యం పెళ్ళివిషయం ఏం ఆలోచిస్తున్నావన్నయ్యా?" అంది.

"అదేనమ్మా, నేనూ ఆ ప్రయత్నంలోనే వున్నాను. రెండు మూడు సంబంధాలు దృష్టిలో వున్నాయి. దానికి ఈ యేటితో కాలేజీ చదువు అయిపోతుంది. ఏదోఒకటి సెటిల్ చేసేద్దామనేవుంది" అన్నారాయన నిర్మొహమాటంగా.

తనామాట ఎత్తినప్పుడుకూడా చలపతి ఆయన దృష్టిలోకి రానందుకు వసుంధరకి కోపం, అవమానం ముంచుకొచ్చాయి. అవసరం తనది కనుక కోపాన్ని నిగ్రహించుకుంది.

"చలపతికికూడా ఈ యేడు పెళ్ళి చేసేద్దాం అనుకుంటున్నాం అన్నయ్యా" అంది వసుంధర.

"వాడికా? అప్పుడే తొందరేవిటమ్మా. అయినా వాడి పద్ధతి అదీ నాకేం నచ్చటంలేదమ్మా వసూ. బావగారు గట్టిగా కేకలువేసి వాడిని కాస్త కుదురు నేర్చుకునేట్టుగా చెయ్య రెందుకని?" అన్నారాయన.

ఈ సంభాషణ అంతా రాజ్యం వింటూనే వుంది.

"అత్తయ్యా, అసలు బావ ఎప్పుడుచూసినా ఆ రేస్‌కోర్సు దగ్గరే వుంటూ వుంటాడు. నలుగురు ఫ్రెండ్సుని వెంటేసుకొచ్చి హోటల్ అగస్త్యాలో దిగుతాట్ట. బలే జల్సాచేస్తాట్ట. నాన్నగారు మొన్నోరోజున బావని బాగా కేకలేసారు. నీకు ఉత్తరం రాస్తాననికూడా బెదిరించారు. వద్దంటూ బ్రతిమిలాడుకున్నాడు" అంది రాజ్యం.

వసుంధరాదేవికి తను కొడుకుచుట్టూ నిర్మించుకున్న ఒకొక్కసౌధమే కూలిపోతున్నట్టుగా గాబరాగావుంది. ఆ తండ్రీ కూతుళ్ళ మనసుల్లో కంచు కాగడావేసి వెతికినా చలపతి అంటే కించిత్తు సదభిప్రాయం వున్నట్టుగాలేదు. పైగా కొడుకుని గురించి తనకి తెలియని ఎన్నో నిజాలు వినటానికి చేదుగా వున్నాయి ఆవిడకి. కొడుకుమీద కోపం ఉవ్వెత్తున ముంచుకొస్తోంది. అయినా ఆవిడ తన ప్రయత్నం విరమించకుండా అంది.

"మేమూ అదే అనుకుంటున్నాం అన్నయ్యా. ఆ మూడుముళ్లూ పడితేగానీ వాడికి కుదురు కలిగేట్టుగా లేదు. మీ బావగారుకూడా అదే అన్నారు రాజ్యానికి చలపతికి ఈడూ జోడు బాగుంటుందని." చిట్టచివరికి ఆవిడ మనసులోనిమాట బయటపెట్టేసింది.

"మాకుమాత్రం వాడొక్కడేగదా. ఉన్నదంతా వాడికేనయ్యో."

ఈ మాటలకి నరసింహంగారయితే వెంటనే జవాబు చెప్పలేదుగానీ రాజ్యం టక్కున సమాధానం చెప్పేసింది.

"చలపతినా ? నేనా ? పెళ్ళా ?" ఏదో వింత విషయాన్ని వింటున్నట్టుగా ఆశ్చర్యపోయింది.

వసుంధరాదేవికి కోపం నిగ్రహించుకోవటం అసంభవం అయింది.

"ఏమే ? వాడికేమయింది?" ఇలా అన్నవాళ్ళే రేపు ఒకళ్ళని విడిచి ఒకళ్ళు క్షణంకూడా వుండరు." అందావిడ.

"ఆ విషయాలన్నీ నాకు తెలియవుగానీ, నేనుమాత్రం చలపతిని చేసుకోవటం అసంభవం" అంటూ తెగేసి చెప్పింది రాజ్యం.

"ఆ, ఎందుకని?"

"నేను డాక్టరు వృత్తిలో వున్నవాళ్ళని పెళ్ళిచేసుకోవాలనుకుంటున్నాను అత్తయ్యా. నాకా ప్రొఫెషన్ అంటే ఎంతో ఇష్టం. నేనెలాగూ డాక్టర్ని కాలేకపోయాను. కనీసం ఓ గొప్ప డాక్టర్నయినా పెళ్ళిచేసుకోవాలనుంది'' అంది రాజ్యం.

వసుధరాదేవికి మొట్టమొదటిసారిగా రాజ్యంమీద, ఆ పిల్ల అలా తన అభిప్రాయాన్ని జంకూగొంకూ లేకుండా తెగేసి చెప్పేంతటిస్వేచ్ఛా స్వాతంత్ర్యాలనిచ్చి పెంచిన అన్నగారిమీద, చలపతి మాయమాటల్లో చిక్కుకుపోయిన తన అసమర్థతమీద, తనవి మొదటినుంచీ హెచ్చరిస్తూ వచ్చిన భర్త తెలివితేటలమీద-ఒకటనేమిటి ఈ ప్రపంచంలో వున్న చరాచర వస్తుజాలం అంతటిమీద అంతులేని కోపం, కక్ష, కలిగినాయి.

నరసింహంగారికి తన నోటితో లేదు అని చెప్పకుండా ఆదుకున్న కూతురిమీద మరింత వాత్సల్యం ఉప్పొంగింది.

"అదమ్మా వసూ దానిఅభిప్రాయం.ఈరోజుల్లో వయసొచ్చి అన్నీఆలోచించగలిగిన పిల్లలకి వ్యతిరేకంగా మనం చెయ్యగలిగిందేముంది? రమణయ్యగారి రెండోవాడు శ్రీనివాసు గుర్తుందా? ఆ కుర్రాడు కార్డియాలజీలో స్పెషలైజ్ చేశాట్ట. వచ్చేనెలలో ఇండియా తిరిగి వస్తున్నాట్ట. రాగానే రాజ్యాన్ని చూసుకోవటానికి రమ్మని చెప్పొచ్చాను వాళ్ళకి" అన్నారాయన.

వసుంధరకి ఇంక ఒక్క క్షణం అక్కడ వుండాలనిపించలేదు. తిరుగుబండికి ఇంటికి చేరుకుంది. ఇప్పుడు ఆవిడకోపం అంతా కొడుకుమీద కేంద్రీకరించబడింది. చలపతికళ్ళబడగానే ఎడా, పెడా రెండు లెంపలు వాయించాలన్నంత ఆవేశంగా వుంది. చలపతి నాటకాల్ని కట్టుజేసే ఆయుధం ఆవిడ చేతిలోనే వుంది.

చరచరా రాజేశ్వర్రావు వున్న గదిలోకి వెళ్ళింది."ఇదిగో ఇప్పుడే చెప్తున్నా. ఈ రోజునుంచి నాకు తెలియకుండా చలంగాడికి ఒక్క కానీ అయినా దక్కనిచ్చావో, నేనసలు మంచిదాన్నిగాదు. గుర్తుపెట్టుకోండి" అంది రంకెలేస్తున్నట్టుగా

ఉరుము లేని పిడుగులా వినవచ్చిన ఆ మాటల్ని, భార్య కోపాన్ని చూసి రాజేశ్వర్రావుగారు విస్తుపోయి తేరుకునే లోపలే ఆవిడ ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. అప్పుడే ఇంటికి చేరుకున్న చలపతి రౌద్రమూర్తిలావున్న తల్లి జారీచేసిన ఆర్డరు విని గుండెలాగిపోయినట్టుగా నిలబడిపోయాడు "ఏమిటి మమ్మీ అంత కోపంగా వున్నావు? ఏం జరిగింది" అంటూ తల్లిని ప్రసన్నురాలిని చేసుకో వాలని ప్రయత్నిస్తున్న కొడుకుని ఒక్క చూపులోనే అంత దూరాన నిలబెట్టే సింది వసుంధరాదేవి!

"ఏం జరిగిందని అడుగుతున్నావా? చేతకాని వాజమ్మా. ఒక్క ఆడపిల్ల మనసుని ఆకట్టుకోలేకపోయావు. పైగా నాటకాలాడతావా నాదగ్గిర" అంటున్న తల్లిని చూసి చలపతి నీరుకారిపోయాడు. ఇంక ఆ యింట్లో తనకి ప్రైసాదబ్బనేది కూడా దొరకదన్నది రూఢి అయిపోయింది చలపతికి దిగాలుపడి కూర్చుండి పోయాడు 'కిం కర్తవ్యం' అనుకుంటూ.

25

ఒకానొకరోజు సత్యన్నారాయణ అదృష్టవార్త వూరంతా ఎలా గప్పుమందో, సరిగా పదేళ్ళ తరువాత అలాగే మరో వార్త వూరంతా క్షణాల్లో వ్యాపించింది. సత్యన్నారాయణ దివాళాతీశాడట! ఏ ఇద్దరు కలిసినా ఇదే విషయం. ఏ షాపులో చూసినా, ఏ బజార్లలో చూసినా ఇదే చర్చ!

సత్యన్నారాయణ టింబరు డిపో అప్పుకింద బావమరది కొట్టేసుకున్నాడట! 'సత్యన్నారాయణ సిల్కు ప్యాలెస్' మీద పెట్టుబడికి మించిన అప్పుందిట. గజలక్ష్మీసదన్ ఏనాడో తనఖాలోకి వెళ్ళిపోయిందిట! ఇలాటి పరిస్థితుల్లో ఐ. పి. దాఖలు చేస్తే మంచిదని పెద్దలు సలహా చెబుతున్నారట సత్యన్నారాయణకి.

"నేనారోజే అనుకున్నా లేవయ్యా. ఎలా వచ్చిన ధనలక్ష్మి అలాగే పోయింది" అన్నారొకరు.

"మరి అంత మిడిసిపాటుటయ్యా. ఎలక్షన్లలోనే పోగొట్టుకున్నాడు గాదుటయ్యా సగం ఆస్తి" అంటూ మరొకరు.

"ఈ వ్యసనాలున్న వాళ్ళకి లక్షలు గాదు కోట్లున్నా చివరికి ఇదేగతి పడుతుందండి అది రూలే" అన్నారింకొకరూ.

"ఏం వెలుగు వెలిగాడయ్యా పదేళ్ల. ఆ తల్లి గోలపెడుతూనే వుండేదయ్యా వున్నది జాగ్రత్తచేసుకోమని. ఈ సత్తెంగాడు వింటేనా?"

"అదంతేనండి. గాలివాలుగా వొచ్చిన అదృష్టం, గాలివాలుకే ఎగిరి పోయింది."

సత్యన్నారాయణ అదృష్ట, దురదృష్టాలమీద కామెంటు చెయ్యని మనిషి లేడు ఆ వూరిలో.

ఒకవిధంగా నారాయణ జీవితాన్ని ప్రేరేపించినవాడు పరోక్షంగా సత్యన్నారాయణే! అతన్ని హఠాత్తుగా వరించిన అదృష్టం నారాయణ కలలో ఆలంబనం అయింది. సత్యన్నారాయణ నడిచిన దారిని అనుసరించాలని ప్రయత్నించి అడుగడుగునా ఎదురుదెబ్బలే తిన్నాడు. జీవితంలో ఎంతో ముఖ్యమైన సమయాన్ని అదృష్టదేవత వేటలో ఖర్చుచేశాడు. ఆ సమయంలో ఎవరేది చెప్పినా నారాయణకి చెవికెక్కలేదు. తలలో దూరలేదు. అవన్నీ పెద్దలు చెప్పే చాదస్తాలుగా కొట్టిపారేశాడు గడ్డిపోచకింద తీసిపారేశాడు. ఈనాడు నారాయణ కావాలన్నా ఉద్యోగం ఇచ్చే నాథుడులేడు. కొన్ని ఉద్యోగాలకి వయసు మీరి పోయింది, మరికొన్ని అందని మాని పండ్లు. మరికొన్నిటికి అనుభవం చాల్లేదు. అంచెలంచెలుగా పైకి పాకి ఒక్కసారిగా కిందికి జారిపోయిన సత్యన్నారాయణ జీవితం నారాయణకి కనువిప్పులాగానే వుంది.

సత్యన్నారాయణ కిప్పుడు కార్లులేవు. ఆశ్రితజనాలు, వందిమాగధ బృందాలు లేవు, సిల్కుప్యాలెస్‌లు, టింబరు డిపోలు లేవు. చివరికి మిగిలింది తాళ్ళకొట్టు మాత్రమే. పిచ్చయ్య కూర్చునే స్థానంలో సత్యన్నారాయణ కూర్చుంటున్నాడు. సత్యన్నారాయణ భార్య కొడుకుని తీసుకుని అన్నగారింటికి వెళ్ళిందిట. తల్లి తండ్రులిద్దరూ సత్యన్నారాయణ దురదృష్టాన్ని చూడకుండానే పైలోకాలకి వెళ్ళి పోయారు. చివరికి మిగిలింది పాత పెంకుటిల్లు, తాళ్ళకొట్టు. అవయినా పిచ్చయ్య పేరున రాయబట్టి.

సత్యన్నారాయణ తనకి ఆరులక్షలు వచ్చినాయన్న రోజున ఎలావున్నాడో ఇప్పుడూ అలాగే వున్నాడు. మనిషిలో వున్నదంతా పోయిందే అన్న దుఃఖం, దిగులు లేవు. పైగా జీవితాన్ని సంపూర్తిగా అనుభవించి అందులోని లోతు పాతులన్నీ తెలిసిన పెద్దమనిషిలాగా సంతృప్తిగా, నిండుగా వున్నాడు

నారాయణ తాళ్ళకొట్లో కూర్చున్న సత్యన్నారాయణ దగ్గరికి వచ్చాడు. సత్యన్నారాయణని చూసి ఆశ్చర్యపోయాడు. ఏవో ఓదార్పు మాటలు, సానుభూతి పదాలు వల్లెవెయ్యటం తనకే సిగ్గనిపించింది నారాయణకి.

సత్యన్నారాయణ నారాయణని ఎప్పటిలానే ఆహ్వానించాడు చిరునవ్వుతో. 'బా బ్బా బాగున్నావా న్నా న్నా నారాయణ?' అంటూ పలకరించాడు.

"ఏ ఏ ఏంటలా చూస్తున్నావు? గీ గీ గీతలో ఏం చె చె చెప్పారు? క క కష్టం సు సు సుఖం అన్నీ ఆడికే" అంటూ చేతులు పైకి పెట్టి నమస్కారం చేశాడు. నారాయణకి నవ్వొచ్చింది.

'సత్యంగారూ, నాకేదయినా ఉద్యోగం చూపెట్టండి' అన్నాడు మెల్లగా. సత్యన్నారాయణ నవ్వి నారాయణ భుజంమీద తట్టి చేతిలో బిడాణీలు పోశాడు.

26

మానవ మనస్తత్వం అతి విచిత్రమయింది. నయానో, భయానో, హితోక్తులతోనో మార్చాలని ఎంత ప్రయత్నించినా మారని మనసు, మీట నొక్కినట్లుగా ఏ చిన్న సంఘటనతోనో మార్పు దానంతట అదే వస్తుంది. సత్యన్నారాయణ జీవితం నారాయణమీద అలాటి ప్రభావాన్నే చూపించింది. పైగా నారాయణకి గిరిజని ఎదుర్కొనటం పెద్ద సమస్యగా వుంది. గిరిజ తన చుట్టూ నిర్మించుకున్న పరిధిలోకి నారాయణ ప్రవేశించ లేకుండా వున్నాడు. సూటిగా, గుండెల్ని తాకుతున్నట్టుగా చూసే ఆ చూపులు నారాయణ అడుగు ముందుకి పడనివ్వవు. ఆ చూపులకి నారాయణ తల వొంగిపోతుంది ఎన్నో చెప్పాలనుకున్న నారాయణ మాటలు గిరిజ ముఖం చూసి నోటిలోనే ఆగిపోతాయి. ఆ నిర్లిప్తత గిరిజ దూరంలో నిలబెడుతూ వుంటుంది. అంతకంటె గిరిజ నోరుతెరిచి తిట్టి, పోట్లాడి నానా రభస చేసినా బాగుండును అనుకుంటాడు.

నారాయణ పట్ల గిరిజ ప్రవర్తన ఎప్పటిలానే వుంది. శ్రద్ధగా, సమయానికి నారాయణ అవసరాలన్నీ గమనించి సమకూరుస్తుంది. అయినా గిరిజ చుట్టూ ఏదో మాయతెర కమ్ముకున్నట్టుగా నారాయణ అంత దూరంలోనే ఆగిపోతాడు. అది తన మనసులోని పొరేనని అర్థంచేసుకోలేదు.

క్లబ్బుకి వెళ్ళినా మనసుపెట్టి ఆడలేకపోతున్నాడు. తనకి తెలియకుండానే చలపతికి దూరంగా జరిగిపోతున్నాడు. ఏ పని చేస్తున్నా మనసులో ఏదో ఆందోళన, అశాంతి. ఏదో చెయ్యాలన్న ఆరాటం మనిషిని నిలవనీయటంలేదు. తనని చుట్టుకున్న బాధ్యతలు నెరవేర్చలేని ప్రతివ్యక్తి పడే ఆరాటమే నారాయణదీను. తెలిసినవాళ్ళని ఉద్యోగంకోసరం ప్రాధేయపడుతున్నాడు. ఆశ వుందనిపించిన చోటికల్లా పదిమార్లు తిరుగుతున్నాడు. తన కాళ్ళమీద తను నిలబడగలిగినప్పుడే ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం అన్న సత్యాన్ని ఆలస్యంగానయినా గ్రహించగలిగాడు నారాయణ.

* * * *



చలపతి పరిస్థితి చెరువులోంచి బయటపడిన చేపలాగా వుంది. ఇంతకాలం కొండంత అండగావున్న తల్లి శత్రుపక్షంలో జేరిపోవటంతో చలపతి పని ఇరకాటంలో పడింది. రెండుచేతులా ఖర్చుపెట్టటానికి అలవాటుపడిన చలపతి రూపాయి డబ్బుల కోసరం వెతుక్కోవటం నరక సదృశంగా వుంది. వూపిరి అందనట్లు గిలగిల్లాడి పోతున్నాడు. కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు. ఆరు నెలలుగా క్లబ్బు బిల్లులన్నీ బాకీపెడుతూ వచ్చాడు.

ఓ శుభ ముహూర్తాన క్లబ్బు మేనేజరు అతి మర్యాదగా ఆ బిల్లులన్నీ చలపతి ముందు పెట్టి, మీరింక మర్యాదగా అవి చెల్లించిన తరువాతే క్లబ్బుకొస్తే మంచిదని సూచించాడు.

చలపతి అవమానంతో దహించుకుపోయాడు ఆవేశంతో కసిగా సిగరెట్టు కాల్చుదామన్న జేబులు ఖాళీగా వున్నాయి. వాడుకగా సిగరెట్టుకొనే బడ్డీ దగ్గరికి వచ్చి సిగరెట్ పాకెట్‌కి ఆర్డరిచ్చాడు.

'మీ బ్రాండు లేవుసార్' అన్నాడు బడ్డీకొట్టువాడు, వున్నాయో లేవో చూడ కుండానే. అలమార్లో వెనకాల వున్నాయని చలపతికీ తెలుసు. వాడికీ తెలుసు. వాడుకూడా తనకి మరింక అరువు పెట్టడని రూఢి అయింది.

'సార్ మీ ఖాతా వందరూపాయలు దాటిపోయింది సార్' అంటూ చేతులు నులుముకోసాగాడు బడ్డీకొట్టువాడు.

'అలాగే రేపిస్తాను' అన్నాడు చలపతి.

వాడితో ఘర్షణపడి తన పరువు మరింత బజారుపాలు చేసుకోవటం తనకే నష్టం అని గ్రహించాడు.

చలపతికి మరింక డబ్బు పుట్టే మార్గం కనిపించటంలేదు. తెలిసిన స్నేహితులందరి దగ్గరా చెయ్యగలిగినంత వరకూ అప్పు తీసుకున్నాడు. రెండు చేతులా ఖర్చుపెట్టే చలపతి అడగగానే వెంటనే చేబదుళ్ళిచ్చిన స్నేహితులే, రోజులు గడుస్తున్నకొలది చలపతి పరిస్థితి అర్థం అవసాగింది. ఒక్కొక్కరే చలపతిని తప్పించుకుని తిరగసాగారు. చలపతి కోపంతో పళ్ళు నూరుకోవడం తప్ప మరేమీ చెయ్యలేకపోయాడు.

చలపతికి ఒక్కటే మార్గం మిగిలింది. తల్లి కాళ్ళు పుచ్చుకుని క్షమించమనటం ఒక్కటే దారి.

"మమ్మీ! ఒక్క వెయ్యి రూపాయలు కావాలి మమ్మీ లేకపోతే నా పరువు నిలవదు" అంటూ ప్రాధేయపడ్డాడు.

"నీకో పరువు అంటూ వుండే గదురా పోయేందుకు" అంది తల్లి. చలపతికి కోపం చర్రున దూసుకొచ్చింది.

"నలుగురిలో నాకు అవమానం జరిగితే మీకు జరిగినట్టు గాదా?" అంటూ సవాల్ చేశాడు.

"ఎందుకాకూడదురా! ఇప్పుడు జరిగింది అదేగదా. రేపు ఆరోతారీఖున రాజ్యం పెళ్ళట," అంది కోపంగా వసుంధరాదేవి.

"రాజ్యం కాతపోతే మరో భోజ్యం. దేశంలో ఆడపిల్లలే కరువయినట్టుగా బాధపడతావేమిటి మమ్మీ?" అన్నాడు చిరాగ్గా.

"ఆడపిల్లలకేం లోటురా. దేశంనిండా వాళ్ళే కాని వాళ్ళందరి వెనకా రాజ్యానికున్న సిరి సంపదలు వుండవురా నాయనా" అంది వ్యంగ్యంగా.

"ఇంతకి ఇస్తావా? ఇవ్వవా?" అన్నాడు చలపతి.

"ఎందుకు ఇవ్వను. పద నాన్నగారితో చెప్పి ఇప్పిస్తాను" అంటూ కొడుకుని రాజేశ్వర్రావు దగ్గరకి తీసుకొచ్చింది.

"చలానికి వెయ్యి రూపాయలు కావాలట ఇస్తారా?" అంది.

ఆయన ఓ క్షణం కొడుకుని పరిశీలించి "ఓ ఎందుకివ్వను!" అన్నాడు.

చలపతి మొహం లక్ష దళ పద్మంలాగా వికసించింది.

"కానీ ఓ షరతుమీద మాత్రమే" అన్నాడాయన.

చలపతి ఆత్రంగా విన్నాడు:

"రేపటినుంచి నువు మిల్లులో పనిచెయ్యాలి," అన్నాడు.

"ఓ."

"అదీ కూలిపనితో ప్రారంభించాలి. ఒక్కొక్క విభాగంలో ఒక్కొక్క నెలపాటు మిగిలినవాళ్ళతో పాటుగా పనిచెయ్యాలి. వాళ్ళకి ఎంత జీతం గిట్టుబాటు అవుతుందో నీకూ అంతే దొరుకుతుంది. మన మిల్లులో కూలీలకి రోజుకి ఆరు రూపాయలు ఇస్తున్నాం. ఇదుగో ఆరు రూపాయలు. ఇవాళనించి పని ప్రారంభించు" అంటూ ఆయన ఆరు రూపాయల్ని చలపతి ముందుకి గిరాటు వేశాడు.

చలపతి నోట మాట రానట్టుగా నిలబడిపోయాడు. బేలగా తల్లివైపు చూశాడు సహాయం కోసరం అన్నట్టుగా. ఆవిడ తల తిప్పుకొని లోపలికి వెళ్ళిపోయింది. చలపతికి కోపం కట్టలు తెంచుకుని ప్రవహించింది. గిర్రున వెనక్కి తిరిగి బయటికి వెళ్ళిపోయాడు.

27

మహిళామండలి వార్షికోత్సవం ఘనంగా జరుపుతున్నారు. కుట్లు, అల్లికలు, పెయింటింగ్స్ వున్న ప్రదర్శనం కనుల పండువుగా వుంది. మండలిమెంబర్సు అందరూకలిసి హాస్యనాటకాన్ని ప్రదర్శించబోతున్నారు. భరతనాట్య ప్రదర్శన వుంది మండలి స్కూలులోని చిన్నపిల్లల పాటలు, డాన్సులు వున్నాయి. మరింకెన్నో రకరకాల ఆకర్షణలున్నాయి.

గిరిజకి నెలరోజులుగా తీరిక వుంటడంలేదు. చిన్నపిల్లలకి పాటలు, డాన్సులు నేర్పించే బాధ్యత గిరిజ, సుధలది.

ఆ రోజే వార్షికోత్సవం. మండలి ఆవరణ కన్నుల పండువగా లైట్లతో, తోరణాలతో అలంకరించారు. స్టేజీ ఏర్పాటయింది. ఆవరణ అంతా కుర్చీలతో నిండిపోయింది. కలెక్టరుగారి సతీమణి అధ్యక్షత వహిస్తోంది. కార్యక్రమం ప్రారంభమయింది.

రెండో అయిటంగా పిల్లల డాన్సు. స్టేజిమీద చిన్న చిన్న పిల్లలందరినీ సర్ది వరసగా నిలబెట్టి గిరిజ, సుధ పక్కకి తప్పుకున్నారు. తెర తీయబడింది. పిల్లలు ఏదో ఇంగ్లీషు పాటకి అనుగుణంగా డాన్సు చేస్తున్నారు. ఒకే రకం

దుస్తుల్లో, ఒకే రకం అలంకరణలో ముద్దగులాబీల్లా వున్న పిల్లలు, పాటకి చేసే అభినయం చూడముచ్చటగా వుంది. సుధ, గిరిజ కర్టెన్ల చాటున నిలబడి పిల్లల్ని గమనిస్తున్నారు.

పిల్లలు ముచ్చటగా ఆడుతుంటే గిరిజకి తృప్తిగా వుంది, తను పడిన శ్రమ వృధాపోనందుకు. తన్మయంగా చూస్తున్న గిరిజ ఉలిక్కిపడింది. భయంతో కెవ్వుమని అరవబోయింది. రెండు చేతులు గిరిజని వెనకనించి వాటేసుకుని పొట్టని తడుముతూ పైపైకి పాకుతున్నాయి. వణికిపోతూ తిరిగి చూసిన గిరిజకి వెనకాలే వెంకటప్పయ్య వెకిలినవ్వు నవ్వుతూ కనిపించాడు. "డాన్సు బాగుందమ్మా గిరిజా" అంటున్నాడు. గిరిజ వొంటిమీద వేంకొద్దీ తాచు పాములు జరజరా పాకినట్లు వొళ్ళంతా అసహ్యం, భయంతో నిండిపోయింది. తన పొట్టని తడుముతున్న ఆ చేతుల్ని గబుక్కున లాగి విసిరికొట్టింది.

"యూ, యూ, స్టుపిడ్" రొప్పుతో, ఆయాసంతో గిరిజకి నోట్లోంచి మాటలు రావటంలేదు. గిరిజ కళ్ళు భగభగ మండుతున్నాయి. కోపం, రోషం, బాధ అన్నీ పెనవేసుకుని మహాప్రవాహంలాగా పొంగుకొస్తున్నాయి.

గిరిజ విసురుగా తోసిన తోపుకి వెంకటప్పయ్య తూలి కర్టెనుమీద పడ్డాడు.

"అయ్యయ్యో పెద్దముండావాడిని. కళ్ళు కనిపించటంలేదు తల్లీ. కాస్త వుంటే కింద పడిపోయేవాడిని" అంటూ స్టేజి పక్కనించి దిగి జనంలోకి పోయి కూర్చున్నాడు.

గిరిజ వొణికిపోతూ అలాగే నిలబడిపోయింది. అసహ్యంతో వొళ్ళు జలదరిస్తోంది.

పిల్లల డాన్సు పూర్తయింది. తెర వాలింది. ఆవరణ అంతా చప్పట్లతో నిండిపోయింది. సుధ గిరిజ దగ్గరగా వచ్చింది.

"గిరిజా ఈ పిల్లమేళం మన పరువు నిలబెట్టేరు. బాగానే చేశారు కదూ" అంటూ గిరిజని చూసి ఆశ్చర్యపోయింది.

పాలిపోయినట్టుగా వున్న గిరిజ కళ్ళనించి నీళ్ళు కారుతున్నాయి. కలలో వున్న మనిషిలాగా అదిరే పెదవులతో వెంకటప్పయ్య వెళ్ళినవైపే చూస్తోంది.

"గిరిజా! ఏమయింది? అలా వున్నావేం?" ఆత్రంగా గిరిజ భుజాన్ని కుదిపింది సుధ.

గిరిజ కల్లోంచి మేల్కొన్నదానిలా, కొత్తవ్యక్తిని చూస్తున్నట్టుగా చూసింది సుధని. సుధని చేతుల్తో చుట్టి బావురుమంది.

సుధ కంగారుపడిపోయింది. చేత్తో చుట్టి గిరిజని స్టేజి వెనగ్గా తీసుకు వెళ్ళింది. గిరిజ దుఃఖానికి కారణం తెలియక కంగారుపడిపోతోంది సుధ. ఐదు నిముషాల క్రితం వరకు హాయిగా వున్న గిరిజకి అంతలోనే ఏం జరిగిందో అర్థంకాలేదు.

"అరే ఏవిటిది. ఎందుకు ? గిరిజా ! ఏం జరిగింది ? ఏదయినా బాధగా వుందా ?"

గిరిజకి అవమానంతో నోట మాట రావటంలేదు. జవాబు చెప్పటానికి నోరు పెగలటంలేదు. జవాబు చెప్పకపోతే సుధ వదిలేట్టుగా లేదు.

"ఏంలేదు" అన్నట్టుగా తలూపి కళ్ళు తుడుచుకుంది.

"ఏమిటి ఏమయినా బాధగా వుందా ?"

గిరిజ తలాడించింది.

"పద లోపల రూమ్‌లో కూర్చుందువుగాని కాసేపు" అంది.

"ఉహు ఇంటికి వెడతాను సుధా." గొంతు పెగుల్చుకుని ఎలాగో అంది గిరిజ.

"అదేం ? ప్రోగ్రాం చూడవూ ?"

"ఉహు వెళ్ళిపోతాను."

సుధకి గిరిజ వాలకం అర్థంకాలేదు. మరేం తర్కించకుండా జనాన్ని తప్పించుకుంటూ వీధిలోకి వచ్చారు.

సుధ ఆగివున్న రిక్షాని పిలిచింది.

"నేనుకూడా తోడు రానా ?" అంది.

"వద్దు. నేను వెళ్ళిపోతాను" అంది కళ్ళు వొత్తుకుంటూ.

కనుమరుగవుతున్న రిక్షాని చూస్తూ నిలబడిన సుధ, ఆవరణ అంతా మరో మారు చప్పట్లతో మారుమ్రోగటంతో, ఉలిక్కిపడి లోపలకు నడిచింది.

28

తిరిగి తిరిగి అలిసిపోయి వస్తున్న నారాయణని సత్యన్నారాయణ పిలిచి ఓ శుభవార్త వినిపించాడు. ఛిట్‌ఫండ్ కంపెనీలో పనిచేసే ఒకతను మరణించటం వల్ల అతని స్థానంలో పనిచెయ్యటానికి మరో మనిషి కావాలట.

"ను, నువ్వు జేరగూడదూ, నాన్నా నారాయణా"' అన్నాడు సత్యన్నారాయణ.

నారాయణకి ఆ కబురు వింటూనే ప్రాణం లేచివచ్చినట్టుగా వుంది.

"తప్పకుండానండి సత్యంగారూ. వివరాలు చెప్పండి" అన్నాడు ఆత్రంగా.

సత్యన్నారాయణ చెప్పిన వివరాలు విని నీరుగారిపోయాడు. చనిపోయినతను కేష్‌ని డీల్ చేస్తూ వుండేవాడుట. సెక్యూరిటీగా వెయ్యి రూపాయలు కట్టిన వారికే ఆ పని దొరుకుతుందిట.

నారాయణ సంతోషంమీద నీళ్ళు చల్లినట్లుగా అయింది. వెయ్యి రూపాయలు తనకిచ్చే దాతలెవరు ? నారాయణ మనసులో ఒక్కొక్కరినే తిరగేస్తున్నాడు, తనకి సహాయం చెయ్యగలిగిన వాళ్ళెవరయినా వున్నారేమోనని.

తండ్రి నిస్సహాయుడని తనకి తెలుసు. ఓ క్షణం శంకరాన్ని అడుగుదామా అనిపించింది. మరెక్కడయినా ప్రయత్నించి అయినా శంకరం సహాయం చెయ్యగలడేమో అన్న ఆలోచన మరుక్షణంలోనే తోసిపారేశాడు. నారాయణకి రోషం, పట్టుదల ఎగేసుకొచ్చినాయి. గిరిజ ఉద్యోగంలో చేరిన దగ్గరనుంచి శంకరం తీరే మారిపోయింది. అతని దృష్టిలో నారాయణకి పీసమెత్తు విలువ లేకుండాపోయింది. సూటిగా నారాయణని చూడటానికే ఇష్టపడటంలేదు. 'ఓరి వెధవా! ఆడపిల్ల కష్టపడి సంపాదిస్తుంటే, పనీ పాటా లేకుండా తిరుగుతున్న నువ్వూ ఓ మనిషివేనా ?' అన్నట్టుగా వుంటాయి శంకరం చూపులు. అవి నారాయణని ముళ్ళలాగా గుచ్చుతూ వుంటాయి. ఉహు ఎంత కష్టపడి అయినా సరే తను ఏదో ఉద్యోగం సంపాదించుకోవాల్సిందే గానీ శంకరం సహాయం మాత్రం అడగను అని నిశ్చయించుకున్నాడు.

ఇంక చివరికి మిగిలిన ఆశ చలపతి మాత్రమే ! వెతికి, వెతికి చలపతిని ఓ స్నేహితుడి ఇంటిదగ్గర పట్టుకున్నాడు.

ఒంటరిగా వున్న సమయం చూసి నారాయణ తను వొచ్చిన పని చెప్పేశాడు. "చలపతీ, చాలా అర్జంటురా. ఎలాగయినా ఒక్క వెయ్యి రూపాయలు సర్దు. ఉద్యోగం రాగానే నీ బాకీ తీర్చేస్తాను" అంటూ ప్రాధేయపడ్డాడు.

చలపతికి పెద్దగా నవ్వొచ్చింది. తనూ అదే వేటలో వున్నట్టు ఈ నారాయణకి తెలియదల్లే వుంది. తన దగ్గర వుంటే నారాయణకి తప్పకుండా సహాయం చేసేవాడే. వేలకి వేలు ఖర్చు చేసిన తనకి అదొక లెక్కలోకి రాదు. కానీ ఈ క్షణంలో తనే ఎవరు అప్పు పెట్టగలరా అని ఎదురుచూస్తున్నాడు.

"సారీ బ్రదర్. నా దగ్గర వున్నప్పుడు నీకి బుద్ధి పుట్టలేదు. నీ బుద్ధి తిరిగినప్పుడు నా జాతకం మారింది. ఏం చేద్దాం ! దిసీజ్ లైఫ్" అన్నాడు చలపతి.

ఉసూరుమంటున్న ప్రాణంతో నారాయణ ఇంటికి తిరిగి వచ్చాడు, అలసి పోయిన శరీరం, అశాంతి నిండిన మనసుతో. ఎలాగయినా రెండురోజుల్లో ఆ డబ్బు సంపాదించలేకపోతే తనకి ఉద్యోగానికి కూడా ఆశ వదులుకోవాల్సిందే.

చిరాగ్గా గదిలోకి అడుగుపెట్టిన నారాయణకి షాక్ కొట్టినట్టుగా ఆగిపోయాడు. గిరిజ మంచంమీద దిండులో తలదూర్చి వెక్కి వెక్కి ఏడుస్తోంది. బయటి వాళ్ళకి వినపడకూడదన్నట్టుగా దుఃఖాన్ని తనలోనే దిగమింగుకునే ప్రయత్నంలో గుండెలు ఎగసిపడుతున్నాయి.

'గిరిజా, ఏమయింది ?' అంటూ తన వైపు తిప్పుకోబోయిన నారాయణ చేతుల్ని ఒక్క ఊపుతో విదిలించేసింది.

గిరిజని ఇలాంటి పరిస్థితిలో ఏనాడూ చూడలేదు నారాయణ. ఏదో జరిగింది. లేకపోతే ఇలా ఏడవదు.

"చెప్పు గిరిజా. ఎందుకు? ఏమయింది." గిరిజ వీపుని అనునయంగా రాస్తూ బుజ్జగిస్తున్నట్టుగా అడిగాడు.

గిరిజ చట్రున పడగ విప్పిన నాగినిలాగా లేచి కూర్చుంది. ఏడుపుతో ఎర్రబడిన కళ్ళు బుసలు కొడుతున్న పాము కళ్ళలా వున్నాయి.

"ఏమయిందా ? తెలుసుకోవాలనుకుంటున్నారా ? చెపుతా వినండి. నాకు తగిన శాస్తి జరిగిందండి. కావాలని మిమ్మల్ని పెళ్ళాడానే ? అందుకు తగ్గ ఫలితం దొరికిందండీ. మీరు అందలాలు ఎక్కిస్తారని మిమ్మల్ని పెళ్ళి చేసుకో లేదండీ. కనీసం గుప్పెడు మెతుకులు ఖార్యకి పెట్టలేరా అన్న ధీమాతో చేసుకున్నాను. అన్నయ్య మాటని కాదని మిమ్మల్ని కోరి చేసుకున్నాగదండీ ? అందుకే ఏడుస్తున్నాను. కట్టుకున్న పెళ్ళాన్ని నలుగురిలోకి తోలి మీ దోవన మీరు తిరుగుతున్నప్పుడే నేను గ్రహించవలసింది. పిచ్చిదాన్ని. నాకా ఆలోచనే రాలేదు. ఇప్పుడు యేడిచి ఏం ప్రయోజనం. ఎవరేం చేసినా భరించాలిసిందే ! కన్ను కొట్టినా, చెయిలాగినా, ముద్దు పెట్టుకున్నా భరించాల్సిందేనండీ !"

గిరిజకి మళ్ళీ దుఃఖం పొంగుకొచ్చింది. చేతుల్లో మొహం దాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

నారాయణ విస్తుపోయి చూస్తున్నాడు. గిరిజ ఇలా మాట్లాడగలదని ఏనాడూ వూహించలేదు. జరగరానిదేదో జరిగింది. గిరిజ భరించలేని ఆ బాధని తనలో ఇముడ్చుకోలేకపోతోంది. ఆ ఆవేశం, తీరూ, మాటలు అది ఒక్కనాటికీ తనెరిగిన గిరిజ కాదు. ఎవరేం చేశారు తన గిరిజని ? ఆ ఆలోచన రాగానే

నారాయణ కళ్ళు కోపంతో మండినాయి. ఆవేశంతో గుప్పిట బిగుసుకుంది. పళ్ళు పటపట లాడినాయి.

"ఎవరు గిరిజా! ఎవరు చెప్పు. నిన్ను అవమానించింది ఎవడో చెప్పు. వాడి గుడ్లు పీకేస్తాను. గొంతు పిసికేస్తాను. వాడిని, వాడిని చిత్రవధ చేస్తాను" నారాయణ ఆవేశంగా గిరిజ భుజాలు పట్టి వూపుతూ అరిచాడు.

గిరిజ చివ్వున తలెత్తి చూసింది. కళ్ళు క్రూరంగా నవ్వాయి నారాయణని చూసి. "అవునండీ, మీరు ఏమయినా చెయ్యగల సమర్థులు. ఇంతవరకు వుద్యోగం సద్యోగం లేని నారాయణ భార్యనని చెప్పుకుంటున్నారు గదా. ఇవాళనించీ హంతకుడి పెళ్ళాన్నని కూడా చెప్పుకుంటారు. మీరు బహు సమర్థులండీ. ఏదయినా చెయ్యగలరు." గిరిజ మనసులో ఇన్నాళ్ళుగా అణిచిపెట్టిన బాధ, దుఃఖం తెరలు తెరలుగా, అలలు అలలుగా తోసుకొస్తుంది.

శరీరంలోని శక్తి అంతా ఒక్కసారిగా లాగేసినట్టుగా గిరిజ భుజాల్ని పట్టుకున్న నారాయణ చేతుల పట్టు సడలిపోయింది. వాలిపోయిన తలతో నారాయణ కిటికీ చువ్వల్ని పట్టుకొని బయటి గాఢాంధకారంలోకి చూస్తూ నుంచున్నాడు.

గిరిజకి వళ్ళంతా అసహ్యంగా, మంటగా వుంది. చల్లగా తన శరీరంమీద పాకుతూ తడుముతున్న వెంకటప్పయ్య చేతులస్పర్శే జ్ఞాపకానికి వస్తోంది. అంతమేరా శరీరాన్ని తననుంచి ఎవరయినా వేరుచేస్తే బాగుండును అనిపిస్తోంది. బాధతో, దుఃఖంతో, అవమానంతో, కోపంతో ప్రపంచం కదలకుండా నిలిచిపోయినట్టుగా వుంది గిరిజకి. నారాయణ తలుపు తీసుకుని బయటికి వెళ్ళిపోయాడు.

29

తెల్లవారింది. నిద్రలేని గిరిజ మొహం ఉబ్బి, కళ్ళు ఎర్రబడినాయి. గిరిజ మొహం చూసి శారద కంగారుపడింది.

"అలా వున్నావేం గిరిజా? వొంట్లో బాగాలేదా!" అంది.

"ఏంలేదు. కొంచెం తలనొప్పిగా వుంది." గిరిజ శారద చూపుల్ని తప్పించుకుంటూ అంది.

"ఇవాళ సుషమ పుట్టినరోజు గదూ. తలంటి కొత్త గౌను వెయ్యి" అంది శారద.

గిరిజకి మనసులో ఉత్సాహం లేదు. శరీరంలో ఓపిక లేనట్లుగా వుంది. స్కూలుకి శలవు రాసి పంపించింది. తిరిగి ఆ స్కూలు ఆవరణలో అడుగు పెట్టాలన్నా, వెంకటప్పయ్య మొహం చూస్తూ పనిచెయ్యాల్సివస్తుందన్నా గిరిజకి భరించలేనట్టుగా అనిపిస్తోంది. మౌనంగా, నీరసంగా తిరుగుతున్న గిరిజని చూసి, శారద తనే సుషమకి తలంటి స్నానం చేయించింది. కొత్తగౌను తొడిగింది. గిరిజని అడిగి శంకరం చేయించి ఇచ్చిన బంగారపు గొలుసు సుషమ మెడలో వేసింది. కళ్ళకి కాటుక పెట్టి, బొట్టు దిద్దింది ఎత్తుకుని ముద్దులాడుతూ తండ్రి దగ్గరకి తీసుకువెళ్ళింది.

సుషమ చిన్న చిన్న మాటలన్నీ ముద్దు ముద్దుగా చెపుతోంది. రెండేళ్ళ సుషమ తెల్లగా బొద్దుగా ముచ్చటగా వుంది.

"తాతయ్య కాళ్ళకి నమస్కారం చెయ్యవే సుషమా" అంటూ సుషమని కిందకి దింపింది.

సుషమ సిగ్గుపడుతూ గొలుసుతో ఆడుకుంటూ నుంచుంది. శారదే సుషమ చేత దణ్ణం పెట్టించింది. సుందరయ్యగారు వారం రోజులుగా జ్వరంతో మంచంలోనే వుంటున్నారు. ఆయన చేతులు జాచి సు ష మ ని దగ్గరకి తీసుకున్నారు.

"అదృష్టవంతురాలివై వెయ్యేళ్ళు సుఖంగా వర్ధిల్లు తల్లీ" అంటూ ఆయన మనవరాలిని గుండెలకి అదుముకుని దీవించారు.

పార్వతమ్మగారు సుషమని ఎత్తుకుని ముద్దుపెట్టుకున్నారు.

'ఛీ అద్దు' అంటూ బుగ్గ తుడుచుకుంటున్న సుషమని చూసి నవ్వింది శారద, "ఓసి నీ నీకెన్ని సూకరాలే !" అంటూ.

సుషమ పరుగుపెడుతూ తల్లి దగ్గరకి వచ్చింది. గిరిజ గాజువాలినట్టుగా వున్న కళ్ళతో చూస్తున్నట్టే వున్నా దృష్టి ఎక్కడో వుంది. దగ్గిరకి తీసుకోని తల్లిని చూస్తూ, బిక్కమొహం వేసుకుని నిలబడిపోయింది సుషమ.

"ఒక్కసారి దగ్గరకు తీసుకో గిరిజా. చూడు ఎలా బిక్కమొహం వేసుకుని నిలబడిందో. దాని సింగారం చూపించాలని పరిగెత్తుకొచ్చింది" అంటున్న శారద మాటల్ని విని కూతురివైపు చూసింది. హఠాత్తుగా గిరిజ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. సుషమని దగ్గరకి లాక్కుని గుండెలకి అదుముకుంది. సుషమ సంతోషంతో కిలకిల్లాడింది.

"సుషమా ! అత్తయ్యచేత అన్నీ చేయించుకున్నావు గానీ, అత్తయ్యకి

ఒక్క ముద్దయినా పెట్టావా. పో అత్తకి ముద్దు పెట్టిరా." సుషమని కింద దింపుతూ అంది గిరిజ

పరుగుపెడుతూ దగ్గరగా వచ్చిన సుషమని వంగి చేతుల్లోకి తీసుకుంది శారద నవ్వుతూ.

సుషమ శారద రెండు బుగ్గలమీద ముద్దులు పెట్టి, వొడి దిగిపోయి పరుగు పెట్టింది తల్లి దగ్గరకి

గోపి, రమ సుషమని ఎత్తుకోవాలని పంతులు వేసుకుని, నేను ముందంటే నేను ముందంటూ దెబ్బలాడుకుంటున్నారు. సుషమ ఆ ఇద్దరికీ అందకుండా ఇల్లంతా పరుగులు పెడుతుంది.

రాత్రనగా బయటికి వెళ్ళిపోయిన నారాయణ ఇంతవరకు ఇంటికి రాలేదు. గిరిజ మనసంతా దిగులుగా వుంది. మనసు పశ్చాత్తాప పడుతోంది. ఎన్ని మాటలంది నారాయణని! ఆ బాధలో, దుఃఖంలో తనేమంటోందో తనకే తెలియకుండా పోయింది. ఆ ఆవేశం దిగిపోయిన తరువాత తనన్న మాటలన్నీ ఒక్కొక్కటే గుర్తుకి వస్తున్నాయి. గిరిజకి సిగ్గువేసింది. తనేనా అలా మాట్లాడింది. తన వాగ్బాణాలతో దెబ్బతిన్న పక్షిలాగా గిలగిల్లాడిపోయిన నారాయణ దీనవదనమే కళ్ళముందు కదులుతోంది గిరిజకి. అలా అని వుండ కూడదు అని తనలో తనే మధనపడుతోంది.

సాయంత్రం ఆరుగంటలవేళ వొడిలిపోయిన మొహంతో, దుమ్ము కొట్టుకున్న బట్టలతో ఇంటికి వచ్చారు నారాయణ. సరాసరి తన గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. రోజంతా తిరిగినవాడు తిరిగినట్టే వున్నాడు. అప్పు దొరికే మార్గంఎక్కడా కనిపించలేదు. వాడిబాణాల్లాగా గిరిజ అన్న మాటలే క్షణ క్షణం గుర్తుకొచ్చి, మనసుని తూట్లు పడేస్తున్నాయి. రేపు పొద్దున పదిగంటలలోగా వెయ్యి రూపాయలు ఎలా వస్తాయి? ఈ అవకాశం పోతే తనకి అప్పట్లో మరో వుద్యోగం దొరికే అవకాశం లేదు.

నిరాశగా నిస్పృహగా కళ్ళు మూసుకుని పడుకున్న నారాయణని చూసి గిరిజకి జాలేసింది. ఆప్యాయత పొంగుకొచ్చింది.

'భోజనానికి రాలేదేం?' అంది దగ్గరగా వస్తూ.

నారాయణ ఓసారి కళ్ళు తెరచి చూసి మళ్ళీ మూసుకున్నాడు.

మౌనంగావున్న భర్తని చూసి, అతనికి చాలా కోపం వచ్చిందని గ్రహించుకుంది గిరిజ.

"లేచి స్నానం చెయ్యండి. భోజనం చేద్దురు గాని. ఇవాళ సుషమ పుట్టిన రోజు" అంది మెల్లగా.

నారాయణ కదలక మెదలక, అలాగే పడుకొని వున్నారు. గిరిజ మంచం దగ్గర వొంగి కూర్చుని అతని చేతిని తన చేతుల్లోకి తీసుకుంది. "బాగా కోపం వచ్చింది కదూ. నేనేమంటున్నానో నాకే తెలియకుండా పోయింది. బాధ పడుతున్నారు కదూ" అంది మెల్లగా.

నారాయణ కళ్ళు తెరిచి ఆశ్చర్యంగా చూశాడు. ఒక్క క్షణం మనసంతా సంభ్రమంతో నిండిపోయింది. మరుక్షణమే ముకుళించుకుపోయింది. తావాలని తన జీవితాన్ని పంచుకొన్న ఈ అమాయకురాలిని తనేం సుఖపెట్టగలిగాడని!

"లేదు గిరిజా, నువ్వు అన్నదే నిజం! నన్ను చేసుకోకుండా వుండవలసింది" మెల్లగా అన్నాడు.

"నన్ను క్షమించండి. తొందరపడ్డాను." గిరిజ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నారాయణకి జాలి, ప్రేమ పొంగుకొచ్చినాయి. గిరిజ చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. క్షణాలు నిశ్శబ్దంగా దొర్లిపోతున్నాయి. నారాయణ పరాకుగా ఇంటికప్పుకేసి చూస్తూ పడుకున్నాడు.

నారాయణ చేతిలోంచి తన చేతిని విడిపించుకుని వెళ్ళి, సుషమని తీసుకు వచ్చింది గిరిజ.

సుషమ తండ్రిని చూడగానే మీదకి దూకింది సంబరంగా. సుషమని నారాయణ పొట్టమీద కూర్చోపెట్టి, లోపలకు వెళ్ళింది గిరిజ.

నారాయణ సుషమ మొహాన్ని తన దగ్గరగా లాక్కుని ముద్దుపెట్టు కున్నాడు. రెండురోజులుగా పెరిగిన గడ్డం గుచ్చుకుంది సుషమ లేతబుగ్గలకి. 'అబ్బా, అబ్బా' అంటూ చెంపలు రాసుకోసాగింది.

"ఏమ్మా, గడ్డం గుచ్చుకుందా" అంటూ నారాయణ కూతురి చెంపలు మృదువుగా రాస్తున్నాడు.

సుషమ పుట్టినరోజు అని సేమ్యా పాయసం చేసింది శారద. నారాయణ కోసరం చిన్న గ్లాసులో తీసి విడిగా వుంచింది. గిరిజ పాయసం గ్లాసు తీసుకుని నారాయణ దగ్గరకు వచ్చింది.

"సుషమ పుట్టినరోజని పాయసం చేసింది వదిన. తాగండి." గ్లాసు అందించింది నారాయణకి.

నారాయణ లేచి కూర్చుని గ్లాసులోని పాయసాన్ని సుషమకి కాస్త తాగించాడు. తను కాస్త తాగాడు.

పార్వతమ్మగారు లోపలనించి కేకవేసింది. 'శుక్రవారం గదుటర్రా, అమ్మవారి గుడికి వెళ్ళిరండి' అంటూ.

"సుషమా! దేముడి దగ్గరకు వెడదాం వస్తావా?'' గిరిజ అడగటంతోనే సుషమ తల్లి చంకనెక్కి కూర్చుంది.

శారద, గిరిజ, రమ, సుషమ గుడికి వెళ్ళటానికి తయారయ్యారు. ''శుక్ర వారంనాడు జనం విపరీతంగా వుంటారు. గిరిజా, పాప మెళ్ళో గొలుసు ఇంట్లో పడేసి వెళ్ళు. ఏ క్షణం ఎలాటిదో ఎవరు చెప్పగలం.'' వెనకనించి అంది పార్వతమ్మగారు.

గుమ్మం దాటబోతున్న గిరిజ వెనక్కి తిరిగివచ్చింది. సుషమ మెళ్ళోని గొలుసు తీసి పెట్టె తెరిచి జాగ్రత్తగా అడుగున వున్న చిన్న ప్లాస్టిక్ భరిణలో భద్రపరిచింది. పెట్టె తాళం వేసి, తాళం చెవిని మెడకివున్న గొలుసులో కట్టుకుంది. సుషమని ఎత్తుకుని నారాయణ దగ్గరగా వచ్చింది.

''మేం గుడికి వెళ్ళి త్వరగా వస్తాం. మీరు స్నానం చేయండి. మేం రాగానే భోజనం చేద్దురు గానీ'' అంటూ గిరిజ వెళ్ళిపోయింది.

అమ్మవారి ఆలయం జనంతో కిటకిటలాడుతోంది. విశాలమయిన ఆవరణ అంతా రంగు రంగుల పువ్వులు చల్లినట్టుగా రకరకాల స్త్రీలతో నిండి వుంది. గిరిజ, శారద, రమ, సుషమ పార్వతీఅమ్మవారి దర్శనం చేసుకున్నారు తల్లి చేయి పుచ్చుకుని సుషమ గుడిచుట్టూ పరుగులు పెడుతూ ప్రదక్షిణాలు చేసింది.

"తల్లీ జగన్మాతా! మా సంసారానికి ఒక దారి చూపించు. ఈ కష్టాలు, మనఃక్లేశాలు తొలగించు. నీ అనుగ్రహం ప్రసాదించు తల్లీ!" గిరిజ కళ్ళు మూసుకుని భక్తిగా అమ్మవారికి మనసులోనే ప్రణమిల్లింది.

ఆవరణలోని బొగడచెట్టునుంచి వీచే గాలి సుగంధాన్ని మోసుకొస్తూ మనసుకి ఆహ్లాదంగా వుంది. గిరిజ, శారద ఖాళీగావున్న జాగా చూసి కూర్చున్నారు. రమ, సుషమని వెంటపెట్టుకుని బొగడచెట్టు కింద పూలకోసం వెతుకుతోంది. క్రితం రాత్రినించి అంతులేని వ్యథతో, దుఃఖంతో నిండిన మనసు ఆ ప్రశాంత, పవిత్ర వాతావారణంలో తేలికపడుతున్నట్టుగా వుంది గిరిజకి. ఆ సుగంధ భరితమయిన చల్లటిగాలి, మనసును సేద దీరుస్తున్నట్టుగా వుంది.

నారాయణ కాలుకాలిన పిల్లిలా గదిలో పచార్లు చేస్తున్నాడు. మొహం అంతా చిరుచెమటలు అల్లుకున్నాయి. అతని దృష్టి క్షణక్షణానికి గిరిజ తాళం వేసిన పెట్టెవైపే వెడుతోంది. మళ్ళీ చటుక్కున దృష్టిని తిప్పుకుంటు న్నాడు. 'ఉహూ, వద్దు వద్దు' అన్నట్టుగా తలని ఊపుతున్నాడు. తనలో తనే మధనపడుతున్నాడు.

'వద్దు వద్దు' గిరిజ దృష్టిలో మరింత దిగజారిపోలేను.'

'కాదు కాదు, ఈ అవకాశం జారిపోతే నీకు మరింక దారిలేదు.'

'ఉహూ నే నీ పనిచెయ్యను.'

'నువ్వు కావాలనుకున్నప్పుడల్లా ఉద్యోగాలు నీ కాళ్ళదగ్గరికి రావు.'

'అయినా సరే.'

'సరే నీ ఖర్మ.'

నారాయణ అసహ్యం క్షణక్షణానికి పెరిగిపోతోంది. మొహాన పట్టిన చెమటని చేతితో అద్దుకున్నాడు. కిటికీ దగ్గర నిలబడి బయటి చీకటిలోకి చూస్తూ మిణుకు మిణుకు మంటూ ఆకాశంలో మెరిసే నక్షత్రాల్ని చూస్తున్నాడు. నారాయణ మనసులో ఆశ రెపరెప లాడుతోంది. ఏదో నిర్ణయం తీసుకున్నట్టుగా చటుక్కున పెట్టెదగ్గరగా వచ్చి తాళాన్ని చేతిలోకి తీసుకున్నాడు.

'గాజులు, గాజులు' అంటూ రాధ ఏడుస్తున్నట్టుగా వినిపించి, చేతితో సర్పాన్ని పట్టుకున్నట్టుగా చటుక్కున దూరంగా జరిగి చేతుల్లో మొహాన్ని దాచుకున్నాడు. రెండునిమిషాలకిగానీ ఆ గుండెదడ తగ్గలేదు. ధారగా మొహం మీదనించి చెమటలు కాల్వలు కడుతున్నాయి.

'నా మాటమీద వాళ్ళు రేపటివరకు ఆగారు. రేపు నువు చేరకపోతే మరొకరిని చూసుకుంటారు వాళ్ళు' అంటూ సత్యన్నారాయణ చెప్పిన మాటలు గుర్తుకొచ్చినాయి. 'వెయ్యి రూపాయలు రేపు పదిగంటల లోపల! ఎలా! ఎలా?' నారాయణ ఏదో నిశ్చయానికి వచ్చినట్టుగా చటుక్కున లేచి నిలబడ్డాడు. క్షణంలో పెట్టె తాళాన్ని విడతీశాడు. పెట్టె అడుగునించి ప్లాస్టిక్ భరిణ తీస్తుంటే చెయ్యి వణికింది.

"గిరిజా! నే నీ పని నాకోసం చెయ్యటంలేదు. మన సంసారాన్ని ఓ గట్టుకి చేర్చాలన్న తాపత్రయంతోనే చేస్తున్నాను. నేను ఆ మాట చెప్పినా నువు నమ్మవు. అందుకనే చేసి నా మాట అబద్ధం కాదని నిరూపిస్తాను. పాపకి వచ్చే పుట్టినరోజునాటికి ఇలాటిదే మరో గొలుసు చేయిస్తాను. నన్ను అర్థంచేసుకుంటావుగదూ!'' ఎదురుగా లేని గిరిజని సమాధానపర్చటానికి తన మనసులోనే సంజాయిషీ చెప్పుకుంటున్నాడు.

మిల మిల మెరుస్తున్న గొలుసు తీసి జేబులో వేసుకుని ఖాళీ భరిణని పెట్టె అడుగున పెట్టేశాడు. వూడిపోయిన తాళంకప్పని పెట్టెకి తగిల్చి గదిలోంచి ఎవరో తరుముకొస్తున్నట్టుగా బయటికి వెళ్ళిపోయాడు.

30

గిరిజ ఇంట్లోకి వస్తూనే సరాసరి నారాయణ ఉన్న గదిలోకి వచ్చింది.

"రండి భోజనం చేద్దురుగానీ వడ్డిస్తున్నా...!" గిరిజ మాటలు పూర్తి కాకుండానే గదంతా కలయజూసింది. నారాయణ లేడు. ఇంట్లో, పెరటిలో చూసి వచ్చింది. నారాయణ జాడ లేదు. మరోమారు గదిలో చూసివెడుతున్న గిరిజ గుమ్మందగ్గర ఆగిపోయింది ఏదో తట్టినట్టుగా. పాలిపోయిన మొహంతో మంచం కిందుగాఉన్న పెట్టెని బయటికి లాగి చూసింది. కొక్కానికి వ్రేలాడు తున్న తాళం చూడగానే గిరిజ మొహం వివర్ణమయిపోయింది. గబగబా బట్టల అడుగునఉన్న ప్లాస్టిక్ భరిణని తీసి చూసింది. ఖాళీగాఉన్న భరిణ గిరిజని వెక్కిరించినట్లయింది. ప్రాణం లేనట్టుగా అక్కడే కూలబడిపోయింది. కళ్ళలో నీరు ఇంకిపోయినట్లుగా పొడికళ్ళతో భరిణవైపే చూస్తున్న తల్లిని

వాటేసుకుంది సుషమ. తల్లి చేతిలోని భరిణని చూస్తూనే "గొలుసు, గొలుసు" అంటూ భరిణ తీసుకుని అందులో లేని గొలుసు కోసం వెతకసాగింది.

'అమ్మా, గొలుసు' అంటున్న సుషమని దగ్గరకి లాక్కుని గుండెల్లో ఇముడ్చుకున్న గిరిజకి అభయహస్త ముద్రతో వున్న అమ్మవారి రూపు కళ్ళ ముందు కదలాడింది. "తల్లీ, ఇదేనా నువు నాకు చూపించే దారి ?" అని ప్రశ్నిస్తున్నట్టుగా వున్న గిరిజ దృష్టి సర్వవ్యాపి అయిన ఆ తల్లికోసం వెతుకుతున్నట్టుగా చీకటిలోకి చూస్తూ వుండిపోయింది.

* * *

నారాయణ వందరూపాయల నోట్లని లెక్కపెట్టుకుని భద్రంగా పర్సులో పెట్టుకున్నాడు. కొట్లోంచి బయటపడి చకచకా నడవసాగాడు. అలవాటు ప్రకారంగా కాళ్ళు ఇంటికేసే సాగినాయి. అంతదూరంలో ఇంటిని చూడగానే చటుక్కున ఆగిపోయాడు. ఒక్కసారిగా చలిజ్వరం వచ్చినట్టుగా మనసు వొణికింది. జేబులోని పర్సుని గట్టిగా పట్టుకున్న చెయ్యి నిప్పుని ముట్టుకున్నట్టుగా మండినట్లయింది. ఊహు తనిప్పు డేం చెప్పినా గిరిజ నమ్మదు. తను ఉద్యోగంలో జేరి మొదటినెల జీతం తీసుకువచ్చి గిరిజ చేతిలో పెట్టినాడు గానీ తన మాట నమ్మదు. తను పూర్వపు నారాయణ కాదని అప్పుడుగానీ తెలుసుకోలేదు. జేబులో ఈ డబ్బుతో తను ఇంట్లో అడుగుపెట్టలేడు. నారాయణ చటుక్కున వెనక్కి తిరిగి చలపతి ఇంటికేసి నడవసాగాడు. సగందూరం నడవకుండానే 'నారాయణా' అన్న పిలుపు వినిపించింది.

చటుక్కున వెనక్కి తిరిగి చూసిన నారాయణకి పక్కసందులోంచి వస్తున్న చలపతి కనిపించాడు. దూరంనించే నారాయణని ఆగమన్నట్టుగా చెయ్యూపాడు.

చేతిలో డబ్బులేక చలపతి కార్యక్రమాలన్నీ ఎక్కడివక్కడే ఆగిపోయి నాయి. కనీసం పేకాటకు కూర్చుంటానికయినా క్లబ్బు బిల్ సెటిల్ చెయ్యందే ఆ క్లబ్బులోకి అడుగుపెట్టకూడదనుకున్నాడు చలపతి. ఆ మేనేజరు ప్రవర్తన అంత అవమానకరంగా వుంది చలపతికి. చేసేదేంలేక చలపతి పిచ్చి పట్టిన వాడిలాగా వూరంతా తిరుగుతున్నాడు. దోవలోనే నారాయణ ఎదురుపడ్డాడు.

"వెదకబోయిన తీగ కాళ్ళకే తగిలినట్టు, నువ్వే ఎదురొచ్చావు. మీ ఇంటికే వెడుతున్నాను" అన్నాడు నారాయణ చలపతి దగ్గరకి రాగానే.

"అదేం ? ఇవాళ అంత మంచి బుద్ధి పుట్టిందేం ?" అన్నాడు చలపతి.

"ఈ రోజుకి మీ యింట్లో ఆశ్రయం కావాలి." నారాయణ మెల్లగా నవ్వాడు.

చలపతి ఎందుకు, ఏమిటి అని అడగలేదు; ఒక్క క్షణం నారాయణని పరీక్షించి చూసి, పద, ఇంటికి వెడదాం. ఏం తోచక బోరుకొట్టి చస్తున్నాను! సమయానికి దేవుడల్లే వచ్చావు!" అన్నాడు.

ఇద్దరూ కలిసి చలపతి ఇంటికేసి నడవసాగారు. నారాయణ భోజనం చెయ్యనన్నా, బలవంతంచేసి తినిపించాడు చలపతి.

"ఒక ఆట వేద్దాం రా!" అంటూ చలపతి పేకముక్కలు పరవసాగాడు మంచంమీద కూర్చుని. నారాయణ మనసు ఆటమీద లేదు. పరాగ్గా ఉన్న నారాయణని మధ్యల్లో హెచ్చరిస్తూనే వున్నాడు చలపతి. నారాయణ ఆ రోజు శారీరకంగా- మానసికంగా బాగా అలసిపోయాడు.

పదకొండు గంటలు కొట్టటం వినిపించగానే పేకముక్కలు కిందపడేస్తూ ఆవలిస్తూ లేచి నుంచున్నాడు నారాయణ.

"ఇంక ఆడలేను బాబూ నిద్రవస్తోంది" అన్నాడు.

చలపతి గెస్ట్ రూమ్‌లో నారాయణకి పక్క ఏర్పాట్లు చేశాడు. మరి కాసేపు నారాయణ మంచంమీద కూర్చుని కబుర్లు చెప్పి తన గదికి వెళ్ళిపోయాడు.

"చలపతీ! ఆరుగంటలకల్లా లేపుతావు గదూ" అంటూ కేకేసి చెప్పాడు నారాయణ.

నారాయణకి చెప్పలేని ఆరాటంగా వుంది. చల్లటి ఫానుగాలి కింద పడుకున్నా వొళ్ళంతా వేడెక్కినట్టుగా వుంది. షర్టు విప్పి స్టాండుకి తగిలించాడు. పంకా జోరు హెచ్చించాడు. కిటికీలకున్న పరదలన్నీ పూర్తిగా పక్కకి తోశాడు. గది తలుపులు దగ్గరగా వేసి లైట్‌స్విచ్ ఆఫ్ చేశాడు పలచని వెన్నెలలా బ్లూ లైట్ కాంతి గదంతా పరుచుకుంది. మెత్తగా వున్న పరుపుమీద వెల్లకిలా పడుకున్న నారాయణ తలలో పైన తిరుగుతున్న పంకాలాగా గిరిగిర ఎన్నెన్నో ఆలోచనలు తిరిగిపోతున్నాయి.

పొద్దుటే లేచి స్నానంచేసి షాపుకి వెళ్ళి గడ్డం చేయించుకోవాలి. చాకలివాడి దగ్గరికి వెళ్ళి వాడి మొహాన ఈ మురికి బట్టలు పారేసి, వాడి దగ్గరున్న ఇస్త్రీ బట్టలు జత తీసుకోవాలి తొమ్మిది గంటలకల్లా సత్యన్నారాయణని కూడా వెంటబెట్టుకుని ఆ చిట్‌ఫండ్ కంపెనీకి వెళ్ళాలి. వాళ్ళకి సెక్యూరిటీ డబ్బు కట్టేసి వెంటనే పనిలో జేరిపోవాలి. ఒక్కనెల ఆగుతే జీతం చేతికి వస్తుంది. అందులో ఒక్కరూపాయయినా ఖర్చుపెట్టకుండా తీసుకువెళ్ళి

గిరిజ చేతిలో పెట్టాలి. తను కాస్త నిలదొక్కుకునేవరకు గిరిజని ఉద్యోగం చెయ్యనిస్తాడు. ఆ పైన గిరిజని హాయిగా విశ్రాంతి తీసుకోమని చెపుతాడు. సుషమకి మళ్ళీ వచ్చే పుట్టినరోజుకి అచ్చు అలాటిదే గొలుసు చేయించి ఇవ్వాలి. తను పస్తులుండయినా సరే ఆ పని చెయ్యాలి.

నారాయణకి గొలుసు గుర్తురాగానే చటుక్కున లేచి కోటుస్టాండు దగ్గరికి వెళ్ళాడు. తన షర్టు జేబులో వున్న పర్సుని తీసుకువచ్చి దిండుకింద భద్రంగా దాచాడు. కళ్ళు మూసుకుని కలల్లోకి జారిపోయాడు.

31

చలపతి గణగణ మ్రోగిన అలారం మోత విని ఉద్రేకంగా లేచి కూర్చున్నాడు. రోజూ పదిగంటలయితే తప్ప చలపతికి తెల్లవారదు. నారాయణ ఆరు గంటలకల్లా మేలుకొలపమని చెప్పటంతో, అలారం సెట్ చేసి పెట్టాడు.

చలపతి తలుపులు తోసుకుని నారాయణ నిద్రపోతున్న గదికి వెళ్ళాడు. గది ఖాళీగా వుంది. అరే అప్పుడే వెళ్ళిపోయాడా అనుకుంటున్న చలపతి కళ్ళలో స్టాండుకు తగిలించి ఉన్న నారాయణ పట్టు కనబడింది. 'ఓహో, బాత్‌రూంకి వెళ్ళి వుంటాడు' అనుకుంటూ వెనుదిరగబోతున్న చలపతి ఎందుకో ఆగిపోయాడు. మంచంమీది దిండుకిందనించి ఏదో నల్లగా కనబడటంతో, చలపతి దగ్గరగా వెళ్ళి దిండు ఎత్తి చూశాడు. పర్సు. చలపతి చేతిలోకి తీసుకుని అప్రయత్నంగా తెరిచాడు! పర్సునిండుగా వందరూపాయల నోట్లు. చలపతికి నిద్రమత్తు వదిలిపోయింది. పెళపెళ లాడుతున్న వందరూపాయల నోట్లు కొత్తపెళ్ళికూతుళ్ళలాగా అణిగి మణిగి కూర్చున్నట్టుగా వున్నాయి పర్సులో.

చలపతి కొన్ని నెలలనుంచీ అంత డబ్బు ఒక్కసారిగా చూడటమే గగనమయిపోతోంది. చలపతికి అణిగివున్న కోరికలన్నీ ఒక్కసారిగా విజృంభించాయి. రేసులకి వెళ్ళి కొన్ని నెలలవుతోంది. పేకాట ఆడి కొన్ని రోజులవుతోంది. సిగరెట్లకి వెతుక్కోవాల్సి వస్తోంది. మరింకెన్నో అవసరాలు అతి బలవంతాన నిగ్రహించుకుంటున్నవన్నీ చెలియలికట్ట దాటిన కడలి తరంగాల్లా, ఉరుకులు పరుగులతో తోసుకురాసాగాయి. చలపతి ఒక్క క్షణం సందేహించాడు. తనేం పేదరికంవల్ల ఈ పని చెయ్యటంలేదు. పరిస్థితుల ప్రభావంవల్ల తన దగ్గర డబ్బుకి కటకటగా వుందిగానీ తలిదండ్రులకి తనొక్కడే కొడుకు. వాళ్ళకివున్న లక్షలాస్తి తనదే. ఈ రోజు కాకపోతే రేపయినా తనేగదా

వారసుడు. వాళ్ళ కోపం తగ్గకాపోదు. తను ఆస్తికి హక్కుదారు కాకనూ మానడు అప్పుడు దీనికి రెండు రెట్లు నారాయణకి ఇచ్చేస్తాడు. కావాలంటే క్షమాపణ కూడా చెప్పుకుంటాడు.

చలపతి తను చేస్తున్న పనిని తనే సమర్థించుకోసాగాడు. నోట్లని తీసి తన జేబులో కుక్కుకుని ఖాళీపర్సుని తలగడకింద వుంచి, పిల్లిలా గది తలుపులు మూసి, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

32

నారాయణ స్నానంచేసి వచ్చి బట్టలు వేసుకుని, దిండుకిందనించి పర్సు తీసి జేబులో పెట్టుకున్నాడు. చలపతి గదిదగ్గరికి వచ్చి తలుపుతట్టాడు.

"ఎవరది ?" చలపతి ఆవలిస్తూ లేచి వచ్చి తలుపుతీశాడు. ఎదురుగా నారాయణని చూస్తూనే "హలో, ఆరింటికి లేపమన్నావు కదూ! సారీ బ్రదర్. పదవుతేనేగానీ నాకు తెల్లవారినట్లుండదు" అంటూ నవ్వాడు.

"పోనీలే. నాకు ఐదింటికే మెలకువ వచ్చేసింది."

"రా, కూర్చో, కాఫీ తీసుకుందాం" అంటూ చలపతి నౌకర్ని పిలిచాడు.

"వద్దు గా చలపతీ! నేను బయట తీసుకుంటాలే" అన్నాడు నారాయణ

"ఏమిటి ఇంత పొద్దున్నే నువ్వు చేసే రాచకార్యం. కాఫీ తాగటానిక్కూడా టైము లేదంటావు ?" చలపతి మంచంమీద కూర్చుంటూ అడిగాడు.

"ఇవాళ నా జీవితంలో ఎంతో విశేషమయిన రోజు చలపతీ."

చలపతి సిగరెట్ వెలిగిస్తూ ఆగి ఆశ్చర్యంగా చూశాడు.

నౌకరు లోపలికి వచ్చాడు. కాఫీ, టిఫిను తెమ్మని చెప్పాడు చలపతి.

"ఊఁ, ఇంతకీ విశేషం ఏమిటో చెప్పలేదు." వలయాలుగా తిరుగుతున్న సిగరెట్ పొగలోంచి చూస్తూ అడిగాడు చలపతి.

ఈ రోజు నేను ఉద్యోగంలో జేరబోతున్నాను చలపతీ. ఇవాళనించి నా జీవితంలో మరో అధ్యాయం ప్రారంభం కాబోతోంది."

నారాయణ సంతోషాన్ని ఇట్టే పసికట్టేశాడు చలపతి.

"గుడ్. అయితే డబ్బు దొరికిందన్నమాట. దీనికోసమేనా నన్ను అడిగావు వారంరోజుల క్రిందట ?"

"అవును. డబ్బు దొరికింది." నారాయణ కిటికీలోంచి పడుతున్న సూర్య కిరణాలని చూస్తూ మెల్లగా అన్నాడు.

నౌకరు వేడి ఇడ్లీ, కాఫీలు తీసుకువచ్చాడు.

నారాయణ టిఫిను తిన్నాడు. చలపతి కాఫీ తాగుతూ తోటలో విరగ బూసిన పూలచెట్లని చూస్తున్నాడు.

నారాయణ కాఫీ పూర్తిచేసి టేబిల్ మీదనున్న గడియారంవైపు చూశాడు. ఏడుగంటలు దాటింది.

"చాలా థాంక్స్ చలపతీ."

"నువ్వు మాటి మాటికీ థాంక్స్ చెప్పకురా బాబూ, బదులుచెప్పే అలవాటు నాకు లేదు."

నారాయణ నవ్వుతూ లేచి నిలబడి ఒక అడుగువేసి ఆగిపోయాడు.

"చలపతీ! నువ్వు మరో సహాయం చెయ్యాలి."

"ష్యూర్ చెప్పు."

"మనం ఏ పనయినా మొదలుపెట్టేటప్పుడు నలుగురి శుభాశీస్సులు వుంటే ఆ పని జయప్రదం అవుతుందని మా అమ్మ అంటూ వుంటుంది. ప్రస్తుతం నా దగ్గరవున్న మిత్రుడివి నువ్వొక్కడివే గాబట్టి ఆ పెద్దరికం నువ్వు పుచ్చుకోవాలి" అన్నాడు నారాయణ.

చలపతి మంచం దిగి వచ్చి నారాయణ భుజంమీద చెయి వేశాడు. "విష్ యూ ఆల్ ద బెస్ట్ ఆఫ్ లక్ మై డియర్ ఫ్రెండ్. దిసీజ్ మై సిన్సియర్ విష్ గుడ్ లక్."

చలపతి గొంతులో ఏదో అడ్డుపడినట్టయింది. అంతరాంతరాల్లో ఏదో సన్నటి బాధ. సూటిగా నారాయణ మొహంలోకి చూడలేనట్టుగా పక్కకి చూస్తూ మెల్లగా అన్నాడు.

"థాంక్యూ వెరీమచ్." నారాయణ చలపతి చేతిని నొక్కి వదిలేశాడు.

"వస్తా చలపతీ" అంటూ నారాయణ గది బయటకి రాగానే వసుంధరాదేవి ఎదురొచ్చింది.

నారాయణ నమస్కారం చేశాడు. ఆవిడ చిరునవ్వుతో తలవూపింది

"మమ్మీ! నారాయణ ఇవాళ ఉద్యోగంలో చేరబోతున్నాడు." వెనకగా వచ్చిన చలపతి చెప్పాడు.

"చాలా సంతోషం నారాయణా! ఈ పని ఎప్పుడో చెయ్యవలసింది. పోనీలే. ఇప్పటికయినా తెలుసుకున్నావు" అందావిడ చలపతివైపు చూస్తూ.

"ఈ బుద్ధి నీకు ఎప్పటికి వస్తుందో నాయనా ?" అన్నట్టుగా వున్న ఆ వా చూపుని తప్పించుకుంటూ చలపతి ఎటో చూడసాగాడు.

"నేను బయల్దేరగానే మీరే ఎదురొచ్చారు. నా కెంతో సంతోషంగా వుందండీ," అన్నాడు నారాయణ. అతనికి చటుక్కున తల్లి గుర్తుకి వచ్చింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగినట్లయింది.

ఆవిడ నవ్వింది. "శుభంగా వెళ్ళి జేరు నారాయణా" అందావిడ.

నారాయణ ఆ యిద్దరి దగ్గరా శలవు తీసుకుని అప్పుడే తెరుస్తున్న బార్బర్ షాపులో దూరి గడ్డం చేయించుకున్నాడు. డబ్బులివ్వటానికి పర్సు తెరవ బోతూ అందులోని వందరూపాయల నోట్లు, షాపువాడి కంటబడటం ఎందుకు అన్నట్టుగా గోడవైపు తిరిగి, పర్సుని కిందుగా పట్టుకుని చిల్లరవుండే అరలో చెయ్యి వుంచి అర్ధరూపాయి తీసి చటుక్కున పర్సుమూసి జేబులో పెట్టుకున్నాడు. షాపువాడికి డబ్బులిచ్చి సరాసరి చాకలివాడింటికి వెళ్ళాడు. వాడి దగ్గరున్న బట్టల్లోంచి నారాయణ తన షర్టు, పేంటు తీసుకుని అక్కడే బట్టలు మార్చుకుని, విప్పినవి షాపులోనే పడేసి బయలుదేరాడు. వాడుక చాకలి గనుక వాడికి డబ్బు ఇవ్వవలసిన అవసరం లేకపోయింది.

'సత్యంగారూ' అంటూ నారాయణ వెళ్ళేసరికి సత్యన్నారాయణ అప్పుడే తయారవుతున్నాడు కొట్టు తెరవటానికి.

"రా, పొ పొ పొద్దున్నే వచ్చావ్?" అన్నాడు.

"నాతోబాటు మీరుకూడా ఆ కంపెనీకి రావాలండీ వాళ్ళు మీకు బాగా తెలిసినవాళ్ళు. నాకంతా కొత్త" అన్నాడు నారాయణ.

సత్యన్నారాయణ పెద్దగా నవ్వాడు. "క క కంపెనీ ప ప పదిగంటలగ్గానీ తె తె తెరవరయ్యా" అన్నాడు.

"పోనీ లెండి ఆ టైముకే వెళదాం. ఈలోపల మీరు కొట్టుపని చూసుకోండి," అన్నాడు.

"మ మ మరి డబ్బు?" అసలయింది వుందా లేదా అన్న సందేహం వచ్చింది సత్యన్నారాయణకి.

"వుంది లెండి తెచ్చాను." జేబులోని పర్సుని తట్టుతూ అన్నాడు.

సత్యన్నారాయణా, నారాయణా కలసి వెళ్ళి తాళ్ళకొట్టుని తెరిచారు తొమ్మిది గంటలయ్యేవరకు కొట్టుమీదే గడిపారు. సత్యన్నారాయణ తెప్పించిన కాఫీ తాగాడు నారాయణ.

పదిగంటలవుతూండగా, ఇద్దరూ బయలుదేరి చిట్‌ఫండ్ కంపెనీకి వచ్చారు. అక్కడి మేనేజరు సత్యన్నారాయణకి బాగా పరిచయం వున్నవాడు. నారాయణని

పరిచయం చేశాడు. ఫార్మాలిటీస్ పూర్తయి ఫారమ్‌తోబాటుగా డబ్బు చెల్లించటానికి పర్సుతీశాడు నారాయణ నోట్లు పెట్టిన అరలివున్న జిప్ ఓపెన్‌చేసిన నారాయణ వెయ్యివేల ఓల్టుల షాక్ తగిలినట్టుగా అలాగే నిలబడిపోయాడు. ఊపిరి ఆడుతోందా లేదా అన్న అనుమానం వచ్చింది ఎదురుగా వున్నతనికి.

నారాయణ వాలకంచూసి సత్యన్నారాయణకి ఏదో అనుమానం వచ్చింది. దగ్గరగావచ్చి భుజంమీద చెయ్యివేస్తూ, 'నారాయణా' అంటూ పిల్చాడు.

నారాయణనికి ఒక్కసారిగా స్పృహ కలిగినట్టయింది. కంగారుగా పర్సులోని ఒక్కొక్క అరే గాలించేస్తున్నాడు. చేతులు వొణుకుతున్నాయి. కళ్ళు వర్షించటానికి సిద్ధంగావున్న మేఘాల్లా వున్నాయి మొహమంతా చిరుచెమటలు అలుముకున్నాయి.

నారాయణ కాళ్ళల్లో వున్న శక్తి హరించిపోయినట్టుగా ఎదురుగావున్న బల్లమీద కూర్చుండిపోయాడు.

'ఏమయిందండీ' అంటూ మేనేజరు ప్రశ్నించాడు.

"డబ్బు కనిపించటం లేదండీ వెయ్యిరూపాయలు ఇందులోనే పెట్టాను." నూతిలోంచి వచ్చినట్టుగా వున్న నారాయణ మాటలకి ఆయన ఆశ్చర్యంగానూ, అనుమానంగానూ చూశాడు.

"మరోసారి గుర్తుతెచ్చుకోండి, మరెక్కడయినా పెట్టారేమో" అన్నాడాయన సత్యన్నారాయణ జాలిగా చూస్తున్నాడు నారాయణని.

నారాయణ కళ్ళుమూసుకుని అతికష్టంమీద ప్రొద్దుట తను నిద్రలేచిన క్షణంనుంచి, ఇప్పటివరకు జరిగిందంతా వివరంగా గర్తుచేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు.

నారాయణకి మనసులోని ఆరాటంతో ఐదుగంటలకల్లా మెలకువ వచ్చింది. అయినా అరగంటపైగా కళ్ళుతెరుచుకుని మంచంమీదే పడుకున్నాడు. ఆరవుతుండగా లేచి కూర్చుని లైటువేశాడు. పర్సుతెరిచి చూసాడు అందులోని పదివందల రూపాయలనోట్లు భద్రంగా వున్నాయి. పర్సుమూసేసి యధాప్రకారం దిండక్రిందవుంచి బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు పళ్లుతోమి, స్నానంచేసి బయటపడేసరికి ఆరున్నర అయింది. బట్టలేసుకుని పర్సు జేబులో పెట్టుకుని చలపతితో కలిసి టిఫిను తీసుకున్నాడు. బార్బర్‌షాపులో అతిజాగ్రత్తగా ఎవరి కంటపడకుండా చిల్లరమాత్రం తీసి పర్సు జేబులో పెట్టుకున్నాడు చాకలికి డబ్బు ఇవ్వనేలేదు. తిరిగి పర్సు తెరిచింది ఈ క్షణంలోనే. డబ్బు మాయమయింది.

అంటే అంటే తను ప్రొద్దున చూసిన తరవాతనించీ ఈ మూడుగంటల లోపల డబ్బు మాయమయింది. అదీ పర్సు పర్సుగానే వుండి అందులోని నోట్లు మాత్రం మాయం అయ్యాయి. చిల్లరంతా యధాప్రకారంగానే వుంది. నారాయణ ఎంత ఆలోచించినా డబ్బు ఎలా మాయమయిందీ అర్థంకావటంలేదు. బాకలి దగ్గర బట్టలు మార్చుకునేటప్పుడు కూడా తను పర్సు ఎదురుగా పెట్టుకునే మార్చుకున్నాడు ఆ క్షణంలో ఆ గదిలో ఎవరూలేరు కూడాను. వెంటనే పర్సుని జేబులో పెట్టుకున్నాడు.

కళ్ళుమూసుకుని అదే ఆలోచిస్తున్న నారాయణకి ఒక విషయం రూఢి అయింది. తను బాత్‌రూమ్‌లోకి వెళ్లేటప్పుడు చూసినప్పుడు డబ్బు పర్సులోనే వుంది. పర్సును జేబులో పెట్టుకున్నతరువాత పోయే ఆస్కారంలేదు. అంటే తను స్నానంచేసి వచ్చేలోపల ఎవరో ఆ నోట్లని తీసుకుని వుండాలి. అవును తను పర్సు దిండుకిందవుంచి అరగంటపైగా బాత్‌రూమ్‌లో వుండిపోయాడు. జరిగిందేదో అప్పుడే జరిగివుండాలి.

నారాయణకి ఆ విషయం రూఢిఅయ్యేసరికి గుండెలు టకటక కొట్టుకోవొచ్చి నాయి చలపతి ఇంట్లో ఎవరిపనయివుంటుంది? తను బాత్‌రూమ్‌లోవున్న సమయంలో ఎవరో గదిలోకి వచ్చివుండాలి. ఎవరయివుంటారు? నౌకర్లా? తను తలుపుతట్టినతరువాతే చలపతి నిద్రలేచి వచ్చి తలుపుతీశాడు. ఏకాగ్రతగా ఆలోచిస్తున్న నారాయణకి ఎక్కడో అలారం బెల్లులాటిది వినిపించింది మనసులో. జాగ్రత్తగా గుర్తుచేసుకున్నాడు. తను బాత్‌రూములోకి వెళ్లేసమయంలో ఎక్కడో అలారం మ్రోగినట్లుగా జ్ఞాపకం వస్తోంది నారాయణకి.చలపతిగదిలోనా? తను చలపతితో ఆరుగంటలకల్లా నిద్రలేపమని చెప్పాడు. చలపతి ఆరుగంటలకి అలారం పెట్టివుండాలి. తనని లేపటానికి వచ్చివుండాలి. తను బాత్‌రూమ్‌లో వున్నాడు. ఎదురుగా దిండుకింద పర్సు.

నారాయణ ఇంక ఆలోచించలేకపోయాడు. అంటే...అంటే...చలపతి... చలపతి. చలపతి అలాటిపని చేస్తాడంటే నారాయణకి నమ్మబుద్ధికావటంలేదు.

నారాయణకి ఒక్కొక్కటే గుర్తుకి వస్తున్నాయి. తను అప్పు అడిగినప్పుడు చలపతి డబ్బు లేదన్నాడు. తను రోడ్డుమీద ఎదురయినప్పుడు బోర్‌కొట్టి వస్తున్నారాబాబూ అన్నాడు డబ్బులేనప్పుడే చలపతికి బోర్‌కొడుతూ వుంటుంది అంటే చలపతి డబ్బు ఇబ్బందుల్లో వుండి వుండాలి. ఎదురుగా ఇంత డబ్బు చూసేసరికి మనసు చలించి వుండవచ్చు. నారాయణ చటుక్కున లేచి నిల్చున్నాడు. తను వెంటనే చలపతిని కలుసుకుంటేగానీ ఈ మిస్టరీ విడిపోదు.

నారాయణ చకచకా పరుగెత్తినట్టుగా బయటికి నడిచాడు. 'నా న్నా నారాయణా! ఎ ఎక్కడికి?' అంటూ సత్యన్నారాయణ వెనకనుంచి అరవటం నారాయణకి వినపడలేదు.

రన్నింగ్ రేస్‌లోలాగా పరుగెడుతున్నాడు నారాయణ. ఆయాసంవచ్చి రోడ్డు వారగా ఓ క్షణం ఆగాడు. ఎదురుగా కాస్మాపాలిటన్ క్లబ్బు, బయట ఏదో టాక్సీ ఆగివుంది. నారాయణకి చటుక్కున ఓ ఆలోచన వచ్చింది. క్లబ్బులో కనుక్కుంటే తెలుస్తుంది. చలపతి డబ్బు ఇబ్బందుల్లో వున్నదీ, లేనిదీను.

చటుక్కున నారాయణ దృష్టి క్లబ్బు లోపలినించి వస్తున్న వ్యక్తి మీదపడింది. చలపతి! మరో స్నేహితుడితో కలిసి టేక్సీదగ్గరగా వస్తున్నాడు.

'చలపతీ' అంటూ నారాయణ వేసిన కేకకి రోడ్డుమీద తిరుగుతున్న జనం అంతా తలలు తిప్పి వింతగా నారాయణకేసి చూశారు.

చలపతి టేక్సీలో కూర్చున్నాడు. టేక్సీ కదలబోతోంది. నారాయణ ఒక్క ఉదుటున రోడ్డుకి అడ్డంగా పరుగుతీశాడు, టాక్సీ ఎక్కడ కనుమరుగవుతుందో అన్నట్టుగా. వెనకనించి స్పీడుగా వస్తున్న కారుని చూడనేలేదు. 'కీచు'మంటూ ఆగిపోయిన కారు బ్రేకులు, ఒక్కక్షణం ఆలస్యంగా పనిచేశాయి. నారాయణ శరీరం నెత్తుటిమడుగులో తేలింది.

చుట్టూ జనం పోగయ్యారు. చలపతి, స్నేహితుడు టేక్సీదిగి కారుదగ్గరగా వచ్చారు. గుంపుని చీల్చుకుంటూ లోపలికి జొరబడిన చలపతి గుండెలు ఆగిపోతాయేమో నన్నట్టుగా చేత్తో గుండెల్ని నొక్కుకుంటూ నిలబడిపోయాడు

'నారాయణా' అన్నమాట వొణుకుతున్న నోట్లోంచి బయటికి రావటంలేదు. చలపతికి కళ్ళు తిరిగి వొళ్ళు తూలినట్లయింది. నారాయణ జేబులోంచి తొంగి చూస్తున్న ఖాకీపర్సు నెత్తుటి మడుగులో తేలుతోంది. చలపతికి స్పృహ తప్పినట్లయింది. పక్కనున్న స్నేహితుడి భుజంమీద తలవాల్చి కళ్ళుమూసుకున్నాడు.

"చలపతీ! వాడు నారాయణరా, మన నారాయణ" అంటున్న స్నేహితుడి పిలుపు చలపతికి వినపడలేదు స్నేహితుడు కంగారుగా చలపతిని చేత్తో పొదివిపట్టుకుని జనంలోనించి ఇవతలకి లాక్కొచ్చాడు. భళ్ళున వాంతి చేసుకున్న చలపతి రోడ్డుమీదే కుప్పలా కూలిపోయాడు.

33

సుందరయ్యగారు ఆ రోజే జ్వరం కాస్త తగ్గినట్టుగా వుండటంతో వీధిలో కుర్చీవేసుకుని కూర్చున్నారు. ఎవరో మనిషి ఎదురుగా నిలబడటంతో తలఎత్తి చూశారు.

'ఎవరూ?' అన్నారాయన కళ్ళు చిట్లించి చూస్తూ.

"నేను నారాయణ ఫ్రెండునండీ" అన్నాడా మనిషి.

"ఊఁ, నారాయణ ఇంట్లో లేడనుకుంటా బాబూ" అన్నారాయన.

అతను సందేహిస్తూనే కబురు చల్లగా చేరేశాడు.

"నారాయణకి యాక్సిడెంటు జరిగిందండీ. హాస్పిటల్లో వున్నాడు" అన్నాడు మెల్లగా.

'ఆ' అంటూ తెరుచుకున్న సుందరయ్యగారి నోరు అలాగే వుండిపోయింది. వచ్చినతనికి కంగారుపుట్టింది.

'ఏవండీ' అంటూ గట్టిగా పిల్చాడు

సుందరయ్యగారు జవాబు చెప్పలేదు. నోరు మూతపడలేదు. కళ్ళు తెరిచి చూస్తూనే వున్నాయి.

శారద అతని కేకకు లోపల్నించి పరిగెత్తుకు వచ్చింది. అతను విషయం శారదకి చెపుతూ 'ఆయన అలా అయిపోయారేవిటండీ. కాస్త మాట్లాడించండి' అన్నాడు గాబరాగా.

శారద తండ్రి దగ్గరగా వచ్చి చేత్తో కదుపుతూ 'నాన్నా' అని పిలిచింది. ఆ కుదుపుకి ఆయనతల భుజంమీదికి వాలిపోయింది శారద ఘొల్లుమంది. గిరిజ, పార్వతమ్మగారు పరుగెత్తుకువచ్చారు. ఇరుగు పొరుగు చేరారు.

సుందరయ్యగారి శరీరంలోంచి ప్రాణవాయువు అనంతవాయువుల్లో కలిసి పోయిందని నిర్ధారణచేశారు.

రోధనతో నిండిపోయిన ఆ యింట్లో, ఏడుపురానట్టుగా చూస్తున్నది గిరిజ మాత్రమే. శంకరం సుందరయ్యగారి కొడుకులకు టెలిగ్రాములు ఇప్పించి గిరిజని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళాడు. నారాయణని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకువెళ్ళారు.

పరిస్థితి ప్రమాదకరంగా వుందని చెప్పారు డాక్టర్లు గిరిజ శంకరం ఆపరేషన్ థియేటరు బయట కూర్చుని వున్నారు. ఎప్పటికో తలుపులు తెరుచుకున్నాయి శంకరం, గిరిజ ఆత్రుతగా లేచి నుంచున్నారు.

"ఇప్పుడే ఏమీ చెప్పలేం" అంటూ డాక్టర్లు వెళ్ళిపోయారు.

పీడకలలాంటి నెలరోజులు గడిచిపోయినాయి. నారాయణ బెడ్‌మీద పడుకుని వున్నాడు. కాళ్ళమీద దుప్పటి కప్పివుంది.

సాయంత్రం నాలుగు గంటలయింది. హాస్పిటల్ విజిటర్స్‌తో సందడిగా వుంది. నారాయణ బెడ్‌దగ్గర గిరిజ, శంకరం, చలపతి, సత్యన్నారాయణ వున్నారు.

"నారాయణా! రేపు డిశ్చార్జి చేస్తామన్నారు. ఇంటికి వెళ్ళిపోవచ్చు రేపు" అన్నాడు శంకరం.

నారాయణ విని మౌనంగా వూరుకున్నాడు.

"న్నా న్నా నారాయణా, నువు చా చా చాలా అదృష్టవంతుడివోయ్" అన్నాడు సత్యన్నారాయణ.

'ఇది అదృష్టమంటారా?' నారాయణ దుప్పటికప్పివున్న కాళ్ళవైపు చూస్తూ మెల్లగా నవ్వాడు.

ఆ నవ్వు అందరిగుండెల్ని పిండేట్టుగావుంది. గిరిజ కళ్ళు తుడుచుకుంది. సత్యన్నారాయణకి జాలివేసింది.

"కా కాలు పోయిందని బా బా బాధపడతావేంటి? పే పే ప్రాణంపోయుంటే ఏ ఏ ఏంజేసేవాడివి?" కోపంగా అభిమానంగా అన్నాడు సత్యన్నారాయణ

"హాయిగా వుండేది. అందరం అదృష్టవంతులం అయ్యేవాళ్ళం." నవ్వుతూనే

అన్నాడు నారాయణ. ఆ నవ్వులోని దిగులు, బాధ, చలపతి గుండెల్లోకి దూసుకుపోయింది. తలవంచుకున్నాడు.

"మీ అన్నయ్యలిద్దరూ నీ కాలు ఎలావుందో రాయమంటూ ఉత్తరాలు రాశారు" అన్నాడు శంకరం.

నారాయణ మౌనంగా విన్నాడు. సుందరయ్యగారి ఖర్మకాండలు పూర్తవ్వ గానే, శలవులేదంటూ కొడుకులిద్దరూ వెళ్ళిపోయారు. తల్లినికూడా తమతో రమ్మన్నారు. హాస్పిటల్లో వున్న నారాయణని విడిచి వెళ్ళనంది.

నారాయణకి జరిగిన ప్రమాదానికి తానే కారణం అన్న మాట చలపతి గుండెల్లో నాటుకుపోయింది. మనిషి తీసిపోయాడు. మౌనంగా, దిగులుగా వుంటున్నాడు. అంతరాత్మ అనుక్షణం చేసే చీత్కారాలని భరించలేకుండా వున్నాడు. చలపతికి ఎన్నో చెడ్డగుణాలు వుండవచ్చు. కానీ అతనిలాటి నీచపు పని ఏనాడూ చేసి ఎరగడు. చేతినిండా ఎల్లవేళలా డబ్బు నిండుగా వుండేది. మాయచేసో, కల్లబొల్లి ఖబుర్లుచెప్పో సంపాదించేవాడు, తల్లిదగ్గరనుంచి. ఎలాటి దురదృష్టపు క్షణంలో తనకెలాటి ఆలోచనవచ్చిందో చలపతికే అనూహ్యంగా వుంది. ఆ కుటుంబానికి కలిగిన ఆపదకి, దుఃఖానికి తానే కారణం అన్న వ్యధ అతన్ని నిలవనీయకుండా చేసింది. అతనికి ఆ క్షణంలో ఒకే ఒక్క మార్గం కనిపించింది. జరిగింది జరిగినట్టుగా అక్షరం పొల్లుపోకుండా తండ్రిదగ్గర నివేదించుకున్నాడు.

రాజేశ్వర్రావుగారు కొడుకు చెప్పినదంతా విని బాధపడ్డారు. ఆయన ఎంతటి పక్కా వ్యాపారస్తులో, అంతటి ఉదారపురుషులు కూడాను.

చేతులు కాలిన తరువాత ఆయన మాత్రం చేయగలిగింది ఏముంది కనుక. రెండువేల రూపాయలు చలపతికి ఇచ్చారు. నారాయణకి నయం అయి ఇంటికి వచ్చేవరకు ఖర్చుపెట్టమని చెప్పారు.

ఈసారి చలపతి చేతికి డబ్బు ఇవ్వటానికి ఆయన సందేహించలేదు. మనుషుల్ని చదువగలిగే నేర్పు ఆయనకి పుట్టుకతోనే అబ్బింది. కొడుకులోని పశ్చాతాపాన్ని ఆయన గ్రహించారు. అందుకే చలపతి చేతికి నిర్భయంగా డబ్బుని ఇవ్వగలిగారు.

విజిటర్స్ టైం అవటంతో ఒకొక్కరే మెలమెల్లగా వెళ్ళిపోతున్నారు. సత్యనారాయణ నారాయణకి ధైర్యం చెప్పి వెళ్ళిపోయాడు. శంకరాన్ని పంపటానికి గిరిజ వరండా వరకు వెళ్ళింది.

చలపతి ఈ అవకాశం కోసరమే వెనకగా ఆగిపోయాడు. నారాయణ దగ్గరగా వచ్చి, అతని చేతిని తన చేతిలోకి తీసుకుని 'నారాయణా' అంటూ పిల్చాడు.

నారాయణ తలెత్తి చూశాడు. చలపతి కళ్లు తడిగా వున్నాయి.

'నన్ను క్షమించు నారాయణా!' మెల్లగా అన్నాడు.

నారాయణ ఆప్యాయంగా చలపతి చేతిని నొక్కాడు. వేదాంతిలాగా నవ్వాడు మెల్లగా. అతనికిప్పుడు చలపతిమీద ఏవగింపు గానీ, కోపం గానీ లేదు. 'అంతా మర్చిపో చలపతీ. జరిగేది మన మంచికే అనుకుంటే గాని బ్రతకలేని మనుషులం' అన్నాడు నారాయణ.

చలపతి వెళ్ళిపోయాడు. గిరిజ లోపలికి వచ్చింది. నారాయణ మనసు ఆర్ద్రంగా వుంది. పిచ్చిది. తనని కావాలని చేసుకుని ఎన్ని అవమానాలు, ఎంత బాధ, దుఃఖాన్ని అనుభవించిందో.

'గిరిజా!' మెల్లగా పిల్చాడు నారాయణ.

గిరిజ దగ్గరగా వచ్చింది.

"నీకు చాలా అన్యాయం చేశాను గిరిజా." ఆమె మొహంలోకి చూస్తూ మెల్లగా అన్నాడు.

గిరిజ అతని కాళ్ళమీద దుప్పటి సరిజేస్తూ "కష్టసుఖాలు మనుషులకేగదా వచ్చేది. బాధ ఎందుకు?" అంది.

"ఈ కుంటివాడితో జీవితాన్ని గడపగలవా గిరిజా?" అతని ప్రశ్న విని గిరిజ జాలిపడింది.

"ఈ కుంటితనం నాకే వచ్చివుంటే మీరేం చేసేవారు?" అతని జుట్టుని మెల్లగా సవరిస్తూ గిరిజ ఎదురుప్రశ్న వేసింది.

నారాయణ ముఖంలో సంతోషం చిందులేసింది. గిరిజ చేతిని అందుకుని కళ్ళమీద వుంచుకున్నాడు.

"గిరిజా! దేముడు చాలా పెద్దవాడు సుమా. నేను పెద్దవాడిగా వున్నంతకాలం నన్ను చల్లగా చూశాడు. మంచివాడిని అయిపోదామనుకుంటూ వుండగానే కుంటి వాడిని చేసేశాడు. చూశావా విచిత్రం!"

"బాగుంది తర్కం. అయితే ఈసారి మనకి పుట్టబోయే బాబుకి దేముడు అని పేరుపెడదామా?" అంది నవ్వుతూ.

నారాయణ గిరిజని పరీక్షగా చూశాడు. అంతవరకు అతను ఆ విషయాన్నే

గమనించలేదు. నారాయణ చూపుని ఎదుర్కొనలేక గిరిజ సిగ్గుతో తలవంచు కుంది.

* * *

కథ చెపుతూ గతంలోకి జారిపోయిన నారాయణ కొడుకు పిలుపుతో తిరిగి చూశాడు.

"చెప్పు నాన్నా. కథ చెబుతానంటూ మాట్లాడవేం? అప్పుడేమయింది ఆ అబ్బాయికి?" అంటూ అడుగుతున్నాడు సురేష్.

"ఆ అబ్బాయి శ్రద్ధగా చదివేవాడు కాదు. అందుకని బాగా చదువొచ్చేది కాదు. చదువు మధ్యలో ఆపేశాడు. వాడినేదయినా వుద్యోగం చెయ్యమనేవాడు వాళ్ళ నాన్న. ఆ అబ్బాయికి బద్ధకం ఎక్కువ. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనుకున్నాడు. అందుకని బోలెడన్ని లాటరీ టిక్కెట్లు కొంటూ వుండేవాడు ఇంట్లోంచి డబ్బు తీసుకువెళ్ళి.కానీ ఆ అబ్బాయికి ఒక్కసారి కూడా ఒక్క రూపాయి అయినా రాలేదు. వాళ్ళ అమ్మ, నాన్న ఎప్పుడూ బాధపడుతూ వుండేవాళ్ళు ఆ అబ్బాయిని గురించి. వాళ్ళు పెద్దవాళ్ళు అయిపోయారు. అయినా ఆ అబ్బాయి కాణీ సంపాదన లేకుండా తిరుగుతూ వుండేవాడు. అప్పుడేమయిందంటే?"

"ఏమయింది నాన్నా?" అంటూ సుషమ కూడా వచ్చి కూర్చుంది.

"ఏమయిందంటే? ఆ అబ్బాయికి స్నేహితులున్నారని చెప్పాకదూ. ఆ స్నేహితుకి ఒక చెల్లెలుండేది. ఆ అమ్మాయి ఇష్టపడి ఈ మొద్దబ్బాయిని పెళ్ళి చేసుకుంది." అప్పుడేమయిందంటే......

"ఏమయింది నాన్నా!" సుషమ తండ్రికి దగ్గరగా జరిగింది.

"ఏమయిందంటే అప్పుడు ఆ అబ్బాయికి, అమ్మాయికి ఇలాటి ఓ చిన్న అమ్మాయి పుట్టింది." అంటూ నారాయణ సుషమని దగ్గరగా తీసుకున్నాడు.

కథ వింటున్న గిరిజ నవ్వింది సురేష్ కూడా నవ్వాడు సుషమ సిగ్గుపడింది. "పోండి నాన్నా. తరవాత చెప్పు" అంది కోపంగా.

"తరవాతేమయిందంటే? ఆ పాపాయికి పాలు పట్టటానికి కూడా డబ్బు వుండేది కాదు. అయినా ఆ అబ్బాయికి బుద్ధిరాలేదు. సంపాదన లేకుండా అలాగే తిరుగుతూ వుండేవాడు. అందుకని ఆ అమ్మాయి ఉద్యోగంలో చేరింది."

"ఆ అబ్బాయి చాలా చెడ్డవాడు కదా నాన్నా?" సుషమ మధ్యలో అంది.

"అవునమ్మా. చాలా చెడ్డవాడు! అప్పుడు ఒకరోజున ఆ అబ్బాయికి కారు ఏక్సిడెంటు జరిగింది."

"చచ్చిపోయాడా నాన్నా?" సురేష్ ఆత్రంగా ప్రశ్నించాడు.

"చచ్చిపోలేదు. కానీ ఆ అబ్బాయి కాలు పోయింది. కుంటివాడయిపోయాడు. ఆ ఖబురు వింటూనే వాళ్ళ నాన్న కాస్తా చచ్చిపోయాడు. ఆ అబ్బాయి దిగులుతోనే వాళ్ళమ్మ కూడా చచ్చిపోయింది."

"తరవాత ఏమయింది నాన్నా?"

"మరి ఆ అబ్బాయేమో కుంటివాడుగదా! బయటికి వెళ్ళి పని చెయ్యలేడు. పని చెయ్యకపోతే డబ్బురాదు. అందుకని అప్పుడు ఆ అమ్మాయేమో ఆ అబ్బాయికి ఒక సలహా చెప్పింది. టైపు నేర్చుకోమని చెప్పింది. ఆ అమ్మాయే సంపాదించి అందరినీ పోషించేది. ఆ అబ్బాయి స్నేహితులు కూడా చాలా సహాయం చేసేవాళ్లు. కొన్నాళ్ళయ్యాక ఆ అబ్బాయి టైపు చెయ్యటం బాగా నేర్చుకున్నాడు. కొంచెం కొంచెంగా డబ్బు సంపాదించటం మొదలుపెట్టాడు. అప్పుడేమో ఆ అమ్మాయి బి.ఎ చదివి పాసయింది. టీచరు ట్రైనింగు కూడా అయింది. హైస్కూల్లో టీచరుగా చేరింది. మరి మధ్యలో వాళ్ళకి ఇంకో అబ్బాయి కూడా పుట్టాడు" అంటూ ఆగాడు నారాయణ.

"అప్పుడేమయింది?" సురేష్ ప్రశ్న.

"కథ కంచికి మనం ఇంటికి. సురేష్ నేనొకటి అడుగుతా చెపుతావా?" అన్నాడు నారాయణ.

"ఓ" తలెగరేశాడు సురేష్.

"మరి ఆ అబ్బాయికి, అమ్మాయికి యిన్ని కష్టాలెందుకని వచ్చాయిరా. చెప్పు చూద్దాం?" అన్నాడు నారాయణ.

"ఆ అబ్బాయి చాలా చెడ్డవాడు నాన్నా." ఠక్కున సమాధానం చెప్పాడు సురేష్.

"ఎందుకని చెడ్డవాడురా?"

వాడికి జవాబు తట్టలేదు.

"ఎందుకంటే? ఆ అబ్బాయి చదువుకోవాల్సిన వయసులో చదువుకోలేదు. ఉద్యోగం చెయ్యాల్సిన వయసులో ఉద్యోగం చెయ్యలేదు. కష్టపడి పనిచెయ్యకుండా లాటరీల్లో లక్షలు సంపాదించాలనుకునేవాడు. అందుచేతే వాళ్ళ అమ్మ, నాన్న చచ్చిపోయారు వాళ్ళకి అన్ని కష్టాలు వచ్చాయి. అవునా?"

అవునన్నట్టుగా సురేష్ తల వూపాడు.

"అందుకని నీది ఇప్పుడు చదువుకునే వయసు. ఇప్పుడు బాగా చదువుకుంటే మంచి ఉద్యోగం వస్తుంది. బోలెడంత డబ్బు సంపాదిస్తావు. అప్పటికి నువు పెద్దవాడివి అవుతావు. నీకు తెలివితేటలూ, బుద్ధీ పెరుగుతాయి. నువు సంపాదించేటప్పుడు నీకు మంచిదని అనిపిస్తే అప్పుడు లాటరీ టిక్కెట్లు కొందువుగానీ. లాటరీలు మంచివికాదు అనిపిస్తే మానేద్దువుగాని. సరేనా!"

సురేష్ ఓ క్షణం ఆలోచించి తలూపాడు అంకీకారసూచకంగా. నారాయణ సురేష్ని దగ్గరకి తీసుకున్నాడు. "మరి ఇప్పుడు రూపాయి ఇవ్వమంటావా అమ్మని?" అన్నాడు.

"ఉహూం. మా మాష్టారు కూడా కేకలేస్తారు" అన్నాడు వాడు.

"గుడ్ బాయ్" నారాయణ కొడుకు భుజం తట్టాడు.

శంకరం, భార్య తలుపు తోసుకుని లోపలకు వచ్చారు. గిరిజ సంభ్రమంగా ఎదురు వెళ్ళింది.

"హైదరాబాదునించి ఎప్పుడు వచ్చారన్నయ్యా? కూర్చో వదినా" అంటూ మర్యాదచేసింది.

"రాత్రే వచ్చామమ్మా! బాగున్నారా అంతా?" శంకరం సురేష్ని దగ్గరకి తీసుకుంటూ అడిగాడు.

"ఈ పదిరోజులకే గిరిజ నీ మీద బెంగపెట్టుకుంది శంకరం. రోజూ క్యాలెండరు చూడటమే. పదిహేనో తారీఖు ఎప్పుడొస్తుందా అని?" నారాయణ నవ్వాడు.

"శంవు పదిరోజులన్న పేరే గానీ క్షణంలో గడిచిపోయిందనుకో. హైదరాబాదులో ఆరు రోజులున్నాం; రెండు రోజులు నాగార్జునసాగర్ తిరిగి యథాస్థాన ప్రవేశయామి."

"శారద వదిన కులాసాయేనా?" గిరిజ వదినగారిని అడిగింది.

"బాగానే వున్నారు ఎప్పుడూ మిమ్మల్నే తలుస్తూ వుంటుందావిడ" అంది శంకరం భార్య.

"గోపీ వుద్యోగం కోసరం అని ఆవిడ తప్పనిసరిగా వెళ్ళవలసి వచ్చింది గానీ, ఆవిడ వెళ్ళిపోయాక మాకూ్కా ఇల్లంతా చిన్నబోయింది," అంది గిరిజ దిగులుగా.

శంకరం చేతిలో వున్న పాకెట్ విప్పి అందమయిన హేండ్‌బ్యాగ్ సుషమకి, మౌత్ ఆర్గన్ సురేష్‌కి ఇచ్చాడు.

"ఇవి చలపతి మావయ్య మీకివ్వమని పంపిదాడ్రా" అన్నాడు శంకరం.

"చలపతి బావున్నాడా శంకరం?" నారాయణ అడిగాడు.

"వాడికేం, పెళ్ళికొడుకులాగా వున్నాడు. హైదరాబాదు వెళ్ళాక పక్కా బిజినెస్ మాన్ అయిపోయాడు. ఇప్పుడు వాళ్ళ నాన్న బిజినెస్సంతా వాడే చూస్తున్నాడు. మిమ్మల్నందరినీ శలవుల్లో హైదరాబాదు రమ్మని మరీ మరీ చెప్పాడు" అన్నాడు శంకరం.

శంకరం భార్య హేండ్‌బ్యాగ్‌లోంచి అందమయిన రెండు పెన్నులు తీసి సుషమకి ఒకటి, సురేష్‌కి ఒకటి ఇచ్చింది.

"ఇవి మీ మావయ్య ప్రెజంటేషన్. తీసుకోండి" అంది.

పెన్నులు చూడగానే గిరిజకి ఇదివరకటి సంగతులు గుర్తుకొచ్చినాయి.

"అన్నయ్యా! వదినకి రోజుకెన్ని పెన్నులు కొనిస్తున్నావు?" అంది నవ్వుతూ.

గిరిజ అడిగిందేమిటో శంకరానికి అర్థంకాలేదు.

"ఏవిటమ్మా? పెన్నులేవిటి?" అన్నాడు.

"మామ్మ బ్రతికిఉండగా నేనెప్పుడూ పెన్నులు పాడుచేస్తానని కేకలేసే వాడివి. కొత్తపెన్ను కొని ఇమ్మంటే రచయిత్రివి అవుతావా అంటూ భయపడి పోయేవాడివే పాపం? మరిప్పుడు మా రచయిత్రి వదినగారిని ఎలా చేసుకున్నావు?" అంటూ నవ్వింది గిరిజ.

"అరే మీ అన్నయ్యకి రచయిత్రులంటే అంత భయం వున్న సంగతి తెలియదే!" శంకరం భార్య మాటలకి అంతా నవ్వారు.

శంకరం భయం నటించాడు. ఇలాటివన్నీ బయటపెట్టెయ్యకే గిరిజా. మీ వదిన మన కథ రాసెయ్యగలదు.

"ఓహో అయితే అన్నా చెల్లెళ్ళు అంతటి గ్రంథసాంగులన్నమాట." నవ్వించావిడ.

"నువ్వన్నమాట నిజమేనన్నయ్యా. 'వీళ్ళ'తో వేగలేం."

గిరిజ వదినగారిని చూసి కొంటెగా అన్న మాటలకి అందరూ ఫక్కున నవ్వారు. నవ్వులు పువ్వుల జల్లులై రాలినాయి.

———